PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 44 సంచిక : 84 | విజయవాడ, శనివారం 26 అక్టోబర్ 2024 | 8 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Saturday 26 October 2024 | Rs

భళా బిఎస్ఎన్ఎల్..

- కొత్తగా 55 లక్షల పైగా ఖాతాదారుల చేరిక
- ప్రయివేటు టెల్కోలకు గుడ్‌బై

3



కష్టాల్లో టీమిండియా

- తొలి ఇన్నింగ్స్‌లో156 పరుగులకే కుప్పకూలిన భారత్
- 301పరుగుల ఆధిక్యతలో న్యూజిలాండ్

8


6వేల కోట్ల కరెంటు షాక్

- ఇంధన సర్దు'పోటు' ఛార్జీల వడ్డింపు • డిసెంబరు నుండే వసూళ్లు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ప్రజానీకానికి మూడు నెలలకే రాష్ట్ర ప్రభుత్వం మోత మోగించింది. అధికారంలోకి వస్తే విద్యుత్ ఛార్జీలు పెంచబోమంటూ ప్రకటించిన టిడిపి కూటమి 6,072 కోట్ల రూపాయల భారాన్ని మోపింది. 2022-23 సంవత్సరానికి ఫ్యూయల్ అండ్ పవర్ పర్చేజ్ కాస్ట్ అడ్జస్ట్‌మెంట్(ఎఫ్‌పిపిసిఏ) వసూళ్లకు (ట్రూఅప్ ఛార్జీలు) ఎపి ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ (ఎపిఇఆర్‌సి) అనుమతించింది. ఈ మేరకు శుక్రవారం విడుదల చేసిన ఉత్తర్వుల్లో డిస్కమ్‌ల ప్రతిపాదనలను పరిశీలించిన అనంతరం ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపింది. ఇప్పటికే అధిక ధరలతో సతమతమౌతున్న సామాన్య ప్రజానీకానికి ఇది పెనుభారం కాగా, డిస్కమ్‌లు రూ.8,114 కోట్లు ప్రతిపాదిస్తే అందులో రూ.2,042 కోట్లు తగ్గించి ఉపశమనం కల్గించినట్లు ఎపిఇఆర్‌సి పేర్కొనడం గమనార్హం. ఎస్‌పిడిసిఎల్ పరిధిలో సరాసరిగా నెలకు యూనిట్‌కు అత్యధికంగా రూ.0.83 పైసలు, సిడిపిడిసిఎల్ పరిధిలో రూ.0.79పైసలు, ఈడిడిసిఎల్ పరిధిలో రూ.0.80 పైసలు అదనంగా వసూలుకు అవకాశం కల్పించింది. 2022-23 సంవత్సరానికి సంబంధించి వినియోగించిన విద్యుత్‌పై ఈ ఏడాది నవంబరు నుండి విధించే ఎఫ్‌పిపిసిఏలో నెల వారీగా యూనిట్‌కు ఎంత వసూలు చేయాలనేది కూడా సూచించింది. ఈ మొత్తాన్ని డిసెంబర్ నెల నుండి వినియోగదారుల నుండి వసూలు చేయనున్నారు.

2022 ఏప్రిల్‌లో వినియోగించిన విద్యుత్‌కు ట్రూ అప్ ఛార్జీలను ఈ ఏడాది నవంబరు, డిసెంబరులో వసూలు చేయనున్నారు. 2022 మేనెల ఖర్చును 2025 జనవరి, ఫిబ్రవరి నెలలో వసూలు చేస్తారు. 2022 జూన్ వినియోగాన్ని 2025 మార్చి, ఏప్రిల్‌లోనూ, జులై నెల వినియోగాన్ని 2025 ఫిబ్రవరి, 2022 ఆగస్టు వినియోగాన్ని 2025 మార్చిలో వసూలు చేయనున్నారు. సెప్టెంబరు వినియోగాన్ని ఏప్రిల్‌లోనూ, అక్టోబరు వినియోగాన్ని మేనెలలోనూ, నవంబరు వినియోగాన్ని జూన్‌లోనూ, డిసెంబరు వినియోగాన్ని జులైలోనూ వసూలు చేస్తారు. 2023 జనవరిలో వినియోగించిన మొత్తాన్ని 2025 ఆగస్టు, సెప్టెంబరులోనూ, ఫిబ్రవరి వినియోగాన్ని 2025 అక్టోబరు, నవంబరులోనూ, మార్చి వినియోగాన్ని 2025 డిసెంబరు, 2026 జనవరిలోనూ వసూలు చేసుకునేందుకు అనుమతిచ్చింది.



వెంటనే ఉపసంహరించండి : సిపిఎం

ఎఫ్‌పిపిసిఏ ఛార్జీల పేరిట ప్రజలపై రూ.6072 కోట్ల భారాన్ని విధిస్తూ ఎపి విద్యుత్ రెగ్యులేటరీ కమిషన్ ఇచ్చిన ఉత్తర్వులను వెంటనే ఉపసంహరించాలని సిపిఎం రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు విడుదల చేసిన ప్రకటనలో ఇప్పటికే ధరల పెరుగుదల, ఉపాధి సన్నగిల్లి ఆదాయాలు తగ్గడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్న ప్రజలపై ఇలా విద్యుత్ భారం మోపడం అమానుషమని తెలిపారు. ఏనాడో వాడిన కరెంటుకు ఏళ్లు గడిచిపోయాక అదనంగా చార్జీలు చెల్లించాలన్న ఎఫ్‌పిపిసిఏ విధానం మోసపూరితమైందని తెలిపారు. ప్రపంచబ్యాంకు ఆదేశిత విద్యుత్ సంస్కరణల్లోని దుర్మార్గమైన షరతుల్లో ఇది ముఖ్యమైందని పేర్కొన్నారు.

2022-23లో వాడిన కరెంటుకు ఈ నవంబరు నెల నుండి 2026 జనవరి వరకూ కొన్ని నెలల్లో యూనిట్‌కు దాదాపు రూ.0.83 పైసలు అదనంగా చెల్లించాలని తాజా ఉత్తర్వు ఇచ్చిందని, ఇది విద్యుత్ వినియోగదారులకు కష్టమని, పేదలకు పెనుభారమని పేర్కొన్నారు. ఉదాహరణకు నెలకు 30 యూనిట్ల కన్నా తక్కువ వాడేవారు ఇప్పుడు యూనిట్‌కు రూ.1.90 పైసలు చొప్పున చెల్లిస్తున్నారని, ఇక ముందు రూ.2.73 పైసలు చెల్లించాల్సి వస్తుందని పేర్కొన్నారు. గతంతో పోల్చుకుంటే ఇది 44 శాతం పెరుగుదలని వివరించారు. అధికారానికి వస్తే విద్యుత్ ఛార్జీలు నియంత్రిస్తామని, విద్యుత్ బిల్లుల భారం తగ్గిస్తామని ఉమ్మడి మ్యానిఫెస్టోలో హామీలిచ్చిన టిడిపి కూటమి ప్రభుత్వం తగ్గించడం సంగతలా ఉంచితే ఇప్పుడు అమాంతం 44 శాతం పెంచడం దారుణమని తెలిపారు. షార్ట్‌టర్మ్ కొనుగోళ్ల పేరుతోగత ప్రభుత్వం అనుసరించిన తప్పుడు విధానాన్ని ఈ ప్రభుత్వం కొనసాగించడం గర్హనీయమని తెలిపారు. మాటతప్పి ప్రజలపై వేసిన ట్రూఅప్ ఛార్జీల భారాన్ని రాష్ట్ర ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. విద్యుత్ ఛార్జీల పెంపుదలను నిరసించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

తెల్లకార్డు ఉంటేనే...!

- ఆధార్ కూడా తప్పనిసరి
- 'ఉచిత గ్యాస్'పై మంత్రి నాదెండ్ల
- 29 నుంచి బుకింగ్ ప్రారంభం





ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఎల్‌పిజి గ్యాస్ కనెక్షన్‌తో పాటు తెల్ల రేషన్‌కార్డు ఉన్న వారికి మాత్రమే ఉచిత గ్యాస్ పంపిణీ పథకం వర్తిస్తుందని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. సచివాలయంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ లబ్ధిదారులు తప్పనిసరిగా ఆధార్‌కార్డును కూడా అందించాల్సి ఉంటుందని అన్నారు. ఈ పథకం కింద లబ్ధిదారులుగా ఎంపికయ్యేందుకు ఈ మూడు తప్పనిసరి అని ఆయన చెప్పారు. టిడిపి కూటమి ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు మహిళల భద్రతను దృష్టిలో ఉంచుకుని ఈ నెల 31న దీపావళి కానుకగా అమలులోకి తీసుకు వస్తున్న ఈ పథకాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రారంభిస్తారని ఆయన చెప్పారు. ఈనెల 29 నుంచి ఈ పథకం కింద బుకింగ్స్ ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. గ్యాస్ బుక్ చేయగానే సంబంధిత లబ్ధిదారుని ఫోన్ నెంబరుకు ఎస్ఎంఎస్ వస్తుందన్నారు. పట్టణ ప్రాంతాల్లో 24గంటలు, గ్రామీణ ప్రాంతాల్లో 48 గంటల్లో గ్యాస్ సిలిండర్లు డెలివరీ చేయనున్నట్లు మంత్రి తెలిపారు. సిలిండర్ డెలివరీ అయిన 48 గంటల్లో లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలకు డిబిటి పద్ధతిలో సబ్సిడీ మొత్తాన్ని జమ చేయనున్నట్లు తెలిపారు. ఈ పథకం అమల్లో ఏదైనా సమస్యలు ఎదురైతే పరిష్కారం కోసం 1967 టోల్ ఫ్రీ నెంబర్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు. ఈ పథకం అమలుకు సంబంధించి ఇప్పటికే మూడు ఆయిల్ కంపెనీలతో మాట్లాడినట్లు ఆయిల్ కంపెనీల వద్ద నున్న డేటా, ప్రభుత్వం వద్దఉన్న డేటాను అనుసంధాన పరుస్తూ ఈ పథకాన్ని అమలు చేయనున్నట్లు చెప్పారు.క్యాబినెట్ నిర్ణయం మేరకు నిత్యావసర వస్తువుల ధరల స్థిరీకరణకు సిఎం ఒక కమిటీని వేశారని తెలిపారు. ఆ కమిటీ ఏర్పడిన తరువాత కందిపప్పురేటును రూ.180 నుంచి రూ.160లకి, అనంతరం రూ.150కి తగ్గించే విధంగా హోల్‌సేల్ డీలర్లతో మాట్లాడినట్లు చెప్పారు. రేషన్ డిపోల ద్వారా కందిపప్పు రూ.67లకే ఇస్తున్నట్లు తెలిపారు. పామాయిల్ పై ఉన్న కస్టమ్ డ్యూటీని కేంద్రం 7శాతం నుంచి 27శాతానికి పెంచిన నేపథ్యంలో రూ.92లుగా ఉన్న ధర రూ.130లకు పెరిగిందన్నారు. కమిటీచొరవ తీసుకుని దాని ధర రూ.110లకు తగ్గించగలిగిందని తెలిపారు. ఉల్లిపాయ, టమోటా ధరల నియంత్రణకు మార్క్‌ఫెడ్ సహకారంతో రాయితీపై తక్కువ ధరలకే ప్రజలకు అందుబాటులో ఉంచినట్లు చెప్పారు. జాతీయ ఆహార భద్రతాచట్టం కింద అర్హులైన వారందరికీ 2029 వరకు ఉచితంగా బియ్యాన్ని కేంద్రం పంపిణీ చేయనుందని, ఇందులో రాష్ట్రంలో తెల్లరంగు కార్డుల్లో 60శాతం కార్డులకు మాత్రమే ఈ పథకం వర్తింపు అవుతోందని,మిగిలిన 40శాతాన్ని రాష్ట్ర ప్రభుత్వమే భరిస్తున్నట్లు మంత్రి నాదెండ్ల వెల్లడించారు. ఈ మీడియా సమావేశంలో పౌరసరఫరాలశాఖ కమిషనరు వీరపాండియన్, పౌరసరఫరాల సంస్థ ఎండి మనజీర్ జిలానీ సమూన్ పాల్గొన్నారు.

ఒడుదుడుకుల్లో పత్తి సాగు

- నవ్యాంధ్ర ఉనికిలోకొచ్చాక ఈ ఏడాదే కనిష్టం
- నార్మల్ కంటే 4.50 లక్షల ఎకరాల తగ్గుదల
- విపత్తులు, ఖర్చుల పెరుగుదల, కల్తీ సీడ్, పెస్టిసైడ్స్, ధరల పతనాలే కారణం

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి- అమరావతి

రాష్ట్రంలో పత్తి సాగు తీవ్ర ఒడుదుడుకులకు గురవుతోంది. కొన్నేళ్ల కింద ఆహార పంటలతో సహా ఏ పంట వేసినా వేయకపోయినా పత్తిని కచ్చితంగా సాధారణ విస్తీర్ణానికి తగ్గకుండా రైతులు వేసేవారు. పలు మార్లు నార్మల్ కంటే ఎక్కువ విస్తీర్ణంలో సాగు చేసిన సందర్భాలున్నాయి. తొలకరి వాన పడితే చాలు పత్తి విత్తనాలు విత్తేవారు. ఖరీఫ్‌లో సాగు విస్తీర్ణ పరంగా చూస్తే వరి, వేరుశనగ తర్వాతి స్థానం పత్తిదే. కొన్నేళ్ల నుంచి వేరుశనగను అధిగమించి రెండవ స్థానంలోకొచ్చింది కూడా. సంప్రదాయంగా పత్తి పండించే ప్రాంతాలే కాకుండా కొత్త చోట్లకు సాగు విస్తరించింది. రాయలసీమలో నూనెగింజల స్థానంలో పత్తిని సాగు చేస్తున్నారు. వాణిజ్య పంటల్లో ప్రధానమైనదిగా, తెల్లబంగారంగా రైతులు పిలుచుకునే ఈ పంట రెండేళ్ల నుంచి బాగా తగ్గుతోంది. విభజన అనంతర నవ్యాంధ్రలో ఈ ఖరీఫ్‌లోనే కనిష్టంగా పత్తి సాగైంది. పదకొండు సీజన్లలోకెల్ల ఇప్పుడే అత్యల్పం. 2014-15లో అత్యధికంగా 20.52 లక్షల ఎకరాల్లో సాగు కాగా ఈ సంవత్సరం (2024-25) 9.97 లక్షల ఎకరాల్లో వేశారు. సాధారణ సాగు విస్తీర్ణం 14.47 లక్షల ఎకరాలు. నాలుగున్నర లక్షల ఎకరాల్లో సాగు తగ్గింది. నిరుడు సాగు 10.15 లక్షల ఎకరాలు. వర్షాభావం, భారీ వర్షాలు, వరదల వంటి ప్రతికూల వాతావరణ పరిస్థితులు, సాగు ఖర్చులు అంతకంతకూ పెరుగుతుండటం, కల్తీ విత్తనాలు, పురుగు మందులు, నిషేధిత బిటి-3 విత్తనాల బెడద, పంట మార్కెట్‌కొచ్చే సమయంలో గిట్టుబాటు ధర రాకపోవడంతో పాటు ధరల్లో భారీగా ఎగుడుదిగుళ్లు, కౌలు సేద్యం పెరగడం.. ఇవన్నీ పత్తి సాగును కదుపుతున్నాయి. కొంత కాలంగా పత్తి వైపు పరుగులు తీసిన రైతాంగం ఇప్పుడు నిలబడి ఆలోచిస్తున్నారు.

పదకొండేళ్లల్లో పత్తి సాగు

సంవత్సరం	సాగు లక్షల ఎకరాలు
2014-15	20.52
2015-16	16.65
2016-17	11.60
2017-18	16.10
2018-19	15.42
2019-20	16.35
2020-21	15.07
2021-22	13.32
2022-23	17.15
2023-24	10.50
2024-25	9.97

అంతటా తక్కువే


ఈ ఖరీఫ్‌లో అన్ని జిల్లాల్లోనూ సాధారణ సాగు కంటే పత్తి తక్కువగానే సాగైంది. కరువు పరిస్థితుల వలన గత సంవత్సరం పత్తి తగ్గింది. అంతకంటే కూడా ఈ ఏడాది తగ్గింది. రాష్ట్రంలో అత్యధికంగా పత్తి పండించే కర్నూలులో రెండేళ్ల నుంచి సాగు తగ్గుతోంది. నంద్యాలలో నిరుటి కంటే తగ్గింది. అనంతపురం, ప్రకాశం, కడపలోనూ అదే పరిస్థితి. పల్నాడులో రెండేళ్ల నుంచి తగ్గుతోంది. నార్మల్ కంటే తక్కువే అయినా, నిరుటి కంటే స్వల్పంగా పెరిగింది. గుంటూరు, ఎన్‌టిఆర్ జిల్లాల్లో నార్మల్ కంటే తక్కువ సాగు కాగా, గతేడాది కంటే స్వల్పంగా సాగు పెరిగింది.

దిగుబడి దిగతుడుపు

పత్తి దిగుబడి (ఈల్డ్)పై విత్తన కంపెనీలు ఊదరకొడుతున్నంత సీన్ వాస్తవంలో లేదు. ఎకరానికి 20 క్వింటాళ్ల పత్తి (కాయలు) దిగుబడి వస్తుందని నమ్మబలికి విత్తనాలు అంటగట్టి సొమ్ము చేసుకుంటున్నాయి కంపెనీలు. దిగుబడి పెరిగితే తమ విత్తనాల గొప్పతనంగా, తగ్గితే మిగతా 7లో

భారత్‌లో పెట్టుబడులు పెట్టండి

- ఇదే అనువైన సమయం
- జర్మనీ పారిశ్రామికవేత్తలకు ప్రధాని మోడీ ఆహ్వానం



న్యూఢిల్లీ : భారత్‌లో పెట్టుబడులు పెట్టాల్సిందిగా జర్మనీ పారిశ్రామికవేత్తలను ప్రధాని మోడీ ఆహ్వానించారు. పెట్టుబడులు పెట్టేందుకు భారత్ కన్నా మెరుగైన ప్రాంతం లేదని చెప్పారు. భారత్ అభివృద్ధి పయనంలో చేతులు కలిపేందుకు ఇది సరైన సమయమని పిలుపునిచ్చారు. జర్మనీ బిజినెస్‌లకు సంబంధించి 18వ ఆసియా-పసిఫిక్ సమావేశంలో ప్రధాని మోడీ ప్రసంగించారు. 'మేక్ ఇన్ ఇండియా' 'మేక్ ఫర్ ది వరల్డ్' చొరవలో చేరాల్సిందిగా విదేశీ పెట్టుబడిదారులను కోరారు. నైపుణ్యాలు కలిగిన భారతీయుల కోసం 20వేల నుండి 90వేలకు వీసాలను పెంచాలని జర్మనీ నిర్ణయించింది. భారత్‌లో నైపుణ్యాలు, ప్రతిభా పాటవాలు కలిగిన కార్మిక శక్తి పట్ల జర్మనీ వ్యక్తం చేసిన విశ్వాసం అద్భుతంగాను, విస్మయపరిచే రీతిలో వుందని మోడీ వ్యాఖ్యానించారు. అంతర్జాతీయ వాణిజ్యానికి, ఉత్పత్తికి భారత్ ప్రధాన కేంద్రంగా మారుతోందని అన్నారు. శక్తివంతమైన ప్రజాస్వామ్యం, జనాభా, డిమాండ్, డేటా వంటి బలమైన పునాదులపై నేడు భారత్ నిలబడి వుందని అన్నారు. రహదారులు, ఓడరేవుల రంగాల్లో భారత్ రికార్డు స్థాయిలో పెట్టుబడులు పెడుతోందని చెప్పారు. ప్రపంచ భవిష్యత్ కోసం ఇండో-పసిఫిక్ ప్రాంతం చాలా కీలకమైనదని వ్యాఖ్యానించారు.

జర్మనీ ఛాన్సలర్‌తో భేటీ

ఉక్రెయిన్, పశ్చిమాసియాల్లో జరుగుతున్న ఘర్షణలు, దాడులు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయని మోడీ పేర్కొన్నారు. ఆయా ప్రాంతాల్లో శాంతి పునరుద్ధరణకు అవసరమైన సాయం చేయడానికి భారత్ సిద్ధంగా వుందని పునరుద్ఘాటించారు. జర్మనీ ఛాన్సలర్ ఓల్ఫ్ షుల్జుతో చర్చల అనంతరం మోడీ ఈ వ్యాఖ్యలు చేశారు. ఉక్రెయిన్‌కు రాజకీయ పరిష్కారాన్ని కనుగొనడంలో భారత్ సాయండాలంటూ షుల్జు మోడీని కోరారు. భారత్‌లో పర్యటిస్తున్న జర్మనీ ఛాన్సలర్ ఓల్ఫ్ షుల్జుతో సమావేశమైన మోడీ ద్వైపాక్షిక వ్యూహాత్మక సంబంధాల బలోపేతంపై ప్రధానంగా దృష్టి కేంద్రీకరించారు. రక్షణ, వాణిజ్యం, పరిశుద్ధ ఇంధనంతో సహా పలు అంశాలపై చర్చలు జరిపారు. మూడు రోజుల పర్యటన కోసం గురువారం షుల్జు ఢిల్లీకి మిగతా 7లో

గుంటూరులో విద్యార్థిని ఆత్మహత్యపై

4 వారాల్లో సమగ్ర నివేదిక ఇవ్వండి

- సిఎస్, డిజిపిలకు ఎన్‌హెచ్‌ఆర్‌సి నోటీసులు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

గుంటూరు జిల్లాలో ఎనిమిదో తరగతి విద్యార్థిని ఆత్మహత్యపై జాతీయ మానవ హక్కుల కమిషన్ (ఎన్‌హెచ్‌ఆర్‌సి) ఆగ్రహం వ్యక్తం చేసింది. నాలుగు వారాల్లో సమగ్ర నివేదిక ఇవ్వాలంటూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సిఎస్), డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డిజిపి)లకు నోటీసులు జారీ చేసింది. గుంటూరు జిల్లా రెడ్డిపల్లిలోని ఓ ప్రైవేటు స్కూలు హాస్టల్ క్యాంపస్‌లో ఈ నెల 23న ఎనిమిదో తరగతి చదువుతున్న 13 ఏళ్ల విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడిందన్న మీడియా కథనాన్ని శుక్రవారం ఎన్‌హెచ్‌ఆర్‌సి సుమోటోగా స్వీకరించింది. వార్తా కథనంలోని అంశాలు నిజమైతే, బాధిత బాలిక మానవ హక్కుల ఉల్లంఘనకు సంబంధించిన తీవ్రమైన అంశాలున్నట్లు గుర్తించింది. బాలిక మరణానికి గల కారణాలతో సహా పోలీసు దర్యాప్తు, పోస్టుమార్టం నివేదికలతోపాటు ఇతరులు విచారణ జరిపిన నివేదికలను కూడా ఇవ్వాలని అధికారులను ఆదేశించింది.

పెరుగుతున్న డయేరియా కేసులు

- 17కు చేరిన బాధితుల సంఖ్య
- ఆరోగ్య సిబ్బందికి షోకాజ్ నోటీసులు
- ఇద్దరు మృతికీ ఇతర కారణాలున్నాయన్న మంత్రి సత్యకుమార్



బోరును పరిశీలిస్తున్న మంత్రి సత్య కుమార్

ప్రజాశక్తి- దాచేపల్లి (పల్నాడు జిల్లా)

పల్నాడు జిల్లా దాచేపల్లి నగర పంచాయతీ పరిధిలోని అంజనాపురం కాలనీలో డయేరియా కేసులు 17కు చేరాయి. ప్రస్తుతం ఏడుగురు ఇంటి వద్ద చికిత్స పొందుతుండగా మిగతా పది మందిని దాచేపల్లి, పిడుగురాళ్ల, సత్తెనపల్లి ఆస్పత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు. డయేరియా సమస్యను సకాలంలో గుర్తించి ఉన్నతాధికారులకు తెలియజేయలేదంటూ ఒక ఎఎన్ఎంకు, ఇద్దరు ఆశా వర్కర్లకు అధికారులు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. డయేరియా ఇప్పటికే ఇద్దరు మృతి చెందారని గ్రామస్తులు చెప్తుండగా, వారు వేర్వేరు కారణాలతో చనిపోయారని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ తెలిపారు. డయేరియా ప్రబలిన ప్రాంతాలను స్థానిక ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు, కలెక్టర్ అరుణబాబుతో కలిసి శుక్రవారం ఆయన సందర్శించారు. అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ అంజనాపురం కాలనీలో ఇప్పటి వరకూ 17 డయేరియా కేసులు నమోదైనట్లు తెలిపారు. తాగునీటి కాలుష్యమే ఇందుకు కారణమని చెప్పారు. కాలనీలో రూ.25 లక్షలతో ఫిల్టర్ బెడ్లను ఏర్పాటు చేసి ప్రజలకు రక్షిత మంచినీరు అందిస్తామని తెలిపారు. బండారు చిన్న వీరయ్య మృతి చెందడంతో ఆయన కుటుంబ సభ్యులను మంత్రి పరామర్శించారు. చిన్న వీరయ్య, తమ్మిశెట్టి వెంకటేశ్వర్లు మృతికి డయేరియా కారణం కాదని, వేర్వేరు కారణాలు ఉన్నాయని చెప్పారు. కాగా, మంత్రి ప్రకటనను వెంకటేశ్వర్లు తండ్రి కృష్ణంరాజు ఖండించారు. తన కుమారుడు కడుపునొప్పి, వాంతులు విరోచనాలతో బాధపడ్డాడని, ఎక్కువ విరోచనాలు కావడంతో చనిపోయాడని తెలిపారు.

జాతీయ స్థాయి వాలీబాల్ పోటీలకు

బూదవాడ విద్యార్థిని ఎంపిక

ప్రజాశక్తి- పంగులూరు (బాపట్ల జిల్లా)



ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలో త్వరలో జరగనున్న జాతీయ స్థాయి వాలీబాల్ పోటీలకు బాపట్ల జిల్లా పంగులూరు మండలంలోని బూదవాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థిని వజ్రాల రూపలక్ష్మి ప్రసన్న ఎంపికైంది. ఈ నెల 21, 22, 23 తేదీల్లో సత్యసాయి జిల్లా హిందూపురంలో జరిగిన 68వ రాష్ట్ర స్థాయి (ఎస్‌జిఎఫ్ తరపున) వాలీబాల్ పోటీలలో పాల్గొని ఆమె ప్రతిభ కనపరిచింది. జాతీయ స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైన రూపలక్ష్మి అభినందన కార్యక్రమం బూదవాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం జరిగింది. ఆమెను పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి.నాగరాణి, పీడీ ఎం.వెంకట్రావు, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయేతర సిబ్బంది, పాఠశాల విద్యా కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు అభినందించారు.



జిల్లా పరిషత్ కార్యాలయం వద్ద బైఠాయించిన విద్యార్థులు

కదంతొక్కిన విద్యార్థులు

- పెండింగ్‌లో ఉన్న విద్యా, వసతి దీవెన నిధులు విడుదల చేయాలి

2

సరస్వతి పవర్‌పై నివేదిక కోరిన డిప్యూటీ సిఎం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

పల్నాడు జిల్లా, దాచేపల్లి, మాచవరం మండలాల్లో సరస్వతి పవర్ సంస్థకు చెందిన భూముల్లో అటవీ భూములు ఏమైనా ఉన్నాయా? ఉంటే వాటి విస్తీర్ణం ఎంత ఉందో త్వరితగతిన నివేదిక ఇవ్వాలని పల్నాడు జిల్లా అధికారులను డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్ ఆదేశించారు. ఈ సంస్థ 1,515.93 ఎకరాల్లో ఉండగా, అందులో ప్రకృతి సంపద, వాగులు, వంకలు, కొండ భూములు ఉన్నాయనే వార్తలు నేపథ్యంలో అధికారులతో శుక్రవారం చర్చించారు. సరస్వతి పవర్ సంస్థకు చెందిన భూముల్లో ప్రభుత్వ భూములు, జలవనరులు ఏ మేరకు ఉన్నాయో తెలపడంతో పాటు అటవీశాఖకు చెందిన భూములు ఏమైనా ఉన్నాయేమోనని సమగ్రంగా పరిశీలించాల్సిన అవసరం ఉందని అధికారులకు డిప్యూటీ సిఎం స్పష్టం చేశారు. వాగులు, వంకలు, కొండలు ఉన్నందున ఆ సంస్థకు పర్యావరణ అనుమతులు ఏ విధంగా పొందారో తెలపాలని పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులను ఆదేశించారు. ఈ అంశంపై రెవెన్యూ, పిబిసి ఉన్నతాధికారులతో త్వరలో సమీక్షించనున్నట్లు పేర్కొన్నారు.

పట్ట భద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటర్ల నమోదుపై దృష్టి పెట్టండి

- టిడిపి ఎంపి, ఎంఎల్‌ఏలకు బాబు సూచన

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఉమ్మడి గోదావరి, కృష్ణ, గుంటూరు జిల్లాలకు త్వరలో జరుగనున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఓటర్ల నమోదుకు సెప్టెంబరు 6వరకు సమయం ఉందని, అ లోగా ఓటర్ల నమోదు ప్రక్రియపై దృష్టి పెట్టాలని టిడిపి ఎంపి, ఎంఎల్‌ఏలకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సూచించారు. ఉండవల్లిలోని ఆయన నివాసం నుంచి నిర్వహించిన టెలీకాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడుతూ జనసేన, బిజెపిలతో సమన్వయం చేసుకోవాలని చెప్పారు. నామినేటెడ్ పోస్టుల భర్తీపై కూడా వారితో బాబు చర్చించారు. త్వరలోనే పోస్టులను భర్తీ చేయనున్నట్లు ఆయన వెల్లడించారు. ఉభయ గోదావరి ఎమ్మెల్సీ అభ్యర్థిగా పేరాబత్తుల రాజశేఖర్, గుంటూరు , కృష్ణ ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఆలపాటి రాజను ఎన్‌డిఎ అభ్యర్థులుగా ఇప్పటికే ప్రకటించినట్లు చెప్పారు. ప్రతి నియోజకవర్గంలో మూడు పార్టీల నేతలతో కో- ఆర్డినేషన్ మీటింగ్‌లు ఏర్పాటు చేసుకోవాలని, ప్రభుత్వం చేసిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని సూచించారు. ప్రతి ఒక్కరూ క్షేత్ర స్థాయిలో ఉండి ఓట్లు నమోదు చేయించాలని ఎంపి, ఎమ్మెల్యేలను సిఎం ఆదేశించారు.

నేటి నుంచి టిడిపి సభ్యత్వ నమోదు : పల్లా

తెలుగు దేశంపార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం ఈనెల 26న పార్టీ జాతీయ అధ్యక్షులు చంద్రబాబునాయుడు మంగళగిరి పార్టీ కార్యాలయంలో ప్రారంభిస్తారని రాష్ట్ర పార్టీ అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రూ.లక్ష కట్టిన వారికి టిడిపి శాశ్వతసభ్యత్వం అందించనున్నారని తెలిపారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..

**స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ,
ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ,
అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి,
గుంటూరు జిల్లా - 522 501**కు కానీ
editorprajasakthi@gmail.comకు పంపవచ్చు.

యుద్ధ ప్రాతిపదికన చెత్త తొలగింపు

- సమీక్షలో అధికారులకు సిఎం ఆదేశం
- టిడ్కో ఇళ్లకు అవసరమైన నిధులు కేటాయిస్తాం



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలో పెద్ద సమస్యగా ఉన్న చెత్త తొలగింపు ప్రక్రియను యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలని పట్టణాభివృద్ధిశాఖ అధికారులను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం పట్టణాభివృద్ధిశాఖపై సమీక్ష నిర్వహించారు. పట్టణ ప్రాంతాల్లో తాగునీటి సరఫరా, వేస్ట్ మేనేజ్‌మెంట్, టౌన్‌ప్లానింగ్, టిడ్కో ప్రాజెక్టులపై అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. గత ప్రభుత్వం చెత్తపన్ను వేసి చెత్త తొలగించని కారణంగా 83 లక్షల టన్నుల చెత్త పేరుకుపోయిందని తెలిపారు. వేస్టుటు ఎనర్జీ, చెత్త నుండి సంపద కేంద్రాలను పూర్తిస్థాయిలో అందుబాటులోకి తేవాలని సూచించారు. సాలిడ్, లిక్విడ్‌వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్రక్రియ గాడిలో పడాలని ఆదేశించారు. రాష్ట్రంలో టిడిఆర్ బాండ్లలో జరిగిన అవినీతి, అక్రమాలపై సమగ్ర సమాచారం సేకరించడంతపాటు అర్బన్ లోకల్ బాడీల్లో మొత్తం 50 లక్షల గృహాలు ఉండగా, ఇప్పటి వరకూ 30 లక్షల ఇళ్లకు నీటి కుళాయి సౌకర్యాలున్నాయని, మరో 7.5 లక్షల ఇళ్లకు అమృత్ పథకం కింద కుళాయి ద్వారా నీరు ఇచ్చేందుకు పనులు జరుగుతున్నాయని అధికారులు తెలపగా, వెంటనే ఆ ప్రక్రియ కూడా పూర్తి చేయాలని సిఎం ఆదేశించారు. తిరుపతి, రాజమండ్రి, కాకినాడ, నెల్లూరులో వేస్టుటు ఎనర్జీ ప్లాంట్లు టెండర్లు ఇతర ప్రక్రియను వెంటనే అందుబాటులోకి తేవాలని సూచించారు. టిడ్కో ఇళ్లను పూర్తి చేయాలని, దీనికి అవసరమైన నిధుల విడుదలకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. పట్టణ ప్రాంతాల్లో ఇళ్ల నిర్మాణం ఏ మేరకు చేపట్టాలి, లబ్ధిదారులు ఎందరు ఉంటారు అనే విషయంలో నివేదిక రూపొందించాలని సిఎం అన్నారు. పిపిపి పద్ధతిలో పార్కులు, మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు చేపట్టాలని ఆదేశించారు. ఈ సమావేశంలో మంత్రి నారాయణ, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అనిల్ కుమార్ సింఘాల్ తదితరులు పాల్గొన్నారు.

వీధి దీపాల నిర్వహణకు రూ.150కోట్లు
55వేల అంగన్‌వాడీ కేంద్రాలకు ఇండక్షన్ స్టౌలు

రాష్ట్రంలోని గ్రామ పంచాయతీల్లో వీధి దీపాల నిర్వహణకు రూ.100 కోట్లు, పట్టణ ప్రాంతాలకు రూ.50కోట్లను విడుదల చేయాలని ఆర్థిక శాఖ అధికారులను సిఎం చంద్రబాబునాయుడు ఆదేశించారు. ఈ మేరకు ఎనర్జీ ఎఫీషియన్సీ కార్యక్రమాలపై సిఎం శుక్రవారం అధికారులతో సమీక్ష చేశారు. ఈ సందర్భంగా సిఎం మాట్లాడుతూ ఇంధన వాడకాన్ని తగ్గించేందుకు నూరు శాతం ఎల్ఇడి దీపాలను వినియోగించేలా చర్యలు తీసుకోవాలన్నారు. గత ప్రభుత్వం గ్రామ పంచాయతీలను పూర్తిగా నిర్వీర్యం చేయడంతో పాటు వీది దీపాల నిర్వహణకు సంబంధించి చెల్లించాల్సిన బకాయిలను కూడా చెల్లించలేదన్నారు. సాంకేతికతను వినియోగించి వీధి దీపాల నిర్వహణను మానిటరింగ్ చేసి విద్యుత్ ఆదాకు చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్రంలోని 55వేల అంగన్ వాడీ కేంద్రాల్లో వంట గ్యాస్ వినియోగాన్ని తగ్గించేందుకు ఎలక్ట్రిక్ ఇండక్షన్ స్టౌలను వినియోగించాలని, అందుకోసం ఎనర్జీ ఎఫీషియన్సీ సర్వీసెస్ లిమిటెడ్ ద్వారా సమన్వయం చేసుకోవాలని సిఎం అధికారులకు సూచించారు. ఈ సమీక్షలో మునిసిపల్ శాఖ మంత్రి పి..నారాయణ, విద్యుత్తు శాఖమంత్రి గొట్టిపాటి రవికుమార్, ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్, గృహ నిర్మాణ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్‌జైన్, మునిసిపల్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అనిల్ కుమార్ సింఘాల్, ఆర్థిక శాఖ కార్యదర్శి జనకి,సిఎం కార్యదర్శి ప్రద్యుమ్నతో పాటు పలువురు పాల్గొన్నారు.

పారిశ్రామిక విధానాలపై కార్మిక సంఘాలతో చర్చ

- సిఐటియు రాష్ట్ర కమిటీ డిమాండ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన పారిశ్రామిక విధానం, పెట్టుబడులు, ఉద్యోగాలు రావడాన్ని స్వాగతిస్తున్నామని, అదే సమయంలో పారదర్శకత లోపించిందని సిఐటియు రాష్ట్ర కమిటీ పేర్కొంది. ఈ మేరకు అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎవి నాగేశ్వరరావు, సిహెచ్ నరసింగరావు శుక్రవారం ప్రకటన విడుదల చేశారు. వాస్తవాలకు విరుద్ధంగా పారిశ్రామిక విధానం పాలసీ ఉందని తెలిపారు. ఈ నాటికి పరిశ్రమల మొత్తంలో ఎంత పెట్టుబడి ఉంది, ఎంత మందికి ఉపాధి కల్పిస్తున్నామనేది చెప్పకుండా ఐదేళ్ల కాలంలోనే ఆకాశానికి అందనంత పెట్టుబడులు వస్తాయని, ఉద్యోగాలు వస్తాయని విధాన ప్రకటన చేయడం సరికాదని పేర్కొన్నారు. పారిశ్రామిక విధానాన్ని కేవలం పెట్టుబడిదారుల దృష్టితోనే రూపొందించారని పేర్కొన్నారు. పెట్టుబడిదారుల వ్యాపారాలు సులువుగా, వేగంగా జరిగేందుకు కావాల్సిన ఏర్పాట్లను ప్రభుత్వం చేసిందని, పరిశ్రమలో ముఖ్యమైన భాగంగా ఉండే కార్మికుల గురించి, వారి సాధక బాధకాల గురించి కనీస ప్రస్తావన పారిశ్రామిక విధానంలో లేదని పేర్కొన్నారు. నల్లేరుమీద బండిలా పెట్టుబడులకు లాభాలు తెచ్చిపెట్టే కార్మికుల జీవితాలు నలిగిపోతున్నాయని వివరించారు. నాణ్యమైన ఉద్యోగాలు, చట్ట ప్రకారం రావాల్సిన వేతనాలు, కల్పించాల్సిన పని పరిస్థితులను, భద్రతను రాష్ట్ర ప్రభుత్వం విస్మరించిందని పేర్కొన్నారు. రైతులు కూడా తమ భూములను పారిశ్రామికవేత్తల వల్ల కోల్పోతూ పరిశ్రమల్లో కూలీలుగా మారుతున్నారని తెలిపారు. పరిశ్రమలు పెట్టకుండా రైతులకు భూములను తిరిగి ఇవ్వకుండా బ్యాంకులకు తాకట్టు పెట్టి పెట్టుబడిదారులు లాభపడుతున్నారని వివరించారు. కార్మిక సంఘాలు, రైతు సంఘాలతో చర్చించి పారిశ్రామిక విధానానికి సమగ్రతను పారదర్శకతను చేకూర్చాలని వారు ప్రభుత్వాన్ని కోరారు.

శాప్ ప్రక్షాళన

- ఛైర్మన్‌కు విన్నవించిన డివైఎఫ్ఐ రాష్ట్ర కమిటీ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

శాప్‌ను ప్రక్షాళన చేసి క్రీడా అభివృద్ధికి బాటలు వేయాలని డివైఎఫ్ఐ రాష్ట్ర కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు వై రాము, జి రామన్న కోరారు. ఈ మేరకు శుక్రవారం శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడుకు వినతిపత్రం సమర్పించారు. పేఅండ్ ప్లే విధానాన్ని రద్దుచేయాలని, ప్రస్తుతం ఉన్న కాంట్రాక్టు కోచ్‌లను రద్దుచేసి రెగ్యులర్ కోచ్‌లను నియమించాలని కోరారు. అవుట్‌సోర్సింగ్ ద్వారా పనిచేస్తున్న 97 మంది కోచ్‌లకు ఎంటిఎస్ ద్వారా వేతనాలిచ్చి రెగ్యులరైజ్ చేయాలని కోరారు. అన్యాక్రాంతమైన క్రీడామైదానాలను కాపాడాలని, స్పోర్ట్స్ అకాడమీని, స్పోర్ట్స్ హాస్టళ్లు ఏర్పాటు చేయాలని, స్పోర్ట్స్ కోటాను రెండు శాతం నుండి నాలుగు శాతానికి పెంచాలని కోరారు. నకిలీ సర్టిఫికెట్లను అరికట్టాలని, క్రీడా పోటీల సందర్భంగా రవాణా ఛార్జీలు, డ్రెస్, క్రీడా సామగ్రి ఉచితంగా ఇవ్వాలని, క్రీడా మైదానాలను రాజకీయ సభలకు ఇవ్వకూడదని, పెండింగ్‌లో ఉన్న పారితోషికాలు ఇవ్వాలని కోరారు.

కదంతొక్కిన విద్యార్థులు

- పెండింగ్‌లో ఉన్న విద్యా, వసతి దీవెన నిధులు విడుదల చేయాలి
- జడ్‌పి కార్యాలయం వద్ద బైఠాయింపు
- మంత్రుల హామీతో ఆందోళన విరమణ

ప్రజాశక్తి- విజయనగరం టౌన్

ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతి, విద్యా దీవెన బకాయిలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన విద్యార్థులు భారీ ఆందోళనకు దిగారు. విజయనగరం జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం జరుగుతున్న నేపథ్యంలో శుక్రవారం జడ్‌పి కార్యాలయం ఎదుట రహదారిపై బైఠాయించారు. మంత్రుల హామీతో ఆందోళన విరమించారు. ముందుగా ఆర్‌టిసి కాంప్లెక్స్ నుంచి జడ్‌పి కార్యాలయానికి వేలాది మంది విద్యార్థులు ర్యాలీగా చేరుకున్నారు. తమ సమస్యలు పరిష్కరించాలని పెద్ద ఎత్తున నినదించారు. మయూరి జంక్షన్ నుంచి జడ్‌పి కార్యాలయం వరకు రోడ్డుపై బైఠాయించడంతో పోలీసులు భారీగా అక్కడికి చేరుకొన్నారు. జడ్‌పి కార్యాలయంలోకి విద్యార్థులను వెళ్లనీయకుండా రోప్ ఏర్పాటు చేశారు. సమావేశానికి వచ్చిన రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాసరావు విద్యార్థుల ఆందోళన విషయం తెలుసుకొని డిఎస్‌పి శ్రీనివాసరావుతో మాట్లాడి వారిని తన వద్దకు పిలిపించుకొని సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వారి నుంచి వినతిపత్రం స్వీకరించారు. అదే సమయంలో వచ్చిన రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి రోడ్డుపై కారును ఆపి దిగివచ్చి విద్యార్థులతో మాట్లాడారు. విద్యా శాఖ మంత్రి లోకేష్‌తో మాట్లాడి నిధుల విడుదలకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం మంత్రుల పిలుపు మేరకు జడ్‌పి కార్యాలయం వద్దకు ఎస్ఎఫ్ఐ నాయకులు వెళ్లి రాష్ట్ర మంత్రులను, ఎంపి కలిశెట్టి అప్పలనాయుడును, ఎమ్మెల్యేలు అదితి విజయలక్ష్మి, తోయక జగదీశ్వరి, కలెక్టర్ బిఆర్ అంబేద్కర్‌లను కలిసి సమస్యలు వివరించారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ గత ప్రభుత్వం విద్యార్థులకు పెద్ద ఎత్తున స్కాలర్‌షిప్‌లు బకాయిలు పెట్టిందని, వాటితోపాటు ఈ ప్రభుత్వంలో బకాయి ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులనూ తక్షణమే విడుదల చేసేలా మంత్రి మండలిలో చర్చిస్తామని హామీ ఇచ్చారు. ప్రయివేటు కళాశాలల నుంచి విద్యార్థులపై ఒత్తిడి లేకుండా చూస్తామని, విద్యార్థులను పరీక్షలకు అనుమతించేలా కళాశాలకు ఆదేశాలు ఇస్తామని భరోసా కల్పించారు. ఈ మేరకు కళాశాలలకు ఆదేశాలివ్వాలని కలెక్టర్ అంబేద్కర్‌కు మంత్రులు సూచించారు. మంత్రుల హామీతో విద్యార్థులు ఆందోళన విరమించారు. అంతకు ముందు ఆందోళననుద్దేశించి ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు డి.రాము మాట్లాడుతూ డిగ్రీ, పిజి, ఇంజనీరింగ్ విద్యార్థులకు గత రెండేళ్లుగా ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా విడుదల చేయలేదన్నారు.


మంత్రులు, ఎంపి, ఎమ్మెల్యేలకు వినతినిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

దీంతో, విద్యార్థులు ఫీజులు చెల్లించలేక విద్యార్థులు నానా అవస్థలు పడుతున్నారని తెలిపారు. ఫీజులు చెల్లిస్తేనే పరీక్షకు అనుమతిస్తామని విద్యా సంస్థల యాజమాన్యాలు బెదిరిస్తున్నాయని, వసతి, విద్యాదీవెన డబ్బులను ఈ ప్రభుత్వం విడుదల చేయలేదని, దీంతో, విద్యార్థులు రోడ్డెక్కాల్సి వచ్చిందని అన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు జె.రవికుమార్, జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.సమీరా, జిల్లాలోని ప్రభుత్వ, ప్రయివేటు డిగ్రీ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్‌కు ముడి సరుకు అందజేయాలి

ప్రజాశక్తి - ఉక్కునగరం (విశాఖపట్నం)

వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌కు సరిపడా ముడి సరుకు అందజేయాలని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్ డి ఆదినారాయణ డిమాండ్ చేశారు. స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు శుక్రవారానికి 1352వ రోజుకు చేరుకున్నాయి. దీక్షల్లో సిఎఫ్‌టియుఐ కార్యకర్తలు, ఉక్కు కార్మికులు కూర్చున్నారు. వారినుద్దేశించి ఆయన మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ మనుగడకు ముడిసరుకు ఎంతో ముఖ్యమని అన్నారు. అది సరిపడా లేకపోవడంతో కార్మికులు పూర్తి స్థాయిలో ఉత్పత్తి చేయలేకపోతున్నారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ప్రయివేటీకరణ చర్యలను విడనాడి ఆర్థికంగా సహకరిస్తే ప్లాంట్‌ను లాభాల బాట పట్టించేందుకు కార్మికులు సిద్ధంగా ఉన్నారన్నారు. కార్మికుల ప్రయోజనాలను దెబ్బతీసేందుకు మోడీ సర్కారు కుట్రలు పన్నుతోందని, వాటిని తక్షణం నిలిపివేయాలని డిమాండ్ చేశారు.

సిపిఎం సీనియర్ నాయకులు బొల్లు శంకరరావు కన్నుమూత


నివాళులర్పిస్తున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు రమాదేవి తదితరులు


బొల్లు శంకరరావు (ఫైల్)

ప్రజాశక్తి-చిలకలూరిపేట (పల్నాడు జిల్లా)

సిపిఎం సీనియర్ నాయకులు బొల్లు శంకరరావు (73) గుండెపోటుతో గురువారం అర్ధరాత్రి మృతి చెందారు. పల్నాడు జిల్లా చిలకలూరిపేట మండలం బొప్పూడికి చెందిన ఆయనకు గుండెనొప్పి రావడంతో కుటుంబీకులు చికలూరిపేటలోని ఓ ప్రయివేటు ఆస్పత్రిలో చేర్చారు. అక్కడ చికిత్స పొందుతూ చనిపోయారు. ఆయన భౌతికకాయాన్ని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డి. రమాదేవి, గుంటూరు, పల్నాడు జిల్లాల కార్యదర్శులు పాశం రామారావు, గుంటూరు విజయ్‌కుమార్, వివిధ పార్టీలు, సంఘాల నాయకులు శుక్రవారం సందర్శించి నివాళులర్పించారు. శంకరరావుకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. శనివారం ఉదయం 9 గంటలకు సంతాప సభ ఉంటుందని, అనంతరం అంత్యక్రియలు నిర్వహిస్తామని కుటుంబీకులు తెలిపారు. ధనిక రైతు కుటుంబంలో పుట్టిన శంకర రావు డివైఎఫ్ఐలో పని చేశారు. అప్పటి నాయకులైన పుతుంబాక వెంకటపతి, పోపూరి రామారావు తదితరుల ప్రభావంతో సిపిఎం పూర్తికాలం కార్యకర్తగా ఎదిగారు. సిపిఎం చిలకలూరిపేట పట్టణ, మండల కార్యదర్శిగానూ బాధ్యతలు నిర్వర్తించారు. రైతు సంఘంలో పనిచేశారు. బైపాస్ రోడ్డుతో నష్ట పోయిన రైతుల నష్టపరిహారం కోసం, యడ్లపాడు మండలం తిమ్మాపురంలో టెక్స్ టైల్ పార్కు ఏర్పాటు సందర్భంలో రైతులకు పరిహారం కోసం, టెక్స్‌టైల్ పార్కు ఏర్పాటయ్యాక అందులో కార్మికుల కోసం జరిగిన ఉద్యమాల్లో కీలకంగా పని చేశారు.

దళితుల భూముల్లో అక్రమ ఇసుక తవ్వకాలు

- అడ్డుకున్నందుకు పెత్తందారుల దాడి

ప్రజాశక్తి-సీతానగరం (తూర్పు గోదావరి జిల్లా)


ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వెంకటరమణ

తమ భూముల్లో అక్రమంగా ఇసుక ఎందుకు తవ్వుతున్నారని ప్రశ్నించిన ఓ దళితుడిని ట్రాక్టర్‌తో గుద్దించి దాడికి పాల్పడిన సంఘటన తూర్పుగోదావరి జిల్లా సీతానగరం మండలంలో శుక్రవారం చోటు చేసుకుంది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. ముగ్గళ్ల గ్రామంలో దళితుల సొసైటీ పేరున లంక పట్టా భూములు ఉన్నాయి. దళితుల భూముల్లో కొందరు పెత్తందారులు అక్రమంగా ఇసుక తవ్వకాలు చేస్తుండగా సొసైటీ సెక్రటరీ మట్టాడి వెంకటరమణ ప్రశ్నించారు. దీంతో అగ్రవర్ణాలకు చెందిన రుద్రం నాగు, కురికూరి శ్రీను, కొంత మంది ట్రాక్టర్ల యజమానుల ప్రోద్బలంతో జక్కుల రాము అనే వ్యక్తి ట్రాక్టర్‌తో గుద్దించి దాడికి పాల్పడ్డారు. గాయపడిన వెంకటరమణ రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ సందర్భంగా బాధితుడు మాట్లాడుతూ ముగ్గళ్ల గ్రామంలో ఉచిత ఇసుక విధానానికి తూట్లు పొడుస్తూ కొందరు అక్రమ రవాణాకు పాల్పడుతున్నారని తెలిపారు. రాత్రీ పగలూ తేడా లేకుండా ట్రాక్టర్లతో ముగ్గళ్ల ఇసుక ర్యాంపు నుండి అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తూ దర్జాగా వ్యాపారం చేస్తున్నారని చెప్పారు. దళిత రైతుల సొసైటీల నుండి ఎందుకు ఇసుకను తరలిస్తున్నారని ప్రశ్నించడంతో దాడికి పాల్పడ్డారని వాపోయారు. దాడి సంఘటనపై సీతానగరం పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు ఆయన తెలిపారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు

హస్తిన బాటలో అధికారులు

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

రాష్ట్ర అధికారులు వరుస ఢిల్లీ పర్యటనలకు సిద్ధమవుతున్నారు. రాష్ట్రంలో అభివృద్ధి పనులకు సంబంధించి అనుమతులు, చర్చలకు కొంతమంది వెళ్తుండగా, కేంద్రం నుంచి రావాల్సిన నిధుల కోసం మరికొంతమంది హస్తిన బాట పడుతున్నారు. గత నెల్లోనే కొంతమంది సీనియర్ ఐఎఎస్ అధికారులు ఢిల్లీకి వెళ్లగా, నవంబర్, డిసెంబర్ మాసాల్లో మరికొందరు వెళ్లడానికి ప్రణాళికలు సిద్ధమౌతున్నాయి. రోడ్లు, నీటిపారుదల, విద్య, వైద్యం, తాగునీరు, పట్టణాభివృద్ధి, గ్రామీణాభివృద్ధి వంటి రంగాలతోపాటు ప్రత్యేకంగా రాజధాని నిర్మాణం, అమరావతిలో అభివృద్ధి, పోలవరం పనులకు భారీగా నిధులు కూడా కావాల్సిన పరిస్థితి నెలకొంది. ఇప్పట్లో నేరుగా ఆ నిధులను భరించే శక్తి రాష్ట్ర ఖజానాకు లేకపోవడంతో కేంద్రం ఇచ్చే నిధులతోపాటు, రుణాలపైనే ఆధారపడాల్సి వస్తోంది. ఈ కారణంగానే ఢిల్లీలో పలు శాఖల ఉన్నతాధికారులను కలిసి నిధులపై చర్చించాలని భావిస్తున్నట్లు తెలిసింది. కీలక శాఖలకు ముఖ్యమంత్రి కూడా ఇదే తరహా ఆదేశాలను ఇచ్చినట్లు సమాచారం.

చివరి ఆరు నెలలపైనే దృష్టి

ప్రస్తుతం మూడో త్రైమాసికం కొనసాగుతున్న నేపథ్యంలో అందుకు సంబంధించిన కేటాయింపులు మరింత ఎక్కువగా సాధించుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు ఆర్థికశాఖ అధికారి ఒకరు వెల్లడించారు. అలాగే జనవరి నుంచి ప్రారంభమయ్యే చివరి త్రైమాసికంలో రావాల్సిన నిధులపైనా ఇప్పటి నుంచే కసరత్తు చేస్తున్నామని, వీటిపైనా త్వరలో ఢిల్లీకి ఆయా శాఖల అధికారులు వెళ్లనున్నారని ఆయన చెప్పారు.ప్రత్యేకంగా ఆర్థికశాఖ అధికారులు కూడా నేరుగా కేంద్ర ఆర్థికశాఖ వద్దకు పలు దఫాలుగా వెళ్లాలని నిర్ణయించుకున్నారు. రాష్ట్రానికి రావాల్సిన ఆర్థిక సంఘం నిధులు, పలు ప్రాజెక్టులకు నిధులపై వచ్చిన హామీలను త్వరగా సాధించుకునేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేయాలని నిర్ణయించారు.

ఆస్తుల్లో షర్మిల వాటాదారు కాదు

- వైసిపి నేతలు వైవి సుబ్బారెడ్డి, పేర్ని

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

జగన్‌కు ఉన్నవన్నీ ఆయన సొంత ఆస్తులని, వాటిల్లో షర్మిల వాటాదారు కాదని వైసిసి ప్రధాన కార్యదర్శి వైవి సుబ్బారెడ్డి తెలిపారు. శుక్రవారం సాయంత్రం వైసిపి కేంద్ర కార్యాలయంలో మాజీ మంత్రి పేర్ని వెంకట్రామయ్య (నాని)తో కలిసి ఆయన మాట్లాడారు. షర్మిల వాటాను వైఎస్ఆర్ కూడా కోరుకోలేదని, జగనే ఆ కంపెనీలన్నీ ప్రారంభించారని పేర్కొన్నారు. హైకోర్టు స్టేటస్ కో ఉన్నా షర్మిల పేర్లు మార్చుకున్నారని చెప్పారు. దీనివల్లే జగన్ ఎన్‌సిఎల్‌టిని ఆశ్రయించారని చెప్పారు. అంతే తప్ప ఆస్తుల కోసం కాదని అన్నారు. నిజంగా షర్మిల షేర్ హోల్డరైతే ఆమెపై ఎందుకు కేసు పెట్టలేదని ప్రశ్నించారు. కేవలం జగన్‌పైనే కేసుపెట్టి జైలుకు ఎందుకు పంపించారని ప్రశ్నించారు. జగన్ పదేళ్లలో ఇచ్చిన రూ.200 కోట్లు డివిడెండ్ కాదని, షేర్ హోల్డర్ కానప్పుడు డివిడెండ్ ఎలా ఇస్తారని ప్రశ్నించారు. చెల్లెలిపై అభిమానం, ప్రేమతో ఆయన సాయం చేశారని అన్నారు. జగన్ కంపెనీల్లో షర్మిల వాటాదారు అయితే ఆమె పేరు ఎందుకు పెట్టలేదని, భారతి సిమెంట్స్, జగతి పబ్లికేషన్స్ అని ఎందుకు పెట్టారని తెలిపారు. తాను చెల్లెలికి ఇస్తోంది స్వార్జిత ఆస్తి అని అగ్రిమెంటులోనూ పెట్టారని చెప్పారు. అది చదివాకే విజయమ్మ, షర్మిల ఇద్దరూ సంతకాలు చేశారని, అలాంటప్పుడు షర్మిల కంపెనీలో ఎలా వాటాదారు అవుతారని ప్రశ్నించారు. పేర్ని నాని మాట్లాడుతూ.. కాంగ్రెస్‌లో ఉంటూ బిజెపితో పాలన చేస్తున్న టిడిపికి ఏజెంటుగా షర్మిల మారారని ఆరోపించారు. సిఎం చంద్రబాబు కనుసన్నల్లో షర్మిల పనిస్తున్నారని విమర్శించారు. వాటాలు పంచాల్సిందేనని చెబుతున్న చంద్రబాబు హెరిటేజ్‌లో ఆయన సోదరీమణులు, సోదరులకు ఆస్తులు పంచుతారా? అని ప్రశ్నించారు.

వైఎస్ఆర్ ఆశయాలను పక్కన పెట్టారు

- షర్మిల బహిరంగ లేఖ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఆస్తుల పంపకం విషయంలో జగన్.. తల్లి విజయమ్మను, తనను మోసం చేశారని పిసిసి అధ్యక్షులు షర్మిల పేర్కొన్నారు. శుక్రవారం బహిరంగ లేఖ రాశారు. తనపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని, తన తండ్రి వైఎస్ఆర్ ఆశయాలకు విరుద్ధంగా వ్యవహరిస్తూ ఆస్తి కావాలంటే జగన్, భారతి, అవినాష్‌రెడ్డి గురించి మాట్లాడొద్దని షరతు పెట్టారని తెలిపారు. దీనికి మనసు అంగీకరించక తాను ఒప్పుకోలేదని అన్నారు. దీంతో జగన్ కోర్టును ఆశ్రయించారని తెలిపారు. తనకు రూ.200 కోట్లు ఇచ్చారని, అవి కంపెనీలో డివిడెండ్ అని పేర్కొన్నారు. కేసులు లేని ఆస్తులనే పంచారని, ఈ వివాదం వల్ల బెయిల్ రద్దవుతుందనేది తప్పుడు ప్రచారమని పేర్కొన్నారు. తనను, తల్లి విజయమ్మను ఎన్ని విధాలుగా కావాలంటే అన్ని విధాలుగా వేధింపులకు గురిచేశారని వివరించారు. తన వారసులు నలుగురికి ఆస్తులు సమానంగా పంచాలంటే పంచకుండా ఏకపక్షంగా వ్యవహరించారని, పైగా వాటాల్లో 30 శాతం తనకు అదనంగా కావాలని ఆంక్ష పెట్టారని పేర్కొన్నారు. వైఎస్ఆర్ ఏదైతే నలుగురు పిల్లలకు సమానంగా వాటా రావాలని కోరుకున్నారో దానికి విరుద్ధంగా వ్యవహరిస్తూ పైగా తనపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని అన్నారు. తమ కుటుంబం మధ్య లేఖలు రాసినా.. అవేవీ తాను బయటపెట్టలేదని, దీనికి బైబిల్‌పై ప్రమాణం చేయడానికి తాను సిద్ధమని పేర్కొన్నారు. టిడిపి సోషల్ మీడియాలో వస్తే తనకేం సంబంధమని ప్రశ్నించారు.

'సూర్యలంక' బీచ్‌లో ప్రవేశానికి రుసుము

- రూ.20 కడితేనే లోపలికి అనుమతి
- జనవరి ఒకటి నుండి అమలు

ప్రజాశక్తి-బాపట్ల

సూర్యలంక బీచ్‌లోకి ఇకపై ఎవరైనా వెళ్లాలంటే డబ్బులు చెల్లించాలి. అంటే టికెట్ తీసుకోవాలి. వాస్తవానికి బీచ్‌లోకి ప్రవేశం ఉచితం. ఇకపై రుసుము వసూలు చేయాలని అధికారులు నిర్ణయించారు. బాపట్లలోని మున్సిపల్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో స్థానిక ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ శుక్రవారం సమావేశం నిర్వహించారు. కార్తీక మాసం సందర్భంగా సూర్యలంక బీచ్‌కు వచ్చే పర్యాటకులకు కల్పించాల్సిన ఏర్పాట్లపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీచ్‌కు వచ్చే పర్యాటకుల వద్ద నుండి బీచ్ అభివృద్ధి కోసం ఫీజు వసూలు చేయనున్నట్లు తెలిపారు. సముద్ర తీరం వద్ద ఫెన్సింగ్ ఏర్పాటు చేసి.. బీచ్‌లోకి ప్రవేశించేందుకు మూడు ప్రవేశ మార్గాల ద్వారా పర్యాటకులను అనుమతిస్తామని వివరించారు. పర్యాటకులు ఒక్కొక్కరి వద్ద నుండి రూ.20 వసూలు చేసే విధంగా ప్రణాళికలు తయారు చేస్తున్నామన్నారు. జనవరి ఒకటి నుండి ఈ విధానాన్ని అమలు చేస్తామని తెలిపారు. సూర్యలంక సముద్ర తీరం అభివృద్ధి కోసం ఆదాయ మార్గాల అన్వేషణలో భాగంగా అనేక మార్పులు చేస్తున్నామని చెప్పారు. బాపట్ల సూర్యలంక సముద్ర తీరాన్ని విదేశీయులను సైతం ఆకర్షించే విధంగా ప్రముఖ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామని తెలిపారు. సమావేశంలో డిపిఒ ప్రభాకర్ రావు, ఆర్‌డిఒ గ్లోరియా, మున్సిపల్ కమిషనర్ రఘునాథరెడ్డి, పోలీసు, రెవెన్యూ, పంచాయతీరాజ్ అధికారులు పాల్గొన్నారు.

దళిత కుటుంబంపై పెత్తందారుల దాడి

ప్రజాశక్తి - బైరెడ్డిపల్లి (చిత్తూరు జిల్లా)

తాతల కాలం నుంచి సాగు చేసుకుంటున్న భూమిని పెత్తందారులు ఆక్రమించుకోవడమే కాకుండా, బయట ప్రాంతాల నుంచి రౌడీలను పిలిపించి దళిత కుటుంబంపై దాడికి పాల్పడ్డ ఘటన బైరెడ్డిపల్లి మండలంలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధితుల తెలిపిన వివరాల మేరకు... చిత్తూరు జిల్లా బైరెడ్డిపల్లి మండలం పెద్ద చెల్లారగుంట రెవెన్యూ పరిధిలోని 174/2లోని 1.24 ఎకరాల భూమిని తాతిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన దళిత కుటుంబ సభ్యులు మూడు తరాలుగా సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. అదే గ్రామానికి చెందిన అశోక్‌కుమార్ రెవెన్యూ సిబ్బందితో కుమ్మక్కయ్యి గౌరమ్మ పేరుపై పట్టా పాస్‌బుక్ చేయించుకున్నారు. మూడు తరాలుగా తాతల కాలం నుంచి సాగు చేసుకుంటున్న భూమిని గౌరమ్మ పేరుతో ఎలా పట్టా పాస్ బుక్ ఇస్తారంటూ దళితులు వెంకట లక్ష్మమ్మ, కృష్ణప్ప, నారాయణప్ప, చంద్ర, కనకమ్మలు నిరసిస్తూ అప్పట్లోనే తహాశీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి తహాశీల్దార్ మాధవరాజుకు వినతిపత్రం ఇచ్చారు. మండలంలోని దళిత సంఘాలు ఆ కుటుంబానికి అండగా నిలిచాయి. అప్పటినుంచి ఈ రోజు, రేపు సమస్యను పరిష్కరిస్తానంటూ తహాశీల్దార్ కాలం గడుపుతూనే వచ్చారు. నాలుగు రోజుల క్రితం భూ సమస్య పరిష్కరించాలని చంద్ర మరోసారి విన్నవించారు. దీంతో నవంబర్ 7న క్షేత్రస్థాయిలో పరిశీలించి న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. తహాశీల్దార్ ప్రకటనతో గురువారం అశోక్‌కుమార్ వేరే గ్రామానికి చెందిన కొంతమంది రౌడీమూకలను వెంటబెట్టుకుని వచ్చి జెసిబి సాయంతో దళితుల పంటను నాశనం చేశారు. దళితులు అక్కడకు చేరుకుని జెసిబిని అడ్డుకునే ప్రయత్నం చేయగా అశోక్‌కుమార్ రౌడీల సాయంతో వారిపై దాడికి పాల్పడి హత్యాయత్నం చేశాడు. ఈ విషయమై బాధితులు స్థానిక పోలీసు స్టేషన్‌లో శుక్రవారం ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. గాయపడిన గౌరమ్మ, కృష్ణప్పలు పలమనేరు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. దళితులపై జరిగిన దాడిపై కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి ఈశ్వర్ ఖండించారు. దళిత కుటుంబానికి న్యాయం చేయాలని ఆయన డిమాండ్ చేశారు.


దళిత మహిళలపై దాడి

ఏప్రిల్ నుంచి అమల్లోకి కొత్త టూరిజం పాలసీ

- మంత్రి కందుల దుర్గేష్

ప్రజాశక్తి- ఎంవిపి.కాలనీ (విశాఖపట్నం)

2025-30 టూరిజం పాలసీని రూపొందిస్తున్నామని, వచ్చే ఏడాది ఏప్రిల్ నుంచి అది అమల్లోకి రానుందని, తద్వారా పర్యాటక రంగానికి పునర్వైభవం తెస్తామని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. శుక్రవారం ఆయన విశాఖపట్నంలోని హోటల్ ఫోర్ పాయింట్స్ బై షెర్టాన్‌లో జరిగిన సిఐఐ టూరిజం అండ్ ట్రావెల్ సమ్మిట్‌కు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పర్యాటకులను ఆకర్షించేలా, స్టేక్ హోల్డర్లకు అనుకూలంగా ఉండేలా పాలసీని రూపకల్పన చేస్తున్నామన్నారు. రాష్ట్ర పర్యాటక రంగానికి పరిశ్రమ హోదా కల్పించడంతో ఇండస్ట్రీలకు ఇచ్చే బెనిఫిట్స్ అన్నీ టూరిజానికి కూడా దక్కుతాయని వివరించారు. టూరిజం ద్వారా కనీసం 20 శాతం ఉద్యోగాలు కల్పించే విధంగా ప్రణాళికలు రూపొందిస్తునామని తెలిపారు. కేరళ తరహాలో పర్యాటక అభివృద్ధికి అవసరమైన అన్ని వనరులూ మన రాష్ట్రంలో ఉన్నాయన్నారు. పర్యాటకులను ఆకర్షించేలా టెంపుల్, ఎకో, అడ్వెంచర్, వెల్‌నెస్, అగ్రి టూరిజంలను కలుపుతూ టూరిజం సర్క్యూట్‌లు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. జనవరిలో బీచ్ ఫెస్టివల్ నిర్వహిస్తామన్నారు. పర్యాటక శాఖ రూపొందించిన బోచర్‌ను మంత్రి ఆవిష్కరించారు. విశాఖ ఎంపి ఎం.శ్రీభరత్, సురేష్ ప్రొడక్షన్స్ సిఇఒ, సినీ నిర్మాత దగ్గుబాటి సురేష్ బాబు, సిఐఐ విశాఖపట్నం చైర్మన్ రాజేష్ గ్రంధి, వైస్ చైర్మన్ వి.అజయ్ కుమార్, సిఐఐ టూరిజం ప్యానెల్ కన్వీనర్ రాజీ ఇందుకూరి, ప్రతినిధులు వి.మురళీకృష్ణ, ఎయిర్ పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా డైరెక్టర్ ఎస్.రాజారెడ్డి పాల్గొన్నారు.

కొవ్వూరు ప్రజాశక్తి విలేకరి బాపూజీ మృతి

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం



బాపూజీ (ఫైల్)

తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు ప్రజాశక్తి విలేకరి పూజ్య నర్సింహ బాపూజీ (75) అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందారు. కొంతకాలంగా ఆయన పచ్చకామెర్లతో బాధపడుతున్నారు. పరిస్థితి విషమించడంతో కన్నుమూశారు. బాపూజీకి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. పదేళ్లుగా ప్రజాశక్తి విలేకరిగా ఆయన విధులు నిర్వహిస్తున్నారు. ఆయన మృతికి ప్రజాశక్తి ఎడిటర్ తులసీదాస్, సిజిఎం అచ్యుతరావు, జిల్లా సమన్వయ కమిటీ కన్వీనర్, ఎడిషన్ మేనేజర్ డి.శ్రీనివాస్ సంతాపం తెలిపారు. రాజమండ్రిలో శనివారం అంత్యక్రియలు జరుగుతాయని కుటుంబ సభ్యులు తెలిపారు.

సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికుల పోరాటానికి సిపిఎం మద్దతు

- కోర్టులు ఇచ్చిన తీర్పులను అమలు చేయాలి
- కార్మికులకు పరిహారం చెల్లించకుండా సెంటు భూమి అమ్మలేరు : వి శ్రీనివాసరావు
- 27న ఎసిసి భూముల్లోకి వెళ్లాలని కార్మికులకు పిలుపు



ఎసిసి కార్మికుల సమావేశంలో మాట్లాడుతున్న వి శ్రీనివాసరావు

ప్రజాశక్తి-తాడేపల్లి (గుంటూరు జిల్లా)

ఎసిసి సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికుల న్యాయమైన పోరాటానికి సిపిఎం సంపూర్ణ మద్దతునిస్తుందని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు తెలిపారు. గుంటూరు జిల్లా తాడేపల్లిలోని సిమెంట్ ఫ్యాక్టరీ యూనియన్ కార్యాలయం వద్ద కార్మిక నాయకులు కూరపాటి స్టీవెన్ అధ్యక్షతన శుక్రవారం జరిగిన విస్తత సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వాలకు చిత్తశుద్ధి ఉంటే కోర్టులు ఇచ్చిన తీర్పులను అమలు చేసి కార్మికులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులకు న్యాయంగా రావాల్సిన బకాయిలు చెల్లించకుండా సెంటు భూమి కూడా అమ్మలేరని తెలిపారు. కార్మిక వర్గం కుటుంబ సభ్యులతో కలిసి ఆందోళనకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. లేబర్ ట్రిబ్యునల్ కోర్టు, హైకోర్టుల్లో కార్మికులు గెలిచినా.. ప్రభుత్వాలు ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. మంగళగిరి ఎమ్మెల్యే, ఐటి శాఖ మంత్రి నారా లోకేష్ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికుల సమస్యను పరిష్కరించేందుకు ముందుకు రావడాన్ని ఆయన స్వాగతించారు. నిజంగా లోకేష్‌కు చిత్తశుద్ధి ఉంటే కార్మికుల సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ప్రజలకు, కార్మిక వర్గానికి ఆదర్శంగా ఉండాల్సిన పాలక పార్టీ నేతలు, ప్రభుత్వాధి నేతలు, ఫ్యాక్టరీ భూములు కొట్టేయటం న్యాయమేనా? అని నిలదీశారు. ఇప్పటిదాకా వందల సంఖ్యలో కార్మికులు చనిపోయారని, కుటుంబాలు వీధిన పడ్డాయని, కొందరు ఇప్పటికీ పస్తులతో జీవనం సాగిస్తున్నారని గుర్తు చేశారు. ఎసిసి ఫ్యాక్టరీ యాజమాన్యం, ప్రస్తుతం భూములు కొనుగోలు చేసిన వారు బాగానే ఉన్నారని, కార్మికులు మాత్రం రోడ్డున పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. పూటగడటం కష్టంగా ఉన్న కార్మిక కుటుంబాలకు ప్రభుత్వమే బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. ఈ నెల 27న కార్మిక వర్గం మొత్తం ఎసిసి సిమెంట్ ఫ్యాక్టరీ భూముల్లోకి దిగి స్వాధీనం చేసుకోవాలని పిలుపునిచ్చారు.

అందుకు సిపిఎం పూర్తి అండదండలిస్తుందని తెలిపారు. కార్మిక వర్గం ఐక్యంగా ముందుకు సాగాలని, సిమెంట్ ఫ్యాక్టరీ భూ పోరాటం విజయవంతం కావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం రూరల్ కార్యదర్శి దొంతి రెడ్డి వెంకట్ రెడ్డి, సిపిఎం పట్టణ కార్యదర్శి బోరుగ వెంకటేశ్వర్లు, సిఐటియు తాడేపల్లి పట్టణ కార్యదర్శి వేముల దుర్గారావు, కార్మికులు వై యహోశువ, సుబ్బారావు, ఎస్‌కె భాష, ఎం ఆశీర్వాదం, సూర్యప్రకాష్, అంకయ్య, నవనీతం, ఆదినారాయణ, రమాదేవి, శివకుమార్, సారమ్మ, ఇమాంబి తదితరులు పాల్గొన్నారు.

డయేరియాను అరికట్టాలి

- మృతులకు రూ.25 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి
- ప్రజారోగ్య వేదిక రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తల డిమాండ్



సమావేశంలో మాట్లాడుతున్న ప్రజారోగ్య వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.కామేశ్వరరావు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

గుర్లలో డయేరియాతో మరణించిన వారి కుటుంబాలకు రూ.25 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. రానున్న ఐదేళ్ల కాలంలో రక్షిత మంచినీరు సరఫరా చేసేందుకు ప్రణాళిక రూపొందించాలని, ఆ మేరకు నిధులు మంజూరు చేయాలని కోరారు. విజయనగరంలోని ఎన్‌పిఆర్ భవనంలో ప్రజారోగ్య వేదిక ఆధ్వర్యాన రౌండ్‌టేబుల్ సమావేశం శుక్రవారం జరిగింది. ప్రజారోగ్య వేదిక జిల్లా కన్వీనర్ ఎస్.లక్ష్మణరావు అధ్యక్షత వహించిన ఈ సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.కామేశ్వరరావు మాట్లాడుతూ.. గుర్లలో డయేరియా మరణాలపై విచారం వ్యక్తం చేశారు. అధికార యంత్రాంగం అప్రమత్తంగా లేకపోవడం వల్లే మరణాలు సంభవించాయని తెలిపారు. 78 ఏళ్ల స్వాతంత్ర్య భారతంలో ఉచితంగా దొరికే మంచినీరు అందకపోవడం దారుణమన్నారు. జిల్లాలో వెంటనే హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించాలని, పెరుగుతున్న డయేరియా కేసులను నియంత్రించాలని డిమాండ్ చేశారు. మరణించిన వారి కుటుంబాలకు రూ.25 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని కోరారు. ప్రధానంగా సురక్షిత తాగునీరు అందించాలని, రెగ్యులర్‌గా తాగునీటి ట్యాంకులు శుభ్రం చేయాలని డిమాండ్ చేశారు. వ్యక్తిగత మరుగుదొడ్ల సౌకర్యం కల్పించి.. వాటి వినియోగంపై అవగాహన కల్పించాలని కోరారు. సమావేశంలో సిపిఎం, ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక, ఐద్వా, ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ, సిఐటియు, పెన్షనర్ల సంఘం, మెడికల్ రిప్స్ యూనియన్, ఎస్‌డబ్ల్యుఎఫ్ నాయకులు మాట్లాడారు.

డయేరియా మరణాలపై విశ్లేషణకు కమిటీ

- నలుగురు వైద్యనిపుణుల నియామకం

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

గుర్లలోని డయేరియా మరణాలను విశ్లేషించేందుకు ప్రభుత్వం నలుగురు వైద్య నిపుణులతో కమిటీని ఏర్పాటు చేసింది. ఈ నెల 27 నాటికి ఈ కమిటీ నివేదిక సమర్పించాల్సి ఉంటుంది. ఈ మేరకు విజయనగరం ప్రభుత్వ మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్ పద్మలీల శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ కమిటీలో కళాశాలకు చెందిన డిసిహెచ్ఎస్ డాక్టర్ వరప్రసాదరావు (కమ్యూనిటీ మెడిసిన్ విభాగం), డాక్టర్ ఆదిత్యవర్మ (జనరల్ మెడిసిన్ అసిస్టెంట్ ప్రొఫెసర్), డాక్టర్ జి లావణ్య (మైక్రో బయాలజీ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్), ల్యాబ్ టెక్నీషియన్ సత్యనారాయణ ఉన్నారు. డయేరియా కారణంగా గుర్ల గ్రామంలో ఇటీవల పది మంది మృతి చెందిన సంగతి తెలిసిందే.

ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి : జడ్‌పి సమావేశ తీర్మానం

గుర్లతోపాటు ఆ మండలంలో డయేరియతో మరణించిన వారందరికీ ప్రభుత్వం తరపున ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని జిల్లా పరిషత్ సమావేశం తీర్మానం చేసింది. ఈ మేరకు జడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అధ్యక్షతన శుక్రవారం జరిగిన సర్వ సభ్య సమావేశంలో వైసిపికి చెందిన ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స సూర్యనారాయణరాజు మాట్లాడుతూ గుర్ల, తదితర గ్రామాల్లో డయేరియాతో 14 మంది చనిపోతే, ప్రభుత్వం ఒక్కరు మాత్రమే మృతిచెందినట్టు ప్రకటించడం విచారకరమని అన్నారు. వీరందరికీ ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని సభ్యులంతా డిమాండ్ చేయడంతోపాటు ఈ మేరకు తీర్మానం చేశారు.



పాడైన వ్యవసాయ విద్యుత్ మోటార్‌తో ధర్నా చేస్తున్న రైతులు, నాయకులు

వరదల్లో పాడైన విద్యుత్ మీటర్లు, ఆయిల్ ఇంజన్లకు

నష్టపరిహారం ఇవ్వాలి

- ఎపి రైతు, ఎపి కౌలు రైతు సంఘం డిమాండ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

కృష్ణానది పరివాహక ప్రాంతంతోపాటు విజయవాడలోని బుడమేరు వరదల్లో తడిచిపోయి పాడైన వ్యవసాయ విద్యుత్ మోటార్లు, డీజిల్ ఇంజన్లకు రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఎన్యూమరేషన్ చేసి నష్టపరిహారం చెల్లించాలని ఎపి రైతు సంఘం సీనియర్ నాయకులు వై కేశవరావు డిమాండ్ చేశారు. విజయవాడలోని ధర్నా చౌక్‌లో శుక్రవారం ఎపి రైతు సంఘం, ఎపి కౌలురైతు సంఘం ఆధ్వర్యాన ధర్నా జరిగింది. ఈ సందర్భంగా కేశవరావు మాట్లాడుతూ.. రైతాంగం ఇప్పటికే పంటలకు పెట్టుబడి పెట్టి పూర్తిగా నష్టపోయారని, ప్రభుత్వం ఇచ్చిన అరకొర సాయంతో అప్పుల ఊబిలో చిక్కుకున్న రైతాంగానికి ఇది ఏమాత్రం ఊరటగా లేదన్నారు. ఒక్కొక్క మోటారుకు, డీజిల్ ఇంజిన్లకు మరమ్మతుల నిమిత్తం రూ.3 వేల నుంచి రూ.10 వేలు ఖర్చువుతుందన్నారు. అసలే అప్పుల్లో ఉన్న రైతాంగం తిరిగి ఆ ఖర్చును భరించే స్థితిలో లేదని ప్రభుత్వం స్పందించి నష్టపరిహారం ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. ఎపి కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం హరిబాబు మాట్లాడుతూ.. విజయవాడలో వరదల సందర్భంగా మునిగిపోయిన స్కూటర్లు, బైకులు, ఆటోలు, తోపుడు బండ్లకు నష్టపరిహారం ఏ ప్రాతిపదికన ఇచ్చారో, రైతాంగానికి కూడా నిత్యం అవసరమైన విద్యుత్ మోటార్లు, ఆయిల్ ఇంజన్లకు కూడా వెంటనే నష్టపరిహారం ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రభుత్వం పంటలకిచ్చిన నష్టపరిహారం కూడా ఏ మూలకూ సరిపోదని, వరికి ఎకరాకు ఇప్పటికే రూ.25 వేల నుంచి రూ.30 వేలకు వరకు పెట్టుబడులు పెట్టారన్నారు. వరదలతో ఒక్క గింజ కూడా చేతికి రాకుండానే పూర్తిగా నష్టపోయిన రైతు దివాలా తీశాడన్నారు. ప్రభుత్వం ఎకరాకు రూ.25 వేలు నష్టపరిహారం ఇస్తే కాని, కొంత మేరకైనా పెట్టుబడి సమకూరుతుందన్నారు. అలాగే వాణిజ్య పంటలైన కంద, పసుపు, అరటి, తమలపాకు పంటలకు ఎకరాకు రూ.2 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు పెట్టుబడులు పెట్టారని, వారికి కేవలం రూ.14 వేలు ఇచ్చి చేతులు దులుపుకున్నారన్నారు. వాణిజ్య పంటలకు కనీసం ఎకరాకు రూ.50 వేలైనా నష్టపరిహారం ఇస్తే కొంత వరకైనా అప్పులు తగ్గించుకోవడానికి ఉపయోగ పడుతుందన్నారు. ఈ ధర్నా కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి కృష్ణయ్య, జొన్న శివశంకరరావు, సహాయ కార్యదర్శి పంచకర్ల రంగారావు, ఉపాధ్యక్షులు టివి లక్ష్మణస్వామి, నాగమల్లేశ్వరరావు, జి సురేష్, ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి గౌరిశెట్టి నాగేశ్వరరావు, ఎన్ మురళీ కృష్ణారెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు అజ్మీర వెంకటేశ్వరరావు, గుబిలి వెంకటేశ్వరరావు, చెన్న శివ కోటేశ్వరరావు, జి ప్రసాద్, ఎం కోటేశ్వరరావు, ఎనికేపల్లి శేషమ్మ, ప్రకాష్, రమేష్, విష్ణు పాల్గొన్నారు.

బెల్టు షాపులపై దాడులు

ప్రజాశక్తి-కంభం (ప్రకాశం జిల్లా)

ప్రకాశం జిల్లాలో వేర్వేరు చోట్ల మద్యం వ్యాపారం అక్రమంగా సాగిస్తున్న బెల్టు షాపులపై పోలీసులు దాడులు నిర్వహించారు. 55 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కంభం మండలం చిన్నకంభం గ్రామంలో పి.తిరుపతయ్య అనే వ్యక్తి అక్రమంగా బెల్టు షాపు నిర్వహిస్తున్నారని సమాచారం అందింది. ప్రోహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ కొండారెడ్డి తన సిబ్బందితో కలిసి దాడి చేసి 20 క్వార్టర్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. నిర్వాహకుడిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. బేస్తవారిపేట మండలం చిన్న ఓబినేనిపల్లి గ్రామానికి చెందిన వ్యక్తి అక్రమంగా బెల్టు షాపు నిర్వహిస్తున్నారని సమాచారం అందడంతో ఎస్ఐ రవీంద్రారెడ్డి దాడి చేశారు. 35 క్వార్టర్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. బెల్టు షాపు నిర్వాహకుడిపై కేసు నమోదు చేశారు.

జల్‌జీవన్‌కు ఝలక్!

- రూ.680 కోట్ల విడుదలలో కేంద్రం జాప్యం
- రూ.572 కోట్ల చెల్లింపులు నిలిపివేసిన రాష్ట్రం
- సర్వే, విచారణ పేరుతో కాలయాపన



పులివెందుల జగనన్న కాలనీలో నిలిచిపోయిన కుళాయి కనెక్షన్ పనులు

ప్రజాశక్తి- కడప ప్రతినిధి

కేంద్ర ప్రభుత్వ ప్రాయోజిత పథకమైన జల్‌జీవన్ మిషన్ నీరుగారుతోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధులలో జాప్యం చేయడం, పెండింగ్ బకాయిలు చెల్లించకపోవడం, విచారణ, సర్వేలతో కాలయాపన చేస్తుండడంతో ఈ పథకం పడకేసింది. రాష్ట్రంలో ఇంటింటికీ కుళాయి కనెక్షన్ ఇచ్చేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 50:50 శాతం నిధుల భాగస్వామ్యంతో రూ.30 వేల కోట్లతో పనులను 2022 మార్చిలో ప్రారంభించాయి. 2024 ఏడాది చివరికి 26 జిల్లాల్లోని 95,53,001 గ్రామీణుల ఇళ్లకు రాష్ట్ర గ్రామీణ నీటి సరఫరా విభాగం (ఆర్‌డబ్ల్యుఎస్) ఆధ్వర్యాన పైప్‌లైన్ల ద్వారా కుళాయి కనెక్షన్ ఇవ్వాలనేది లక్ష్యం. ఈ ఏడాది ఏప్రిల్ నాటికి 15,634 ఇళ్లకు మాత్రమే కనెక్షన్లు ఇచ్చారు. రాష్ట్రంలో అత్యధికంగా ఏలూరు జిల్లాలో 4,79,752 ఇళ్లకుగాను 4,09,252 ఇళ్లకు, కడప జిల్లాలో 3,29,865 ఇళ్లకు, అన్నమయ్య జిల్లాలో 3,63,698 ఇళ్లకు, అత్యల్పంగా విశాఖ జిల్లాలో 59,330 ఇళ్లకుగానూ 39,911 ఇళ్లకు కుళాయి కనెక్షన్లు ఇవ్వాల్సి ఉంది. కడప జిల్లాలో తాగునీటి తీవ్రత దృష్ట్యా 35 మండలాల పరిధిలో రూ.184.76 కోట్లతో 2,588 పనులుగా విభజించి పనులు చేపట్టారు. రూ.59 కోట్లతో 1,130 పనులు మాత్రమే పూర్తయ్యాయి. రూ.2.59 కోట్లతో చేపట్టిన 27 పనులు పురోగతిలో ఉన్నాయి. రూ.51 కోట్ల విలువైన 949 పనులను కాంట్రాక్టర్లు మధ్యలోనే నిలిపివేశారు. రూ.71.17 కోట్ల విలువైన 482 పనులు నేటికీ ప్రారంభానికి నోచుకోలేదు. రాష్ట్రంలో ఇప్పటి వరకూ జరిగిన పనులకు సంబంధించి రూ.1,252 కోట్లు నిధులు పెండింగ్‌లో ఉన్నాయి. ఇందులో కేంద్ర ప్రభుత్వం రూ.680 కోట్లు, రాష్ట్ర ప్రభుత్వం రూ.572 కోట్లు చెల్లించాల్సి ఉంది. దీంతో, పనులు నిల్చిపోయాయి. కేంద్ర ప్రభుత్వం గతేడాది జనవరిలో తాగు నీటి అవసరాల రీత్యా కడప, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాలను ఇంటింటికీ కుళాయి పథకం కింద రూ.94 కోట్లతో దాదాపు పది వేలు చొప్పున అదనపు కుళాయి కనెక్షన్లు మంజూరు చేసింది. ఈ జిల్లాల్లో మొత్తం 3.39 లక్షల ఇళ్లకు అదనంగా కుళాయి కనెక్షన్లు ఇవ్వాల్సి ఉంది. ఈ పనులు కూడా ముందుకు సాగలేదు. జగనన్న కాలనీల్లో 438 రకాల పనుల నిర్వహణకు గ్రామీణ స్వయం సహాయక సంఘాలకు చెందిన గ్రామ జలసంఘాలకు కుళాయి కనెక్షన్లు, అదనపు బోర్ల ఏర్పాటు, ఇంటింటికీ కుళాయి కనెక్షన్ల పనులను ప్రభుత్వం అప్పగించింది. ఈ పనుల్లోనూ పురోగతి లేదు. గత సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కూటమి సర్కారు... వైసిపి హయాంలో జరిగిన ఇంటింటి కుళాయి కనెక్షన్ పనులపై విచారణ చేపట్టింది. 98 శాతం పక్కాగా పనులు చేసినట్లు తేలినట్లు సమాచారం. పెండింగ్ బిల్లులు చెల్లించకుండా మరోసారి సర్వే పేరుతో కాలయాపన చేస్తోంది.

వర్గీకరణతోనే డిఎస్‌సి నోటిఫికేషన్

- మంద కృష్ణ మాదిగ డిమాండ్

ప్రజాశక్తి గుంటూరు జిల్లా ప్రతినిధి

ఎస్‌సి వర్గీకరణ ప్రక్రియను వెంటనే ప్రారంభించాలని ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపకులు మంద కృష్ణ మాదిగ కోరారు. గుంటూరులోని ఒక హోటల్లో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. వర్గీకరణ చేయకుండా ప్రభుత్వ ఉద్యోగాలకు ఎలాంటి నోటిఫికేషన్ ఇవ్వద్దన్నారు. మెగా డిఎస్‌సి నోటిఫికేషన్ విడుదల చేస్తున్నామని లోకేష్ ప్రకటించారని.. వర్గీకరణ ప్రక్రియను పూర్తి చేసిన తరువాతే నోటిఫికేషన్ విడుదల చేయాలని కోరారు. వర్గీకరణకు అనుకూలంగా సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిన తర్వాత పలు రాష్ట్రాలు సానుకూలంగా స్పందించాయని తెలిపారు. ఉమ్మడి రాష్ట్రంలో వర్గీకరణ చట్టాన్ని అమలు చేసిన చంద్రబాబు సుప్రీంకోర్టు తీర్పుపై మౌనం వహించడం తగదన్నారు. తమకు చంద్రబాబుపై నమ్మకం ఉందని, త్వరలోనే వర్గీకరణ ప్రక్రియ చేపడతారని ఆశిస్తున్నామని తెలిపారు. సుప్రీం తీర్పునకు అనుగుణంగా ఇప్పటికే మహారాష్ట్ర, హర్యానా, పంజాబ్ ప్రభుత్వాలు వర్గీకరణ అమలుకు కసరత్తు ప్రారంభించాయన్నారు. తమిళనాడులో ఇప్పటికే వర్గీకరణ చట్టం అమలులో ఉందని పేర్కొన్నారు. తెలంగాణలో కమిషన్ ఏర్పాటు చేశారని తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో వర్గీకరణ అమలుకు ఇంతవరకు ప్రక్రియ ప్రారంభించకపోవడం విచారకరమన్నారు. వర్గీకరణకు జగన్ సానుకూలంగా స్పందించకపోవడం వల్ల వైసిపిని ఎన్నికల్లో ఓడించామని పేర్కొన్నారు.



మోకాళ్లపై నిరసన తెలుపుతున్న సిఐటియు నాయకులు

పోర్టు ఆస్పత్రి ప్రయివేటీకరణ నిర్ణయం అనైతికం

ప్రజాశక్తి - సీతమ్మధార (విశాఖపట్నం)

విశాఖ పోర్టు ఆస్పత్రి ప్రైవేటీకరణ నిర్ణయం అనైతికమని, టెండర్ వేసేందుకు ఎవరు వచ్చినా అడుగు పెట్టనిచ్చేది లేదని యునైటెడ్ పోర్టు అండ్ డాక్ ఎంప్లాయీస్ యూనియన్ గౌరవాధ్యక్షులు విఎస్ పద్మనాభరాజు, సిఐటియు నాయకులు బి జగన్ అన్నారు. పోర్టు ఆస్పత్రి ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ హాస్పిటల్ వద్ద సిఐటియు ఆధ్వర్యాన జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు శుక్రవారానికి 25వ రోజుకు చేరుకున్నాయి. మోకాళ్లపై నిల్చొని ఆందోళనకారులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఆస్పత్రి ప్రయివేటీకరణ నిర్ణయం ఎంతమాత్రమూ తగదని, హాస్పిటల్ అభివృద్ధి కార్మికుల కృషితోనే సాధ్యమైందని, సుమారు 40 వేల మంది కార్మికుల ఆరోగ్యానికి సంబంధించిన సేవలను ప్రయివేటుకు ఎలా అప్పజెబుతారని ప్రశ్నించారు. విశాఖపట్నం పోర్టు లాభాల్లో ఉందని, పోర్టు నిధులతోనే ఆస్పత్రిని అభివృద్ధి చేయాలని కోరారు. పోర్టు యాజమాన్యం వద్ద రిజర్వ్ ఫండ్స్, వేల ఎకరాల భూములు ఉన్నప్పటికీ ఆస్పత్రి ప్రయివేటీకరణకు పూనుకోవడం దారుణమన్నారు. ఆస్పత్రిని పరిరక్షించుకునేందుకు జరుగుతున్న పోరాటంలో రాజకీయ పార్టీలు, ప్రజలు, కార్మికులు కలిసి రావాలని కోరారు.

ప్రయివేటీకరణ నిర్ణయాన్ని ఉపసంహరించుకోకుంటే పోర్టు చైర్మన్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు కె సత్యనారాయణ, ఈశ్వరరావు, బి లక్ష్మణరావు, రామలింగేశ్వరరావు, త్రినాధరావు, కెఎస్ కుమార్, శ్రీను, రాఘవులు, కె విజయరావు పాల్గొన్నారు.

భళా బిఎస్ఎన్ఎల్..

- కొత్తగా 55 లక్షల పైగా ఖాతాదారుల చేరిక
- ప్రయివేటు టెల్కోలకు గుడ్‌బై



న్యూఢిల్లీ : ప్రభుత్వ రంగ టెల్కో బిఎస్ఎన్ఎల్‌కు ఆదరణ భారీగా పెరుగుతోంది. ప్రయివేటు టెల్కోలు అడ్డగోలుగా పెంచిన టారిఫ్‌లను వినియోగదారులు భరించలేక.. బిఎస్ఎన్ఎల్ వైపు మొగ్గు చూపుతున్నారు. కొత్త ఖాతాదారులు లక్షల్లో వచ్చి చేరుతున్నారు. కేవలం రెండు నెలల్లోనే బిఎస్ఎన్ఎల్‌లో కొత్తగా 55 లక్షల మంది పైగా చేరారు. ఇదే సమయంలో ప్రయివేటు టెల్కోలు ఏకంగా 1.21 కోట్ల ఖాతాదారులను పోగొట్టుకున్నాయి. టెలికం నియంత్రణ సంస్థ ట్రాయ్ శుక్రవారం వెల్లడించిన గణంకాల ప్రకారం.. ఈ ఏడాది ఆగస్టులో బిఎస్ఎన్‌లో కొత్తగా 25.3 లక్షల మంది వినియోగదారులు చేరారు. ఇంతక్రితం నెల జులైలోనూ 29.3 లక్షల మంది కొత్తగా వచ్చారు.

టారీఫ్‌ల దెబ్బకు.. రిటర్న్ గిఫ్ట్

రిలయన్స్ జియో జులైలో తొలుత భారీగా టారీఫ్‌లను పెంచడం.. ఆ బాటలోనే భారతీ ఎయిర్‌టెల్, వొడాఫోన్ ఐడియాలు 25 శాతం వరకు టారీఫ్‌లను పెంచేశాయి. దీంతో ఆ భారాన్ని భరించలేక అనేక మంది బిఎస్ఎన్ఎల్ వైపు మొగ్గు చూపుతున్న విషయం తెలిసిందే. గడిచిన ఆగస్ట్ నెలలో జియో, ఎయిర్‌టెల్, విఐలు ఏకంగా 83 లక్షల మంది ఖాతాదారులను పోగొట్టుకున్నాయి. ఒక్క నెలలోనే రిలయన్స్ జియోను ఏకంగా 40.2 లక్షల మంది వదులుకున్నారు. భారతీ ఎయిర్‌టెల్ నెట్‌వర్క్‌కు 24.1 లక్షల మంది గుడ్‌బై చెప్పగా.. విఐ 18.7 లక్షల మందిని కోల్పోయింది. ఇంతక్రితం జులైలోనూ ఈ మూడు టెల్కోలకు 38.6 లక్షల మంది ఖాతాదారులు గుడ్‌బై చెప్పారు.

ప్లాన్ల ధరలు పెంచం : బిఎస్ఎన్ఎల్

ప్రయివేటు టెల్కోలు ఉచిత కాల్స్ పేరుతో తొలుత స్వల్ప ఛార్జీలతో మార్కెట్లోకి వచ్చి.. కాలక్రమేణ అమాంతం పెంచేశాయి. కాగా.. బిఎస్ఎన్ఎల్ మాత్రం ఇటీవల తన ఖాతాదారులకు బలమైన హామీ ఇచ్చింది. తమ సంస్థ భవిష్యత్తులో టారీఫ్‌లను పెంచే యోచనలో లేదని ఇటీవల నూతన లోగో ఆవిష్కరణ సమయంలో స్పష్టం చేసింది. దీంతో ప్రయివేటు టెల్కోల్లో మరింత గుబులు మొదలయ్యిందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. బిఎస్ఎన్ఎల్‌కు ప్రయివేటు టెల్కోల ఖాతాదారుల వలస మరింత కొనసాగవచ్చని అంచనా వేస్తున్నారు.

ఐడిబిఐకి రూ.1,836 కోట్ల లాభాలు

హైదరాబాద్ : ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25) జులై నుంచి సెప్టెంబర్‌తో ముగిసిన ద్వితీయ త్రైమాసికం (క్యూ2)లో ఐడిబిఐ బ్యాంక్ నికర లాభాలు 39 శాతం పెరిగి రూ.1,836 కోట్లకు చేరాయి. వడ్డీ ఆదాయంలో మెరుగుదల ఆర్థిక ఫలితాలకు ప్రధాన మద్దతును అందించాయి. ఎల్ఐసి ఆధ్వర్యంలోని ఈ బ్యాంక్ గతేడాది రూ.1,323 కోట్ల లాభాలు నమోదు చేసింది. ఇదే సమయంలో రూ.6,924 కోట్లుగా ఉన్న మొత్తం ఆదాయం.. గడిచిన క్యూ2లో రూ.8,754 కోట్లకు పెరిగింది. ఐడిబిఐ బ్యాంక్ నికర వడ్డీ ఆదాయం 3,875 కోట్లకు పెరిగింది. బ్యాంక్ స్థూల నిరర్థక ఆస్తులు 4.90 శాతం నుంచి 3.68 శాతానికి తగ్గాయి. ఏడాది క్రితం 0.39 శాతంగా ఉన్న నికర ఎన్‌పిఎలు.. గడిచిన సెప్టెంబర్ ముగింపు నాటికి 0.20 శాతానికి పరిమితమయ్యాయి.

బిఒబి ఫలితాలు ఆకర్షణీయం

ప్రభుత్వ రంగంలోని బ్యాంక్ ఆఫ్ బరోడా (బిఒబి) ఆకర్షణీయ ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. 2024-25 సెప్టెంబర్‌తో ముగిసిన ద్వితీయ త్రైమాసికం (క్యూ2)లో 23 శాతం వృద్ధితో రూ.5,238 కోట్ల నికర లాభాలు సాధించింది. ఇదే సమయంలో వడ్డీ ఆదాయం రూ.30,263 కోట్లకు చేరింది. ఏడాదికేడాదితో పోల్చితే స్థూల నిరర్థక ఆస్తులు 3.32 శాతం నుంచి 2.50 శాతానికి తగ్గాయి. నికర ఎన్‌పిఎలు 0.76 శాతం నుంచి 0.60 శాతానికి పరిమితమయ్యాయి.

పెరిగిన సూర్యోదయ్ ఎస్ఎఫ్‌బి డిపాజిట్లు

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం సెప్టెంబర్‌తో ముగిసిన రెండో త్రైమాసికం (క్యూ2)లో సూర్యోదయ్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ నికర లాభాలు 10 శాతం తగ్గి రూ.45 కోట్లకు పరిమితమయ్యాయి. గతేడాది ఇదే త్రైమాసికంలో రూ.50 కోట్ల లాభాలు ప్రకటించింది. అదే సమయంలో రూ.6387 కోట్లుగా ఉన్న డిపాజిట్లు.. గడిచిన క్యూ2లో 38.6 శాతం పెరిగి రూ.8851 కోట్లుగా చోటు చేసుకున్నాయి.

బంధన్ బ్యాంక్‌కు రూ.937 కోట్ల లాభాలు..

బంధన్ బ్యాంక్ 2024-25 సెప్టెంబర్‌తో ముగిసిన క్యూ2లో 29.99 శాతం వృద్ధితో రూ.937 కోట్ల నికర లాభాలు ప్రకటించింది. కొల్‌కత్తా కేంద్రంగా పని చేస్తోన్న ఈ బ్యాంక్ వడ్డీ ఆదాయం 22.44 శాతం పెరిగి రూ.5,499.81 కోట్లుగా నమోదయ్యింది. నికర ఎన్‌పిఎలు 2.3 శాతం నుంచి 1.3 శాతానికి తగ్గాయి.

టిసిఐ అమ్మకాల్లో 12.6 శాతం వృద్ధి

లాజిస్టిక్స్ సొల్యూషన్స్ సంస్థ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (టిసిఐ) 2024-25 సెప్టెంబర్‌తో ముగిసిన రెండో త్రైమాసికం (క్యూ2)లో 22.3 శాతం వృద్ధితో రూ.106.4 కోట్ల నికర లాభాలు సాధించింది. ఇదే సమయంలో కంపెనీ నికర అమ్మకాలు 12.6 శాతం పెరిగి రూ.1,131.4 కోట్లుగా నమోదయ్యింది. సంస్థ వ్యయాలు 11.84 శాతం పెరిగి రూ.1,037.4 కోట్లుగా ప్రకటించింది.

దలాల్‌స్ట్రీట్‌ను వీడని నష్టాలు

- ఐదో రోజూ నేల చూపులు
- సెన్సెక్స్ 600 పాయింట్ల పైగా పతనం

ముంబయి : దలాల్ స్ట్రీట్‌పై బేర్ పంజా కొనసా గుతోంది. అమ్మకాల ఒత్తిడితో వరుసగా ఐదో సెషన్‌లోనూ నష్టాలు కొనసాగాయి. శుక్రవారం సెషన్‌లో సెన్సెక్స్ 650 పాయింట్లు పతనం కాగా.. నిఫ్టీ 24,200 దిగువకు పడిపోయింది. బిఎస్ఇ సెన్సెక్స్ ఇంట్రాడేలో 900 పాయింట్లు పైగా కోల్పోగా.. తదుకు 663 పాయింట్లు లేదా 0.83 శాతం క్షీణించి 79,402కు పడిపోయింది. ఎన్ఎస్ఇ నిఫ్టీ 218 పాయింట్లు లేదా 0.9 శాతం నష్టపోయి 24,180 వద్ద ముగిసింది. బిఎస్ఇలో లిస్టెడ్ కంపెనీల మార్కెట్ కాపిటలైజేషన్ రూ.6.03 లక్షల కోట్లు ఆవిరై రూ.143.76 లక్షల కోట్లకు పరిమితమయ్యింది. సెప్టెంబర్ త్రైమాసికంలో కంపెనీల బలహీన ఆర్థిక ఫలితాల నేపథ్యంలో విదేశీ ఇన్వెస్టర్లు వాటాల ఉపసంహరణకు మొగ్గు చూపారు. గతేడాది ఆగస్టు తర్వాత వరుసగా నాలుగు వారాలు స్టాక్ మార్కెట్లు నష్టాలతో ముగియడం ఇదే తొలిసారి. ఐదు సెషన్లలో సూచీలు ఏడు శాతానికి పైగా నష్టపోయాయి. నిఫ్టీ-50లో 38 స్టాక్స్ ప్రతికూలతను ఎదుర్కొన్నాయి. ఇండస్‌ఇండ్ బ్యాంక్ ఏకంగా 18.99 శాతం విలువను కోల్పోగా.. అదానీ ఎంటర్‌ప్రైజెస్, శ్రీరామ్ ఫైనాన్స్, బిపిసిఎల్, మహీంద్రా అండ్ మహీంద్రా, కోల్ ఇండియా, ఎల్అండ్‌టి, అదానీ పోర్ట్స్ సూచీలు 2 శాతం చొప్పున నష్టపోయాయి. బిఎస్ఇ మిడ్‌క్యాప్ 1.48 శాతం, స్మాల్ క్యాప్ 2.4 శాతం చొప్పున తగ్గాయి.

ఈప్యాక్ డ్యూరబుల్‌తో హైసన్స్ ఒప్పందం

హైదరాబాద్ : ప్రముఖ ఒప్పంద తయారీ సంస్థ ఈప్యాక్ డ్యురబుల్‌తో హైసన్స్ సంస్థ ఒప్పందం చేసుకుంది. ఒప్పందంలో భాగంగా అధునాతనమైన హైసెన్స్ ఎయిర్ కండీషనర్లు, ఇతర గృహోపకరణాలను ఈప్యాక్ సంస్థ ఉత్పత్తి చేయనుంది. మేకిన్ ఇండియా నినాదం ద్వారా స్థానిక ఉత్పత్తుల తయారీని పెంచడంతోపాటు హైసెన్స్ నూతన సాంకేతికంగా ఉన్నతమైన, ప్రీమియం నాణ్యత ఉత్పత్తులను భారత మార్కెట్‌కు పరిచయం చేయనున్నట్లు హైసెన్స్ ఇండియా సిఇఒ పంకజ్ రాణ తెలిపారు. ఈప్యాక్ యూనిట్లలో వాషింగ్ మెషీన్లు, రిఫ్రిజిరేటర్లు, ఇతర చిన్న గృహోపకరణాలతో సహా ఎయిర్ కండిషనర్లు తయారీకి పెట్టుబడి పెట్టనున్నట్లు పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీసిటీలోని ఈప్యాక్‌లో

సంపాదకీయం

ఆర్థిక వ్యవస్థ అతలాకుతలం

భారత ఆర్థిక వ్యవస్థ తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటోందని వివిధ ప్రభుత్వ శాఖలు ఇటీవల విడుదల చేసిన వివిధ గణాంకాలు విదితం జేస్తున్నాయి. రూపాయి విలువ క్షీణించడం, పెరుగుతున్న ద్రవ్యోల్బణం, స్టాక్ మార్కెట్ నుండి విదేశీ పెట్టుబడుల ఉపసంహరణ, విపరీతమైన విదేశీ రుణాలు, విదేశీ వాణిజ్య లోటు వంటివి మన ఆర్థిక వ్యవస్థ దుస్థితిని వెల్లడిస్తున్నాయి. ఏడు శాతం వృద్ధితో ఆర్థికాభివృద్ధిలో భారతదేశం ప్రపంచంలోనే అగ్రగామిగా ఉందని మోడీ ప్రభుత్వం గొప్పలు చెప్పుకొంటున్నా 90 శాతం మంది ప్రజలకు దీని ప్రయోజనాలు అందడం లేదన్నది కఠోర వాస్తవం. ప్రజలు ఎదుర్కొంటున్న అసలైన ధరల పెరుగుదల ప్రభుత్వ గణాంకాలకు అందనంత! పెరుగుతున్న నిరుద్యోగం, వేతన పెరుగుదల లేకపోవడం ప్రజల కొనుగోలు శక్తిని క్షీణింపజేసింది. ఏడు శాతం వృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థ చలనశీలంగా కాకుండా స్తబ్దుగా ఉంది. భారత ఆర్థిక వ్యవస్థ స్థిరత్వంపై విదేశీ పెట్టుబడిదారులు విశ్వాసం కోల్పోయారు. విదేశీ మదుపరులు తమ పెట్టుబడులను భారతీయ స్టాక్ మార్కెట్ నుంచి ఉపసంహరించుకుంటున్నారు. విదేశీ మదుపరులు ఈ నెలలో ఇప్పటివరకు రూ.85,000 కోట్ల విలువైన షేర్లను విక్రయించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండవ త్రైమాసికంలో, భారతీయ కంపెనీల ఆర్థిక పరిస్థితి బలహీనంగా ఉండడంతో విదేశీ పెట్టుబడిదారులు దూరమవుతున్నారు. ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసేందుకు చైనా ఉద్దీపన ప్యాకేజీని ప్రకటించడం భారత మార్కెట్‌ను కూడా తాకింది.

ప్రపంచ ఆర్థిక మాంద్యం కారణంగా 2008లో భారతీయ స్టాక్ మార్కెట్ నుండి విదేశీ పెట్టుబడులు ఉపసంహరించబడ్డాయి. అప్పట్లో అది పెద్ద ప్రభావం చూపింది. రూపాయి విలువ క్షీణతకు అది కూడా కారణమైంది. అమెరికా డాలర్‌తో పోలిస్తే రూపాయి అత్యధికంగా నష్టపోయింది. మొన్నటిరోజు డాలర్ విలువ రూ.84.07 పైసలు. ఆ మారకపు విలువను కొనసాగించేందుకు రిజర్వ్ బ్యాంక్ తన నిల్వల నుంచి పెద్ద మొత్తంలో డాలర్లను విడుదల చేస్తోంది. ఇది విదేశీ మారక నిల్వలను కూడా తగ్గిస్తుంది. మోడీ ప్రభుత్వం 2014 మేలో అధికారంలోకి వచ్చినప్పుడు డాలర్ మారకం విలువ రూ.59.44 పైసలు కాగా పదేళ్లలో దాదాపు రూ.25 పడిపోయి రూ.84కి దిగజారింది. విదేశీ వాణిజ్య లోటు కూడా పెరుగుతోంది. ఆగస్టులో వాణిజ్య లోటు 2,970 డాలర్లకు పెరిగింది. గతేడాది ఆగస్టులో ఇది 2,421 కోట్లు. భారతదేశ ఎగుమతులు చాలా బలహీన స్థితిలో ఉన్నాయి. పెరుగుతున్న ద్రవ్యోల్బణం ప్రజల కొనుగోలు శక్తిని కూడా తగ్గిస్తుంది. సెప్టెంబర్‌లో వస్తు, సేవల పన్ను వసూళ్లే ఇందుకు నిదర్శనం. 40 నెలల్లో అత్యల్ప వృద్ధి రేటు (–) 6.5 శాతం నమోదైంది. ప్రస్తుత ద్రవ్యోల్బణం రేటుతో పోలిస్తే సెప్టెంబర్‌లో జిఎస్‌టి ఆదాయం పెద్దగా పెరగలేదు.

బొగ్గు, విద్యుత్, ముడి చమురు ప్రాసెసింగ్, మైనింగ్ వంటి ఎనిమిది కీలక రంగాల్లో ఉత్పత్తిపై ఆధారపడిన పారిశ్రామికోత్పత్తి సూచీ ఆగస్టులో ప్రతికూల వృద్ధిని నమోదు చేసింది. గత ఏడాదితో పోలిస్తే సెప్టెంబర్‌లో కార్ల విక్రయాలు 19 శాతం తగ్గాయి. సేవల రంగ సూచీ కూడా 10 నెలల కనిష్టానికి చేరింది. ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో గృహ రుణాల పంపిణీ తొమ్మిది శాతం పడిపోయింది. బలమైన మరియు చలనశీలమైన ఆర్థిక వ్యవస్థకు అవసరమైన ఇటువంటి అంశాలు క్షీణిస్తున్నాయి. పేలవమైన ఆర్థిక విధానాల ఫలితంగా మధ్యతరగతి, దిగువ తరగతులవారి ఆదాయం తగ్గింది. దేశం ఎదుర్కొంటున్న ప్రధాన సమస్య కొనుగోలు శక్తి లేకపోవడం. కొనుగోలు శక్తి కోవిడ్ పూర్వ స్థాయికి చేరుకోలేదని చాలా సూచికలు చూపిస్తున్నాయి. కొనుగోలు శక్తిని పెంచుకోవాలంటే దిగువన ఉన్న 50 శాతం మంది చేతిలో ఎక్కువ డబ్బు రావాలి. కానీ కేంద్ర ప్రభుత్వం మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం, ఇతర సంక్షేమ పథకాల కేటాయింపులు పెంచడం లేదు. దానికి బదులుగా, కార్పొరేట్‌లకు పన్ను మినహాయింపులతో సహా భారీ సబ్సిడీలు ఇస్తోంది. మాంద్యం నుంచి ఆర్థిక వ్యవస్థను కాపాడేందుకు ప్రత్యేక ప్యాకేజీలను అమలు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధం కావాలి. అలా చేయాలంటే ప్రజా ఒత్తిడి పెంచాలి.

మహనీయుల మాట



అపజయాలను ఖాతరు చేయకండి. అవి చాలా సహజమైనవి. అంతేకాదు, అవి జీవిత సౌందర్యాన్ని పెంచుతాయి. వెయ్యి సార్లు అపజయాన్ని చవిచూసినప్పుడు మరోసారి ప్రయత్నించాలన్న ఆదర్శాన్ని పదేపదే గుర్తు చేసుకోండి.

- నేతాజీ సుభాస్ చంద్రబోస్

వ్యాఖ్య

భారత్-చైనా సంబంధాల్లో ముఖ్య ఘట్టం

వాస్తవాధీన రేఖ (లైన్ ఆఫ్ యాక్చువల్ కంట్రోల్-ఎల్.ఎ.సి) పొడుగునా గస్తీ ఏర్పాట్లపై భారత్–చైనాల మధ్య ఒక ఒప్పందం కుదిరినట్టు భారత ప్రభుత్వం అక్టోబర్ 21న ప్రకటించింది. ఇది స్వాగతించదగిన పరిణామం. ఈ రెండు పొరుగు దేశాల మధ్య సంబంధాల సాధారణీకరణకు ఇది దారితీస్తుందని ఆశించవచ్చు. 2020లో గాల్వాన్ లోయలో సరిహద్దు ఘర్షణల తర్వాత భారత్–చైనాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలు దెబ్బతిన్నాయి. ఈ ఘర్షణలు పూర్తి స్థాయి యుద్ధానికి దారి తీయకుండా చూడాలని రెండు దేశాలు అంగీకరించాయి. 2020 నుంచి ఇరు దేశాల మధ్య సైనిక దౌత్య స్థాయిల్లో 31 దఫాల చర్చలు జరిగాయి. ఇరు పక్షాలకు చెందిన సైనిక కమాండర్లు సైనిక చర్చల్లో పాల్గొన్నారు. కాగా భారత్–చైనా సరిహద్దు వ్యవహారాల సంప్రదింపులు సమన్వయ యంత్రాంగం (డబ్ల్యు.ఎం.సి.సి) ఆధ్వర్యంలో దౌత్య స్థాయి చర్చలు జరిగాయి. రాజకీయ నాయకత్వ జోక్యంతో ఈ చర్చలు నిర్ణయాత్మక దశకు చేరుకున్నాయి. సాధారణ సంబంధాల పునరుద్ధరణ అవసరాన్ని రాజకీయ నాయకత్వం గుర్తించింది. "భారత్– చైనాల మధ్య స్థిరమైన శాంతియుత సంబంధాలు మన రెండు దేశాలకే గాక మొత్తం ప్రాంతానికి, ప్రపంచానికి కూడా అవసరం" అని మోడీ అన్న మాటల్లో ఈ వైఖరినే ప్రతిబింబించారు. విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యీ ని రెండు మాసాల మధ్యలో రెండు సార్లు (జులై, ఆగష్టు నెలల్లో) కలుసుకున్నారు. రష్యా లోని సెయింట్ పీటర్స్ బర్గ్‌లో 'బ్రిక్స్' సమావేశాలతో పాటు భద్రతా వ్యవహారాల సలహాదార్ల సమావేశం నేపథ్యంలో అజిత్ దోవల్ కూడా వాంగ్ యీ ని కలుసుకున్నారు. వీటి కొనసాగింపుగా డబ్ల్యు.ఎం.సి.సి రెండు సార్లు వెంట వెంట సమావేశాలు జరిపింది. చాలా సహనంతోనూ చాలా నికరంగానూ సాగించిన దౌత్య నీతి ఫలితమే ఈ ఒప్పంద మని జైశంకర్ పేర్కొనడానికి కారణమదే. రెండు దేశాల మధ్య వివాదాల పరిష్కారానికి సరైన మార్గం కూడా అదే. రష్యాలోని కజన్‌లో 'బ్రిక్స్' శిఖరాగ్రసభ నేపథ్యంలో ప్రధాని మోడీ, చైనా అధ్యక్షుడు సీ జిన్‌పింగ్‌ల ద్వైపాక్షిక సమావేశం జరగడానికి ఈ దౌత్యపరమైన ప్రయత్నాలన్నీ బాట వేశాయి.

తొలిసారి భేటీ ప్రాధాన్యత



2020 ప్రతిష్టంభన తర్వాత ఉభయ నాయకులు ద్వైపాక్షిక భేటీ జరపడం ఇదే మొదటిసారి గనక ఈ సమావేశం ప్రాధాన్యత సంతరించుకుంది. ద్వైపాక్షిక సంబంధాలను సుస్థిరపర్చుకోవడానికి, పునర్నిర్మించుకోవడానికి తగు చర్యలు తీసుకోవాలని ఇరువురు నాయకులు అంగీకారానికి వచ్చారు. భారత దేశ బూర్జువా వర్గానికి ఎదురైన ఆర్థిక సమస్యలే చైనాతో వ్యాపారం చేసుకునే సదుపాయాన్ని సరళతరం చేసేందుకోసం ఒత్తిడి తెచ్చేలా చేశాయి. వాణిజ్య మంత్రిత్వ శాఖ చెప్పే ప్రకారం ఈ ఆర్థిక సంవత్సరం ఏప్రిల్-సెప్టెంబర్ మధ్య 562.9 వందల కోట్ల డాలర్లతో చైనా ...ఇండియా దిగుమతులలో అగ్ర స్థానంలో నిలిచి వుంది. ప్రస్తుత ప్రపంచీకరణ ఆర్థికావరణంలో ఆర్థిక సహకారాన్ని పెంచుకోవడం ఉభయ దేశాలకూ లాభదాయకమని అంతకంతకూ ఎక్కువగా గుర్తించబడింది.

PEOPLE'S DEMOCRACY
THE WEEKLY PAPER OF THE COMMUNIST PARTY OF INDIA (MARXIST)

2020 ప్రతిష్టంభన తర్వాత ఉభయ నాయకులు ద్వైపాక్షిక భేటీ జరపడం ఇదే మొదటిసారి గనక ఈ సమావేశం ప్రాధాన్యత సంతరించుకుంది. ద్వైపాక్షిక సంబంధాలను సుస్థిరపర్చుకోవడానికి, పునర్నిర్మించుకో వడానికి తగు చర్యలు తీసుకోవాలని ఇరువురు నాయకులు అంగీకారానికి వచ్చారు. భారత దేశ బూర్జువా వర్గానికి ఎదురైన ఆర్థిక సమస్యలే చైనాతో వ్యాపారం చేసుకునే సదుపాయాన్ని సరళతరం చేసేందుకోసం ఒత్తిడి తెచ్చేలా చేశాయి. వాణిజ్య మంత్రిత్వ శాఖ చెప్పే ప్రకారం ఈ ఆర్థిక సంవత్సరం ఏప్రిల్–సెప్టెంబర్ మధ్య 562.9 వందల కోట్ల డాలర్లతో చైనా ఇండియా దిగుమతులలో అగ్ర స్థానంలో నిలిచి వుంది. ప్రస్తుత ప్రపంచీకరణ ఆర్థికావరణంలో ఆర్థిక సహకారాన్ని పెంచుకోవడం ఉభయ దేశాలకూ లాభదాయకమని అంతకంతకూ ఎక్కువగా గుర్తించబడింది. భారత దేశాన్ని ఒక ఉత్పత్తి కేంద్రంగా మార్చాలంటే విద్యుత్ వాహనాలు (ఇ.వి లు), స్మార్ట్ ఫోన్లు, సోలార్ ఫోన్లు, మందుల వంటి కొన్ని సరుకులు ఉత్పత్తి చేసే పరిశ్రమలను భారత ప్రభుత్వం కీలకంగా గుర్తించింది. చైనాతో ఆర్థిక సంబంధాల పునరుద్ధరణ ఈ పరిశ్రమలలో అత్యధిక వాటికి ఉపయోగంగా వుంటుంది. ఉత్పత్తి రంగంలో సంయుక్త పథకాలకు చైనా నుంచి పెట్టుబడులు రావడం పట్ల ప్రస్తుతం వున్న ప్రతికూల వైఖరి మారవలసి వుంటుంది. విద్యుత్ వాహనాల తయారీలో ప్రపంచంలోనే అగ్ర స్థానంలో వున్న అతి పెద్ద చైనా పరిశ్రమ బివైడి 2023లో ఒక భారతీయ కంపెనీలో వంద కోట్ల డాలర్ల పెట్టుబడి పెడతానంటే తిరస్కరించడం ముందుచూపు లేకుండా తీసుకున్న చర్య. విద్యుత్ వాహనాలు, బ్యాటరీల తయారీ కర్మాగారం స్థాపించి వుంటే భారత దేశం అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉత్పత్తి ప్రక్రియలనూ అందుకునేందుకు సహాయపడేది.

అంతర్జాతీయ ప్రభావం, అమెరికా పాత్ర

వేగంగా మారుతున్న భౌగోళిక రాజకీయ పరిస్థితి కూడా ఈ రెండు దేశాల మధ్య సంబంధాల సాధారణీకరణ అవసరం గుర్తించాల్సిన స్థితిని కల్పించింది. ఉక్రెయిన్ యుద్ధం, గాజా పశ్చిమాసియాలలో ఇజ్రాయిల్ దురాక్రమణ వనరుల పైన, వాణిజ్య మార్గాల పైన, దేశాల మధ్య సంబంధాల పైన తీవ్ర ప్రభావం వేశాయి. తమ వ్యవహారాలన్నీ కేవలం అమెరికాతోనే జతపర్చడం విషతుల్యమని చాలా దేశాలు కళ్లు తెరిచి గుర్తించాల్సి వచ్చింది. ఈ పూర్వ రంగంలో 'బ్రిక్స్' వంటి కూటములు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. అలాంటి బృందాలలో చేరాలనే ఆకాంక్షను అనేక దేశాలు బహిరంగంగానే వెల్లడిస్తున్నాయి. పశ్చిమాసియాలో రెండు ప్రాంతీయ అధికార కేంద్రాలుగా వున్న సౌదీ అరేబియా, ఇరాన్ ఈ మధ్యనే ఈ కూటమిలో చేరాయి. తన చుట్టూ ఇలాంటి భౌగోళిక రాజకీయ మార్పులు సంభవిస్తుంటే ఈ కూటమిలో ఇండియా వొంటిగొట్టుగా వుండజాలదు. కూటమి వ్యవస్థాపక సభ్య దేశాలైన వాటితో శత్రుపూరిత సంబంధాలు గాక సత్సంబంధాలు కలిగివుండటం సహజం.

2020 సరిహద్దు ఘర్షణల తర్వాత భారత ప్రభుత్వం అమెరికాతో తన సంబంధాలను మరింత బలోపేతం చేసుకుంది. అనేక రక్షణ ఒప్పందాలు మాత్రమే గాక భారత్–చైనా వివాద సరిహద్దు గురించి వాస్తవ సమాచారం ఎప్పటికప్పుడు పంచుకునేలా కూడా ఒప్పందాలు చేసుకుంది. హిమాలయ సరిహద్దులో సైనిక దళాల కదలికలపై నిఘా కోసం 300 కోట్ల డాలర్ల పైన వ్యయంతో 31 ఆయుధ సహిత గార్డియన్ డ్రోన్లను ఇండియా కొనుగోలు చేయడం కూడా ఆ ఒప్పందాల్లో ఒకటి. అమెరికా నాయకత్వంలోని 'క్వాడ్' కూటమితో ఆస్ట్రేలియా, జపాన్‌లతో పాటు ఇండియా కూడా సభ్యదేశంగా వుంది. ఆఫ్ఘనిస్తాన్ నుంచి అమెరికా ఉపసంహరణ, మరీ ముఖ్యంగా డోనాల్డ్ ట్రంప్ మరోసారి అధ్యక్షుడయ్యేట్టయితే దాని విధాన నిర్ణయాలలో విశ్వాస రాహిత్యం రీత్యా ప్రభుత్వం చైనాతో సంబంధాలను సాధారణ స్థితికి తెచ్చుకోవడం వివేకవంతమైన పని అని ఆర్.ఎస్.ఎస్ పత్రిక 'ఆర్గనైజర్' (2024 సెప్టెంబర్ 22) కూడా వ్యాఖ్యానించింది.


వివాద పరిష్కారం, సంబంధాల విస్తరణ

ఇండియా, చైనాలు 3400 కిలోమీటర్ల పైగా సరిహద్దును పంచుకుంటున్నాయి. ఈ సరిహద్దులో పెద్ద భాగం సరిగ్గా నిర్ణయించ బడకపోవడం, రెండు దేశాల మధ్య దీర్ఘకాలంగా వివాదం కొనసాగడానికి కారణమవుతున్నది. భారత్–చైనా సరిహద్దు వివాదాలు మొత్తాన్ని పరిష్కరించుకునే యంత్రాంగాన్ని పునరుద్ధరించుకోవడమే ఇప్పుడు జరగాల్సింది. 1993 సరిహద్దు శాంతి ప్రశాంతతల ఒప్పందం, 2013 సరిహద్దు రక్షణ సహకారంపై పెంచుకోవలసి వుంటుంది. అదే సమయంలో మోడీ ప్రభుత్వం ఆర్థిక సంబంధాల విస్తరణకు చర్యలు తీసుకోవాలి. ప్రజల మధ్య రాకపోకలు ప్రత్యేకించి ఉత్పత్తి రంగంలో మన సాంకేతిక పరిజ్ఞానాన్ని, ఉత్పత్తిని పెంచే పెట్టుబడులను రాబట్టే చర్యలను పెంచుకోవాలి.

(అక్టోబర్ 23 'పీపుల్స్ డెమోక్రసీ' సంపాదకీయం)

విశ్లేషణ


పారదర్శకత లోపించిన రాష్ట్ర పారిశ్రామిక విధానం



టిడిపి నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం 2024–2029 పారిశ్రామిక విధానాన్ని అట్టహాసంగా విడుదలచేసింది. పారిశ్రామిక విధానం విడుదల సమయంలో, పెట్టుబడిదారుల శిఖరాగ్ర సమావేశాలలో ఈ హడావిడి ప్రత్యేకంగా కనపడుతుంది. జాతీయ, అంతర్జాతీయ పెట్టుబడిదారులతో రాష్ట్రంలో నిర్వహించిన సమావేశాల్లో రాష్ట్రానికి లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులు, లక్షల ఉద్యోగాల వాగ్దానాలు వెల్లువెత్తుతాయి.

2023 వైసిపి ప్రభుత్వ హయాంలో విశాఖ పట్నంలో జరిగిన ప్రపంచ పెట్టుబడిదారుల సమావేశంలో ఇటువంటి పెట్టుబడులు, ఉద్యోగాల వరద వచ్చింది. 25 దేశాల నుండి 30 బడా కార్పొరేట్లు హాజరైన ఈ సమావేశంలో రూ.12 లక్షల కోట్ల పెట్టుబడులు పెట్టడానికి 6 లక్షల ఉద్యోగాలు ఇవ్వడానికి కట్టుబడి వుంటామన్నారు. ఇదే విశాఖ నగరంలో మొదటి టిడిపి ప్రభుత్వం ఉన్న సమయంలో కూడా ఇదే తరహా సమావేశాలు జరిగాయి. లక్షల కోట్ల పెట్టుబడులు, మరికొన్ని లక్షల ఉద్యోగాల హామీలు షరామామూలే.

వీటన్నింటికీ మించి 2024–2029 సంవత్సరాలకు టిడిపి కూటమి విడుదల చేసిన పారిశ్రామిక విధానం, అందులోని పెట్టుబడులు, ఉద్యోగాలు అగ్రభాగాన ఉంటాయి. ఒకే విధానాన్ని 6 భాగాలుగా విభజించటం, ఒక్కో భాగానికి ఒక్కో పేరు పెట్టడంలో నైపుణ్యత కనపడుతుంది.



పి.అజయ కుమార్

పెట్టుబడిదారుల సమావేశాలు, పారిశ్రామిక విధానాల విడుదల సమయంలో రేకెత్తించిన ఉత్సుకత కొద్ది సమయంలోనే చప్పబడిపోతుంది. వాస్తవాలు తెలుసుకునే ప్రయత్నం చేసిన వారికి 2024–29 పారిశ్రామిక విధానం కల్పించిన ఉత్సాహం ఏమాత్రం నిలవదని తేలికగానే అర్థమవుతుంది. 2024–2029 పారిశ్రామిక విధానంలో భాగంగా విడుదల చేసిన 6 విధానాలు పూర్తి మార్పులు తెస్తాయని ప్రభుత్వం ప్రకటించింది. ఒకే వస్తువును 6 భాగాలుగా విడగొడితే పూర్తి మార్పులు ఎలా వస్తాయో విధానాన్ని ప్రకటించిన ప్రత్యేక నిపుణులే చెప్పాలి. పారిశ్రామికాభివృద్ధి, సూక్ష్మ–చిన్న–మధ్య తరహా పరిశ్రమల యాజమానుల అభివృద్ధి విధానం, ఆహార శుద్ధి, ఎలక్ట్రానిక్స్, ప్రైవేటు పార్కుల విధానం, సమీకృత ఇంధన శుద్ధి విధానాలు ఆరూ కూడా పరిశ్రమలలో ఉండే అంశాలే కదా?

ఆరు భాగాలుగా విడగొట్టడంలో లేని బలాన్ని ప్రదర్శించాలనే వ్యూహం కనబడుతోంది. ఈ వ్యూహం పెద్ద గందరగోళానికి దారితీస్తుంది. 20 లక్షల ఉద్యోగాలయితే అక్షరాల్లో స్పష్టంగా కనబడుతున్నాయి. తయారీ రంగంలో 5 లక్షలు, ఇంధన రంగంలో 7.5 లక్షలు, ఆహార శుద్ధి రంగంలో 3 లక్షలు, ఎలక్ట్రానిక్స్ రంగంలో 5 లక్షలు వెరసి 20 లక్షల ఉద్యోగాలు అక్షరాల్లో కనపడుతున్నాయి. అవి వస్తాయా, రావా అనేది 5 సంవత్సరాల తరువాత మాత్రమే తేలుతుంది. 5 సంవత్సరాలలో పెట్టుబడుల అంచనా రూ. 16 లక్షల కోట్లుగా కనపడుతుంది.

పారిశ్రామిక విధానంలో నిజాయితీ, పరిపూర్ణత, చిత్తశుద్ధి లోపిస్తుంది. ఏదైనా ఒక విధానం ప్రకటించినప్పుడు ఇప్పటి వరకూ ఏమి సాధించాం, ఏమి సాధించలేకపోయామనే సమీక్షను పారిశ్రామిక విధానంలో భాగం చేయకపోవడం దీనికి కారణం. గతాన్ని సమీక్షించి భవిష్యత్తుకు ప్రణాళిక వేస్తే అది సమగ్ర విధానమవుతుంది.

ప్రతి సంవత్సరం రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించే సామాజిక, ఆర్థిక సర్వేలో పరిశ్రమలు ఒక భాగం. ఉత్పత్తి ప్రక్రియ జరిగే ఆవరణలో పది లేదా అంతకంటే ఎక్కువ మంది కార్మికులు పని చేస్తే ఆ ఆవరణ ఫ్యాక్టరీ నిర్వచనం కిందకి వస్తుంది. విద్యుత్ సహాయంతో, విద్యుత్ సహాయం లేకుండా పనిచేసేవి ఫ్యాక్టరీలు. ఫ్యాక్టరీలు అన్నా అవే. పరిశ్రమలు అన్నా కూడా అవే. తయారీ, ఆహార శుద్ధి, ఎలక్ట్రానిక్స్, ఇంధనం, సూక్ష్మ–చిన్న–మధ్య తరహా పరిశ్రమలు అన్నీ ఈ నిర్వచనం కిందకే వస్తాయి. పది లోపు కార్మికులు పనిచేసేవి ఈ లెక్కలోకి రావు.

ఇటువంటి పరిశ్రమలలో 2019–20 ఆర్థిక సంవత్సరం నాటికి రాష్ట్రం మొత్తంలో వచ్చిన స్థిర పెట్టుబడి, రోజువారీ వ్యాపార లావాదేవీలలో ఉపయోగించే వర్కింగ్ క్యాపిటల్ అంతా కలిపి రూ.2 లక్షల 20 వేల కోట్లు. స్థిరపెట్టుబడి అంటే బిల్డింగులు, యంత్రాలు తదితరాలలో పెట్టే పెట్టుబడి. ఫ్యాక్టరీ రోజువారీ నడవటానికి ఉపయోగించే ముడి పదార్థాలు, సహాయక పదార్థాలు, వేతనాలు, ఇతరాలలో పెట్టేవి వర్కింగ్ క్యాపిటల్. అంటే రొటేషన్‌లో పెట్టే పెట్టుబడులు.

ఇదే ఆర్థిక సంవత్సరం చివరి నాటికి రాష్ట్రంలో నడిచే ఫ్యాక్టరీలలో పని చేసే కార్మికులు, పరిపాలక విభాగాలలో పనిచేసే ఉద్యోగులు అంతా కలిసి 6 లక్షల 81 వేల మంది. ఆ తరువాత నాలుగు సంవత్సరాల్లో ఆసాంతం ఒకేసారి

పారిశ్రామిక విధానం పాక్షికతతో కూడుకుని వుంది. ఇది పెట్టుబడులు పెట్టేవారి ప్రయోజనాలు పరిరక్షిస్తుంది తప్ప వాటిలో పని చేసే కార్మికుల ఊసు ఈ విధానంలో లేదు. కార్మికుల పని గంటలు, వేతనాలు, ఇతర పని పరిస్థితుల కల్పనకు పారిశ్రామిక విధానం ఎటువంటి గ్యారంటీ ఇవ్వలేదు. ప్రత్యేకంగా నాణ్యతతో కూడిన ఉపాధి కల్పనకు ప్రభుత్వం ఈ విధానంలో ఎటువంటి చర్యలు తీసుకోలేదు.

ఈ రోజు వరకు ప్రభుత్వ, ప్రైవేటు భూములలో పరిశ్రమలకు కేటాయించింది ఎన్ని ఎకరాలు? వాటిలో ఎన్ని పరిశ్రమలు వచ్చాయి? ఇంకా సంవత్సరాల తరబడి పడావుగా ఎన్ని పడి ఉన్నాయి? వంటి అంశాల పైన కూడా 2024-29 పారిశ్రామిక విధానం మౌనంగా ఉంది.

పెట్టుబడులు, ఉపాధి పెద్దఎత్తున పెరిగే అవకాశం లేదు.

ఇక్కడ ప్రభుత్వానికి ఒక అవకాశం ఉంది. పది లోపు కార్మికులు పని చేసే కుటీర, చిన్న పరిశ్రమలు ఈ లెక్కలోకి రావు కాబట్టి ఉపాధి ఎక్కువ స్థాయిలో ఉండేది ఇక్కడేనని ప్రభుత్వం వాదించవచ్చు. ఇక్కడ ఉండే పెట్టుబడులు చాలా స్వల్పం. ఉదాహరణకు సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల్లో 2024–2029 కాలంలో ప్రభుత్వ లక్ష్యం రూ.50 వేల కోట్లు మాత్రమే. ఉపాధి అంచనా 5 లక్షలు. ఇవి కూడా అన్నీ 10 లోపు కార్మికులు ఉన్న పరిశ్రమలలోకి రావు. 10 ఆ పైన కార్మికులు ఉండే పరిశ్రమలు కూడా ఉంటాయి.

మిగతా రూ.15 లక్షల కోట్ల పెట్టుబడులు, 15 లక్షల ఉద్యోగాలు భారీ, అతి భారీ పరిశ్రమల నుండి రావాలి. అలా వచ్చినట్లయితే 2019–20 నాటికి రాష్ట్రంలో వచ్చిన మొత్తం పెట్టుబడులు రూ. 2 లక్షల 20 వేల కోట్లు, మొత్తం ఉద్యోగాలు 7 లక్షలు మాత్రమే ఎందుకు ఉన్నాయి? విశాఖపట్నంలో జరిగిన జాతాల్లో, అంతర్జాతీయ బడా పెట్టుబడిదారుల సమావేశాల్లో వచ్చిన పెట్టుబడులు ఎక్కడికి పోయాయి? వీటి మీద సమీక్ష లేకుండా ఒక ఊహాజనిత వాతావరణాన్ని సృష్టించడం బాధ్యతాయుతమైన ప్రభుత్వం చేయవలసిన పని కాదు.

పరిశ్రమలకు భూముల కేటాయింపు మీద కూడా పారిశ్రామిక విధానంలో సమీక్ష లేదు. ఇప్పటికే రైతుల నుండి సేకరించిన భూములలో పరిశ్రమలు రాలేదు. అన్ని ప్రత్యేక ఆర్థిక మండలాల్లో కూడా ఇదే పరిస్థితి. పెట్టుబడిదారులకు కేటాయించిన భూములలో పరిశ్రమలు స్థాపించకుండా వాటిని బ్యాంకుల్లో తాకట్టు పెట్టి రుణాలు తెచ్చుకొని వాడుకున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ ఆరోపణలకు పారిశ్రామిక విధానంలో సమాధానం లేదు.

ఈ రోజు వరకు ప్రభుత్వ, ప్రైవేటు భూములలో పరిశ్రమలకు కేటాయించింది ఎన్ని ఎకరాలు? వాటిలో ఎన్ని పరిశ్రమలు వచ్చాయి? ఇంకా సంవత్సరాల తరబడి పడావుగా ఎన్ని పడి ఉన్నాయి? వంటి అంశాల పైన కూడా 2024–29 పారిశ్రామిక విధానం మౌనంగా ఉంది.

ఇటువంటి సమీక్ష ఏమీ లేకుండా కొత్తగా మరో లక్షా 32 వేల ఎకరాలను అందుబాటులో ఉంచుతామని పారిశ్రామిక విధానం చెబుతోంది. మోడీ ప్రభుత్వ విధానాలకు అనుగుణంగా మొదటిసారి రాష్ట్రంలో ఉన్న 175 నియోజక వర్గాల్లోనూ ప్రైవేటు రంగంలో పారిశ్రామిక పార్కులను ఏర్పాటు చేస్తారు. ప్రభుత్వ ఆధ్వర్యంలో భూముల సేకరణ, కేటాయింపులు, వాటి వినియోగం పారదర్శకంగా లేనప్పుడు కొత్తగా ప్రైవేటు పారిశ్రామిక పార్కులు ఏర్పడటం రియల్ ఎస్టేట్ వ్యాపారానికి రైతుల భూములను వాడుకునే అవకాశం ఎక్కువగా ఉంది.

పారిశ్రామిక విధానం పాక్షికతతో కూడుకుని వుంది. ఇది పెట్టుబడులు పెట్టేవారి ప్రయోజనాలు పరిరక్షిస్తుంది తప్ప వాటిలో పని చేసే కార్మికుల ఊసు ఈ విధానంలో లేదు. కార్మికుల పని గంటలు, వేతనాలు, ఇతర పని పరిస్థితుల కల్పనకు పారిశ్రామిక విధానం ఎటువంటి గ్యారంటీ ఇవ్వలేదు. ప్రత్యేకంగా నాణ్యతతో కూడిన ఉపాధి కల్పనకు ప్రభుత్వం ఈ విధానంలో ఎటువంటి చర్యలు తీసుకోలేదు.

పరిశ్రమల్లో పర్మినెంట్ కార్మికులు తగ్గిపోయి కాంట్రాక్టు, డెయిలీ వేజ్, క్యాజువల్, వలస కార్మికుల సంఖ్య అత్యధికంగా పెరిగింది. అతి తక్కువ వేతనాలతో, ఎక్కువ గంటలు పనిచేస్తున్నారు. దోపిడీ పెరిగింది. నైపుణ్య కార్మికులకు కూడా అన్‌స్కిల్డ్ కార్మికుల వేతనాలను ఇస్తున్నారు. అదానీ వంటి సంఘటిత పరిశ్రమల్లోనూ ఈ పరిస్థితిని ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. లేబర్ అధికారులు తనిఖీలకు పోకుండా చేతులు కట్టేసింది.

పెట్టుబడిదారులు తమ వ్యాపారాన్ని వేగవంతంగా చేసుకునేందుకు ఈ పారిశ్రామిక విధానం తోడ్పడుతుంది. వారి స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌కు ప్రభుత్వం తోడ్పాటు అందిస్తుంది. వారి ఉత్పత్తి వ్యయాన్ని తగ్గిస్తుంది. ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించటం అంటే దానిలో ప్రధాన భాగం తక్కువ కార్మికులతో తక్కువ వేతనాలతో ఎక్కువ పని చేయించుకోవడం ఉంటుంది. అందుకనే పారిశ్రామిక విధానంపై కార్మిక సంఘాలతో చర్చించాలనే డిమాండ్ వస్తోంది.

ఈ రైతు, కార్మిక వ్యతిరేక పారిశ్రామిక విధానంపై కార్మిక సంఘాలు, రైతు సంఘాలు, ఉమ్మడిగా పోరాడాల్సిన అవసరం ఉంది. పారిశ్రామిక దోపిడీ నుండి రైతులను, కార్మికులను కాపాడాలి.

/ వ్యాసకర్త సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు /

జనవాక్యం

పరిశుభ్రత పాటించాల్సిన తరుణం

రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పుడు ఎక్కడ చూసినా డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్, డయేరియా లాంటి వ్యాధులు పట్టి పీడిస్తున్నాయి. ముఖ్యంగా, గిరిజన, ఏజెన్సీ ప్రాంతాల ప్రజలకు, మురికి వాడల్లో నివసించే వారికి, పరిశుభ్రతను ఏ మాత్రం పాటించని వారికి ఈ వ్యాధులు ప్రబలే అవకాశాలు ఎక్కువ. ఇలాంటి పరిస్థితుల్లో నగర, గ్రామ పంచాయితీ సిబ్బంది పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించి క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమాలు పెద్ద ఎత్తున చేపట్టాలి. అదేమాదిరి ప్రతి ఒక్కరూ దోమ తెరలను తప్పనిసరిగా వాడాలి. ప్రస్తుత పరిస్థితుల్లో అలాంటి ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవడం తప్పనిసరి. అంతేకాదు ముఖ్యంగా వర్షాకాలంలో ఇంటి పరిసరాల్లో తీసేసిన, పనికిరాని టైర్లు, ఇతరత్రా తుప్పు పట్టిన వస్తువులు ఉంటే అందులో మురికినీరు, దోమలు చేరిపోవడానికి, రోగాలు రావడానికి అవకాశాలు ఎక్కువ. కాబట్టి ఇంటి పరిసరాలను ఎల్లవేళలా శుభ్రంగా ఉంచుకోవాలి. అప్పుడు హాస్పిటళ్ల చుట్టూ తిరుగుతూ జేబులకు చిల్లు పెట్టుకోనవసరం లేదు.

- ధీరజ్ రెడ్డి, నంద్యాల జిల్లా.

మూఢ నమ్మకాల నియంత్రణ చట్టం

ఇటీవల ఛత్తీస్‌గఢ్‌లో చేతబడి చేస్తున్నారనే నెపంతో తొమ్మిది మంది అమాయక గిరిజనులను పొట్టన పెట్టుకున్నారు. అదే విధంగా ఉత్తరప్రదేశ్‌లోని ఒక స్కూల్ విద్యార్థిని నరబలి ఇచ్చారు. టైమ్ మిషన్ ద్వారా వృద్ధులను యువకులుగా మారుస్తామని చెప్పి మోసం చేశారు. ఈ ఘటనపై యు.పి పోలీసులకు ఫిర్యాదు అందింది. వారు వెంటనే దర్యాప్తును ప్రారంభించారు. వృద్ధుల నుంచి మొత్తం రూ.35 కోట్లు దోచుకున్నారని, ఇప్పటి వరకు 25 కేసులు నమోదయ్యాయని, మరింత మంది బాధితులు ముందుకు వచ్చే అవకాశం ఉందని పోలీసులు చెబుతున్నారు. ఇంకా జార్ఖండ్, తెలంగాణ వంటి పలు ప్రాంతాల్లో ఎంతోమంది అమాయకులు తమ సమస్యల పరిష్కారానికి మూఢ నమ్మకాలతో బాబాలను, స్వామీజీలను ఆశ్రయించి మోసపోతున్నారు. మరోవైపు సైబర్ నేరగాళ్ళు కూడా సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి భక్తుల విశ్వాసాలను క్యాష్ చేసుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఒకవైపు శాస్త్రవేత్తలు, మేధావులు సైన్సు ద్వారా నాగరిక సమాజ నిర్మాణానికి కృషి చేస్తూ వుంటే, కొందరు తాంత్రిక, క్షుద్ర పూజలతో సమాజ తిరోగమనానికి పాల్పడుతున్నారు. ఇలాంటి దుర్మార్గమైన, హేయమైన చర్యలకు ముగింపు పలకడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూను కోవాలి. ప్రజలలో శాస్త్రీయ ఆలోచనలు పెంచడంతో పాటు కర్ణాటక, మహారాష్ట్ర తరహా "మూఢ నమ్మకాల నిర్మూలన చట్టం" వెంటనే తీసుకు రావాలి.

- యం.రాంప్రదీప్, తిరువూరు.

చిదిమేస్తున్న చీప్ లిక్కర్

రాష్ట్రంలో చీప్ లిక్కర్ షాపుల యజమానులకు లక్షల్లో ఆదాయం వస్తుంటే, మందుకు బానిసలైన యువత జీవితాలు నాశనమవుతున్నాయి. వీరు ఉదయం నుంచే షాపుల దగ్గర బారులు తీరి ఉండటాన్ని చూస్తే గుండె బాధతో బరువెక్కి పోతున్నది. యువత ఒక్కసారి ఈ చీప్ లిక్కర్‌కు పొరపాటున బానిసలు అయ్యారో ఇక వారి జీవితాలు కుక్కలు చింపిన విస్తరే. దీని పుణ్యమా అని వీరికి అటు బయటి సమాజంతో, ఇటు తమ కుటుంబ సభ్యులతో నిత్యం చివాట్లు, అవహేళనలు తప్పవు. పీకల దాకా సేవించి ఇటు కుటుంబ సభ్యులతో వాగ్వాదానికి దిగడం, అటు తమ ప్రాంత వాసులతో కూడా చీటికిమాటికీ అరుపులు, కేకలతో గొడవలకు దిగుతూ వారికి కంటి మీద కునుకు లేకుండా చేయడం ఈ నిత్యకృత్యమైన వ్యవహారం. వీరు ఆర్థికంగా నష్టపోవడం, సమాజంలో తమ కుటుంబ సభ్యుల పరువు ప్రతిష్టలను బజారుకు ఈడ్చడం జరిగిపోతూ ఉంటుంది. ఈ వ్యసనం నుంచి బయట పడవేయడానికి వారిని డీ–అడిక్షన్ సెంటర్ల చుట్టూ తిప్పుతూ వేలాది రూపాయల ఫీజులు సమర్పించుకుంటూ కుటుంబ సభ్యులు నానా యాతన పడుతూ వుంటారు. ఈ చీప్ లిక్కర్ వ్యసనం ఓ సామాజిక సమస్యగా మారిందనడంలో సందేహం లేదు.

- బుగ్గన మధుసూదనరెడ్డి, బేతంచెర్ల.

మీ వ్యాసాలను పంపాల్సిన మెయిల్:
editpageps @ gmail.com

పులిచెర్లలో గజరాజుల స్వైర విహారం

ప్రజాశక్తి-సోమల (చిత్తూరు)

చిత్తూరు జిల్లా పులిచెర్ల మండలంలో 17 ఏనుగుల గుంపు స్వైర విహారం చేస్తోంది. శుక్రవారం ఉదయం కొంగరవారిపల్లి, తుడుంవారిపల్లి, గుట్టకింద హరిజనవాడ పరిసరాల్లోని వ్యవసాయ పొలాల్లో సంచరించాయి. పంట పొలాలను ధ్వంసం చేశాయి. ఏనుగులు గ్రామాల్లో సంచరిస్తుండడంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. అప్రమత్తమైన అటవీ అధికారులు వాటిని అడవిలోకి మళ్లించారు. దీంతో ప్రజలు ఊపిరిపీల్చుకున్నారు. రాత్రిల్లో, పగటిపూట రైతులు అప్రమత్తంగా ఉండాలని అటవీ అధికారులు సూచించారు.



ఢిల్లీ జల్‌బోర్డు వద్ద ఉద్యోగుల ఆందోళన

న్యూఢిల్లీ : ఢిల్లీ జల్ బోర్డు ప్రధాన కార్యాలయం వరుణాలయ భవన్ వద్ద శుక్రవారం ఉద్యోగులు, కార్మికులు పెద్దఎత్తున ప్రదర్శన నిర్వహించారు. వారికి సిఐటియు ప్రధాన కార్యదర్శి తపన్‌సేన్ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ న్యాయం జరిగే వరకూ ఉద్యమాన్ని కొనసాగించాలని పిలుపునిచ్చారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వారి డిమాండ్లను పరిష్కరిం చేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

మద్యం షాపు వద్దే వద్దు

- మహిళల ఆందోళన

ప్రజాశక్తి - యంత్రాంగం

తిరుపతి, కాకినాడ జిల్లాల్లోని పలు ప్రాంతాల్లో మద్యం షాపుల ఏర్పాటును మహిళలు శుక్రవారం అడ్డుకున్నారు. జనవాసాల మధ్య మద్యం షాపుల ఏర్పాటును విరమించుకోవాలని డిమాండ్ చేశారు. తిరుపతి రైల్వేస్టేషన్ సమీపంలోని కస్తూరిబా వీధిలో మద్యం దుకాణాన్ని ప్రారంభించేందుకు నిర్వాహకులు పూనుకున్నారు. విషయం తెలుసుకున్న మహిళలు పెద్దఎత్తున అక్కడకు చేరుకుని నిరసనకు దిగారు. ఇళ్ల మధ్య మద్యం షాపును ఏర్పాటు చేయొద్దని నినాదాలు గతంలోనూ ఇక్కడ షాపు ఏర్పాటు చేస్తుంటే అధికారులకు విన్నవించి తొలగించేలా చేశామని గుర్తు చేశారు. మరోసారి ఇక్కడ షాపు ఏర్పాటు చేయాలనుకోవడం సరికాదన్నారు. అధికారులు స్పందించి షాపును తరలించే వరకూ నిరసన కొనసాగిస్తామని స్పష్టం చేశారు. పోలీసులు పెద్ద ఎత్తున అక్కడకు చేరుకుని సర్ధిచెప్పారు. సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళతామని హామీ ఇవ్వడంతో మహిళలు ఆందోళన విరమించారు. కాకినాడ జిల్లా ఏలేశ్వరంలో మద్యపాన వ్యతిరేక ప్రసార కమిటీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. గండేపల్లి మండలం నీలాద్రిరావుపేటలో ఇళ్లు, చర్చి, సచివాలయం, హెల్త్ సెంటర్ దగ్గర్లో మద్యం షాపు ఏర్పాటు చేయడం తగదన్నారు. ధర్నా అనంతరం స్థానిక ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేశారు.

రెండు వేల మెట్రిక్ టన్నుల కాఫీ కొనుగోలు లక్ష్యం

- అరబికా పార్చిమెంటు కాఫీ కిలో ధర రూ.285
- చెర్రీ రూ.150, రొబస్టా రూ.80, కాఫీ పండ్లు రూ.44
- ఐటిడిఎ పిఒ అభిషేక్

ప్రజాశక్తి -పాడేరు

2024-25 ఆర్థిక సంవత్సరంలో చింతపల్లి మార్క్స్ సంస్థ ద్వారా 2000 వేల టన్నుల కాఫీ పండ్లను కొనుగోలు చేయడానికి లక్ష్యగా నిర్దేశించామని ఐటిడిఏ పి.ఓ. వి.అభిషేక్ స్పష్టం చేసారు. ప్రతీ మండలానికి నిర్దేశించిన మేరకు కాఫీ పళ్లను సేకరించాలని కాఫీ సిబ్బందికి దిశా నిర్దేం చేసారు. శుక్రవారం ఐటిడిఏ సమావేశ మందిరంలో కాఫీ అధికారులు, జిసిసి అధికారులు, కాఫీ లైజాన్ వర్కర్లతో కాఫీ సేకరణపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఐటిడిఏ పరిధిలో కాఫీని మరింత అభివృద్ధి చేయడానికి రాష్ట్రముఖ్య మత్రి అండగా ఉంటామని చెప్పారన్నారు. పూర్తిగా పండిన కాఫీ పళ్లును మాత్రమే రైతులు సేకరించే విధంగా అవగాహన కల్పించాలని సూచించారు. బాగా పండిన కాఫీ పళ్లును మాత్రమే స్వీకరిస్తామని, నాణ్యతలు లోపిస్తే తిరిగి వెనక్కి పంపిస్తామన్నారు. మార్క్స్ సంస్థ రైతుల సంక్షేమానికి పని చేస్తోందన్నారు. సంస్థకు నష్టం వాటిల్లితే ఉపేక్షించనని చెప్పారు. నూరు శాతం లక్ష్యాలను సాధించిన సిబ్బందికి ప్రోత్సాహకాలను అందిస్తామన్నారు. 85 శాతానికి తక్కువగా కాఫీ పళ్లను సేకరించిన సిబ్బంది నుండి రికవరీ చేస్తామన్నారు. జిసిసి ద్వారా అరబికా పార్చిమెంట్ కాఫీని రూ.285 లకు, అరబికా చెర్రీ రూ.150లు, రొబస్టాను రూ.80 కొనుగోలు చేస్తారన్నారు. ఐటిడి ఏ నుండి కాఫీ పళ్లు రూ.44 లకు కొనుగోలు చేస్తామన్నారు. అనంతరం రైతులకు బోనస్ చెల్లిస్తామని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం జి.మాడుగుల, జి.కె వీధి పల్పింగ్ యూనిట్ల నిర్మాణానికి రూ.7 కోట్లు నిధులు మంజూరు చేయడానికి సూత్ర ప్రాయంగా అంగీకరిం చిందన్నారు. అంచెలంచెలగా ప్రతీ మండలంలో ఒక యూనిట్ నెలకొల్పడానిక జిసిసి ప్రణాళికలు తయారు చేస్తోందన్నారు.

అనంతగిరిలో 50 టన్నుల కాఫీ పళ్లు, అరకువేలీ 120, డుంబ్రిగుడ 120, హుకుంపేట 120, పెదబయలు 120, ముంచంగిపుట్టు 100, పాడేరు 250, జి.మాడుగుల 350, చింతపల్లి 400, 2.5. 5 250 టన్నులు,కొయ్యూరు మండలానికి 40 టన్నులు కాఫీ పళు సేకరణ లక్ష్యంగా నిర్దేశించామని చెప్పారు. నిర్దేశించిన లక్ష్యాలు సాధించాలని ఆదేశించారు. కాఫీ పళు సరఫరా, సేకరణలో సమస్యలుంటే కాల్ సెంటర్కు సమాచారం అందించాలని చెప్పారు. ఐటిడిఏ కాల్ సెంటర్ 08935250833, జిసిసి కాల్ సెంటర్ నెంబరు 7013070990 ఫోన్ నంబర్లకు ఫోన్ చేసి సమాచారం అందించాలని సూచించారు. ఈ సమావేశంలో ఐటిడి ఏ సహాయ ప్రాజెక్టు అధికారి ఎం.వేంకటేశ్వరరావు, కాఫీ బోర్డు ఉప సంచాలకులు సామల రమేష్, ఐటిడిఏ కాఫీ సహాయ సంచాలకులు ఎన్.అశోక్, జిసిసి డి.ఎంలు సింహచలం, దేవరాజ్, కాఫీ విస్తరణాధికారులు అప్పలనాయుడు, శ్రీరామ్మూర్తి, జిసిసి మేనేజర్లు, హర్టీ కల్చర్ కన్సల్టెంట్లు, పీల్డు కన్సల్టెంట్లు, లైజాన్ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

ఆ యాత్రికులకు కాలినడక మంచిదికాదు

ప్రజాశక్తి - తిరుమల

ఇటీవలి కాలంలో తిరుమలకు కాలి నడకన వస్తున్న సందర్భకుల్లో గుండె సంబంధిత కేసులు ఎక్కువగా నమోదు అవుతున్నాయి. శ్రీవారి దర్శనానికి వచ్చే యాత్రికుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని టిటిడి శుక్రవారం పలు సూచనలు చేసింది. 60 ఏళ్ల దాటిన వృద్ధులు, మధుమేహం, అధిక రక్తపోటు, ఉబ్బసం, మూర్ఛ, కీళ్ల వ్యాధులు ఉన్న యాత్రికులు తిరుమలకు కాలినడకన రావడం మంచిది కాదని తెలిపింది. ఊబకాయంతో బాధపడుతున్న భక్తులు, గుండె సంబంధిత వ్యాధులు ఉన్నవారు తిరుమల కొండకు నడక దారిన రావడం శ్రేయస్కరం కాదని పేర్కొంది. తిరుమల కొండ సముద్ర మట్టానికి చాలా ఎత్తులో ఉండటం కారణంగా ఆక్సిజన్ స్థాయి తక్కువగా ఉంటుందని, కాలినడకన రావడం చాలా ఒత్తిడితో కూడుకున్న విషయం కాబట్టి గుండె సంబంధిత వ్యాధులు, ఉబ్బస వ్యాధిని తీవ్రతరం చేసే అవకాశం ఉందని, కాబట్టి భక్తులు తదనగుణంగా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించింది. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారు వారి రోజువారి మందులు వెంట తెచ్చుకోవడం ద్వారా సమస్యలను నివారించవచ్చని తెలిపింది. కాలినడకన వచ్చే వారికి ఏమైనా సమస్యలు ఎదురైతే అలిపిరి కాలిబాట మార్గంలోని 1500 మెట్టు, గాలి గోపురం, భాష్యకార్ల సన్నిధి వద్ద వైద్య సహాయం పొందవచ్చని పేర్కొంది. తిరుమలలోని ఆశ్వినీ ఆస్పత్రి, ఇతర వైద్యశాలల్లో 24ఐ7 వైద్య సదుపాయం పొందవచ్చని తెలిపింది. దీర్ఘకాలిక కిడ్నీ వ్యాధిగ్రస్తులకు అత్యవసర పరిస్థితుల్లో తిరుపతిలోని స్విమ్స్ ఆసుపత్రిలో డయాలసిస్ సౌకర్యం అందుబాటులో ఉందని పేర్కొంది. తిరుమలకు కాలినడకన రాదలచిన భక్తులు పై సూచనలను తప్పనిసరిగా పాటించి సహకరించాలని టిటిడి విజ్ఞప్తి చేసింది.

వైద్యరంగంలో ఆధునిక సాంకేతికత అత్యవసరం

- రాష్ట్రపతి ద్రౌపదిముర్ము

రాయ్‌పూర్ : దేశంలోని మారుమూల ప్రాంతాల్లో నివసించే ప్రజల సంక్షేమం కోసం వైద్యరంగంలో ఆధునిక సాంకేతికత అత్యవసరమని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పేర్కొన్నారు. రాష్ట్రంలోని నాలుగు ఉన్నత విద్యా సంస్థల స్నాతకోత్సవాల్లో పాల్గొనేందుకు రెండు రోజుల పర్యటన నిమిత్తం ఆమె చత్తీస్‌గఢ్ చేరుకున్నారు. రాయ్‌పూర్‌లోని ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఎయిమ్స్)లో శుక్రవారం నిర్వహించిన రెండవ స్నాతకోత్సవంలో ముర్ము మాట్లాడారు. ప్రజల జీవితాలను రక్షించడంతో ముడిపడి ఉన్నందున వైద్య నిపుణులు తీసుకునే నిర్ణయాలు ఎంతో ప్రాధాన్యతను సంతరించుకున్నాయని అన్నారు. 2047 నాటి వికసిత్ భారత్ కలను సాకారం చేయడంలో వైద్య నిపుణులు నిర్ణయాత్మకమైన పాత్ర పోషిస్తారని అన్నారు. ఆధునిక సాంకేతికత మానవుని జీవితాన్ని వేగంగా ప్రభావితం చేసే యుగంలో మనం ఉన్నామని, మారుమూల ప్రజల సంక్షేమం కోసం ఈ సాంకేతికతను వినియోగించాలని చెప్పారు. గత పదేళ్లలో మెడికల్ కాలేజీలు, ఎయిమ్స్‌లో ఎంబిబిఎస్, పిజి సీట్లు పెరిగాయని తెలిపారు.

దాడులకు తక్షణమే ముగింపు పలకాలి

- ఎన్‌సిపి అధ్యక్షుడు ఫరూక్ అబ్దుల్లా

శ్రీనగర్ : జమ్ముకాశ్మీర్‌లో ఉగ్రదాడులకు తక్షణమే ముగింపు పలకాలని నేషనల్ కాన్ఫరెన్స్ అధ్యక్షుడు ఫరూక్ అబ్దుల్లా పాకిస్తాన్‌ను హెచ్చరించారు. జమ్ముకాశ్మీర్‌లో ఉగ్రదాడులపై ఆయన శుక్రవారం మీడియాతో మాట్లాడారు. పాకిస్తాన్ వల్లే సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని అన్నారు. ముందుగా ఆ దేశం ఎదుర్కొంటున్న సమస్యలపై దృష్టి పెట్టాలని, మిత్రదేశంగా ఉండేందుకు ఓ మార్గం చూడాలని, లేకుంటే సమస్యలు తప్పవని పేర్కొన్నారు. తగిన పరిష్కారం కనుగొనే వరకు ఉగ్రదాడులు కొనసాగుతూనే ఉంటాయని, దాడులకు మూలం అందరికీ తెలుసునని చెప్పారు. 30 ఏళ్లగా అమాయకులైన పౌరుల హత్యలను తాను చూశానని అన్నారు. దాడులకు తెగబడిన వారు తమ భవిష్యత్తును తామే నాశనం చేసుకుంటున్నారని, చాలామంది మరణించారని చెప్పారు. దీనికి బాధ్యులు ఎవరో తమకు తెలుసునని, కాశ్మీర్‌ను పాక్‌లో విలీనం చేయడానికి ఈ దాడులు సహకరిస్తాయని తప్పుగా భావిస్తున్నారని అన్నారు.

పట్ట భద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటర్ల నమోదుపై దృష్టి పెట్టండి

- టిడిపి ఎంపి, ఎంఎల్‌ఎలకు బాబు సూచన

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఉమ్మడి గోదావరి, కృష్ణ, గుంటూరు జిల్లాలకు త్వరలో జరుగనున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఓటర్ల నమోదుకు సెప్టెంబరు 6వరకు సమయం ఉందని, అలోగా ఓటర్ల నమోదు ప్రక్రియపై దృష్టి పెట్టాలని టిడిపి ఎంపి, ఎంఎల్‌ఎలకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సూచించారు. ఉండవల్లిలోని ఆయన నివాసం నుంచి నిర్వహించిన టెలికాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడుతూ జనసేన, బిజెపితో సమన్వయం చేసుకోవాలని చెప్పారు. నామినేటెడ్ పోస్టుల భర్తీపై కూడా వారితో బాబు చర్చించారు. త్వరలోనే పోస్టులను భర్తీ చేయనున్నట్లు ఆయన వెల్లడించారు. ఉభయ గోదావరి ఎమ్మెల్సీ అభ్యర్థిగా పేరాబత్తుల రాజశేఖర్, గుంటూరు, కృష్ణ ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఆలపాటి రాజును ఎన్‌డిఎ అభ్యర్థులుగా ఇప్పటికే ప్రకటించినట్లు చెప్పారు. ప్రతి నియోజకవర్గంలో మూడు పార్టీల నేతలతో కో-ఆర్డినేషన్ మీటింగ్‌లు ఏర్పాటు చేసుకోవాలని, ప్రభుత్వం చేసిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని సూచించారు. ప్రతి ఒక్కరూ క్షేత్ర స్థాయిలో ఉండి ఓట్ల నమోదు చేయించాలని ఎంపి, ఎమ్మెల్యేలను సిఎం ఆదేశించారు.

నేటి నుంచి టిడిపి సభ్యత్వ నమోదు : పల్లా

తెలుగు దేశంపార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం ఈనెల 26న పార్టీ జాతీయ అధ్యక్షులు చంద్రబాబునాయుడు మంగళగిరి పార్టీ కార్యాలయంలో ప్రారంభిస్తారని రాష్ట్ర పార్టీ అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రూ.లక్ష కట్టిన వారికి టిడిపి శాశ్వతసభ్యత్వం అందించనున్నారని తెలిపారు.



విజయవాడ పశ్చిమ తహశీల్దారు కార్యాలయం వద్ద సిపిఎం ఆధ్వర్యాన ధర్నా చేస్తున్న వరద బాధితులు

మాకు న్యాయం చేయండి

- విజయవాడలో వరద బాధితుల ధర్నా
- దరఖాస్తులతో సహా పెద్ద ఎత్తున తహశీల్దారు కార్యాలయాన్కి రాక
- ముఖ్యమంత్రి హామీని నిలబెట్టుకోవాలి : సిహెచ్ బాబూరావు

ప్రజాశక్తి - వన్‌టౌన్ (విజయవాడ)

వరద బాధితులకు వెంటనే నష్టపరిహారం ఇవ్వాలని కోరుతూ విజయవాడ పశ్చిమ మండల తహశీల్దార్ కార్యాలయం (భవానీపురం) వద్ద సిపిఎం ఆధ్వర్యాన శుక్రవారం ధర్నా నిర్వహించారు. వందలాది మంది వరద బాధితులు ఆందోళనకు దిగారు. సాయం చేయాలని పెద్దపెట్టున నినాదాలు చేశారు. శాసనసభ్యులు, టిడిపి కూటమి నేతలు తమ గోడు పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. నష్టపరిహారం కోసం ఎన్ని రోజులు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాలని ప్రశ్నించారు. ఎన్నికల సందర్భంలో ఓట్ల కోసం తిరిగిన నేతలు ఇప్పుడు మొహం చాటేశారని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక ఎమ్మెల్యే సుజనా చౌదరి అందుబాటులో లేకుండా ఆఫీసు సిబ్బందితో సమాధానం చెప్పించడం ఏమి ప్రజాస్వామ్యమని ప్రశ్నించారు. అనంతరం తహశీల్దారుకు వందలాది దరఖాస్తులు అందించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్ బాబూరావు మాట్లాడుతూ హడావిడిగా చేయించిన ఎన్యుమరేషన్ తప్పుల తడకగా సాగిందన్నారు. దెబ్బతిన్న ఇళ్ల పునర్నిర్మాణం, ఇన్సూరెన్స్ సదుపాయం, వ్యాపార సంస్థలకు సహకారం, బ్యాంకుల ద్వారా రుణాలు, గృహోపకరణాల రిపేర్లు తదితర విషయాలపై, ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలు అమలుపై దృష్టి పెట్టాలన్నారు. కేంద్ర ప్రభుత్వంలో పెద్ద పలుకుబడి ఉందని చెప్పుకుంటున్న స్థానిక ఎమ్మెల్యే సుజనా చౌదరి కేంద్రం నుండి వరద సహాయం నిధులు ఎందుకు తెప్పించలేకపోయారని ప్రశ్నించారు. వరద బాధితులకు చెందిన రెండు నెలల కరెంటు బిల్లులను, ఇంటి పన్నులు, మంచినీటి ఛార్జీలను ప్రభుత్వం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కళాశాలలు, పాఠశాలల ఫీజులను ప్రభుత్వమే భరించాలని విజ్ఞప్తి చేశారు. బ్యాంక్ అకౌంట్లలో తేడాలుంటే నేరుగా బాధితులకు సహాయం అందించాలని కోరారు. తక్షణమే అఖిలపక్ష సమావేశం, వార్డుల్లో సభలు నిర్వహించి బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. స్వయంగా కలెక్టరేట్లో సాయంపై సమీక్షించాలన్నారు. వరద ముంపు నివారణకు శాశ్వత చర్యలు తీసుకోవాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం కోరిన విధంగా కేంద్రం రూ.7500 కోట్ల వరద సాయం అందించాలని డిమాండ్ చేశారు. టిడిపి కార్యాలయంలో ప్రజలు ఇచ్చిన దరఖాస్తులపై ఎమ్మెల్యే బొండా ఉమా విచారణ చేయించక పోగా, అధికారులకు జాబితాలు ఇవ్వండని సిపిఎం నేతలపై వ్యంగ్యంగా వ్యాఖ్యానాలు చేయడం సరికాదన్నారు. రాజకీయ విమర్శలు మాని బాధితులకు సహాయంపై దృష్టి పెట్టాలని హితవు పలికారు. అందరికీ సహాయం అందించకపోతే ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పశ్చిమ నగర కార్యదర్శి బోయి సత్యబాబు, సిపిఎం నేతలు ఇవి.నారాయణ, సూరిబాబు, గాదె ఆదిలక్ష్మి, బి రమణ, సుబ్బారెడ్డి, కొండారెడ్డి, వెంకట్రావు, శేషుమణి పాల్గొన్నారు.

మంత్రి కొండా సురేఖకు కోర్టు మొట్టికాయలు

- కెటిఆర్ పరువు నష్టం కేసు విచారణ

ప్రజాశక్తి- హైదరాబాద్ బ్యూరో

కొండా సురేఖ తనపై అసభ్యకరమైన వ్యాఖ్యలు చేశారంటూ బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ దాఖలు చేసిన రూ.100 కోట్ల పరువు నష్టం కేసులో మంత్రి కొండా సురేఖకు కోర్టు మొట్టికాయలు వేసింది. ఆమె వ్యాఖ్యలు తీవ్ర అభ్యంతరకరంగా ఉన్నాయని హైదరాబాద్ సిటీ సివిల్ కోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఓ బాధ్యతగల మహిళ మంత్రి ఇలాంటి వ్యాఖ్యలు చేయడం ఆశ్చర్యాన్ని కలిగిస్తోందని పేర్కొంది. భవిష్యత్తులో ఇంకెప్పుడూ ఇలాంటి అడ్డగోలు వ్యాఖ్యలను చేయవద్దని కొండాను సురేఖను ఆదేశించింది. అత్యంత జుగుప్సాకరంగా ఉన్న ఆ వ్యాఖ్యలను మీడియా, సోషల్ మీడియా, వెబ్ సైట్లు, అన్ని సోషల్ మీడియా ప్లాట్ ఫారాల నుంచి తొలగించాలని ఆదేశించింది. కొండా సురేఖ వ్యాఖ్యలు సమాజంలో చెడు ప్రభావాన్ని చూపుతాయని, ఆమె వ్యాఖ్యలకు సంబంధించిన అన్ని కథనాలూ, వీడియోలూ పబ్లిక్ డొమైన్‌లో ఉండవద్దని కోర్టు తెలిపింది. కేసును మూసివేసింది.

తాను మరణించి... ముగ్గురి జీవితాల్లో వెలుగులు నింపి..

- సోంపేటకు చెందిన వ్యక్తి బ్రెయిన్ డెడ్
- జీవన్‌దాన్ ద్వారా అవయవాలు వేరొకరికి దానం

ప్రజాశక్తి- అరిలోవ (విశాఖపట్నం)



కుటుంబాన్ని పోషించే పెద్ద దిక్కు మరణించి పుట్టెడు దుఃఖంలో ఉన్న ఆ కుటుంబం మరో ముగ్గురు జీవితాలకు వెలుగులు నింపేందుకు ముందుకు వచ్చి మనసున్న మంచి మనుషులుగా నిరూపించుకుంది. శ్రీకాకుళం జిల్లా సోంపేటకు చెందిన జి.జగదీష్ (41) ఈ నెల 22న ఇంట్లో ఒక్కసారిగా స్పృహ తప్పి పడిపోయారు. ఆయనను సోంపేటలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి కుటుంబసభ్యులు తరలించారు. అక్కడ వైద్యులు అన్ని రకాల పరీక్షలూ నిర్వహించి తలలో తీవ్రంగా రక్త ప్రసరణమైనట్లు గుర్తించారు. మూడు రోజులపాటు ఎంతో శ్రమించినా ఎటువంటి ఫలితమూ లేకపోయింది. బ్రెయిన్ డెడ్ అయినట్లు ఆ కుటుంబానికి వైద్యులు తెలియజేశారు. అవయవ దానంపై అవగహన కల్పించారు. దీంతో అవయవ దానానికి కుటుంబ సభ్యులు అంగీకరించారు. ఈ విషయాన్ని రాష్ట్ర జీవన్ దాన్ కో-ఆర్డినేటర్ డాక్టర్ కె.రాంబాబు దృష్టికి తీసుకెళ్లగా, జగదీష్ కిడ్నీలు, ఊపిరితిత్తులు తీసి జీవన్‌దాన్ ప్రోటోకాల్ ప్రకారం సీనియార్టీ లిస్ట్ ఆధారంగా ముగ్గురు రోగులకు కేటాయించారు. జగదీష్ చనిపోతూ మరో ముగ్గురి జీవితాల్లో వెలుగులు నింపినందుకు గర్వంగా ఉందని మృతుని కుటుంబ సభ్యులు తెలిపారు. స్థానికులు వారిని అభినందించారు.

సజ్జలపై తొందరపాటు చర్యలొద్దు

- గత ఉత్తర్వులను పొడిగించిన హైకోర్టు

ప్రజాశక్తి-అమరావతి

టిడిపి ఆఫీసుపై దాడి కేసులో నాలుగు వారాల్లోగా కౌంటర్లు దాఖలు చేయాలని పోలీసులను హైకోర్టు ఆదేశించింది. అప్పటి వరకు పిటిషనర్ సజ్జల రామకృష్ణారెడ్డిపై పోలీసులు కఠిన లేదా తొందరపాటు చర్యలు తీసుకోరాదని ఆదేశించింది. ఈ మేరకు జస్టిస్ విఆర్‌కె కృపాసాగర్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. తనపై పోలీసులు తొందరపాటు చర్యలు తీసుకోరాదని గతంలో హైకోర్టు ఆదేశించినప్పటికీ దానిని ఉల్లంఘించి లుకౌట్ సర్క్యులర్ (ఎల్‌ఒసి) జారీ చేశారంటూ వైసిపి అగ్రనేత సజ్జల దాఖలు చేసిన కోర్టు ధిక్కరణ పిటిషన్‌లో ప్రతివాదులైన డిజిపి, హోంశాఖ ముఖ్యకార్యదర్శి, గుంటూరు ఎస్‌పికి నోటీసులు జారీ చేశారు.

నందిగం ప్రోత్సాహంతోనే దాడి

గుంటూరు జిల్లా, తుళ్లూరు మండలం, వెలగపూడి గ్రామంలో మాజీ ఎంపి నందిగం సురేష్ ప్రోత్సాహంతోనే ఒక వర్గంపై దాడి జరిగిందని, ఆయనే తన వాంగ్మూలంలో పేర్కొన్నారని పోలీసుల తరపున అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ శుక్రవారం హైకోర్టుకు నివేదించారు. వెలగపూడి గ్రామానికి చెందిన మరియమ్మ 2020 డిసెంబరు 27న హత్యకు గురయ్యారు. ఆమె కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా తుళ్లూరు పోలీసులు నమోదు చేసిన కేసులో అరెస్టయిన నందిగం తనకు బెయిల్ ఇవ్వాలని పిటిషన్ దాఖలు చేశారు. ఈ కేసులో పోలీసుల వివరాలను నమోదు చేసిన జస్టిస్ విఆర్‌కె కృపాసాగర్ విచారణను ఈ నెల 28కు వాయిదా వేశారు.

సింగపూర్ వెళ్లేందుకు అనుమతించండి : పిన్నెల్లి

ఎన్నికలప్పుడు పోలింగ్ కేంద్రంపై దాడి, ఇవిఎంల ధ్వంసంపై నమోదైన కేసులో మంజూరైన బెయిల్ ఉత్తర్వుల్లోని షరతులను సవరించాలని వైసిపి నేత పిన్నెల్లి రామకృష్ణారెడ్డి... హైకోర్టును ఆశ్రయించారు. సింగపూర్ వెళ్లేందుకు వీలుగా మేజిస్ట్రేట్ వద్ద సరెండర్ చేసిన పాస్ పోర్టును తనకు ఇప్పించేలా ఉత్తర్వులు జారీ చేయాలని కోరారు. తన కుమారుడు చదువు నిమిత్తం సింగపూర్ వెళ్తున్నందున తాను కూడా వెళ్లాల్సి వుందన్నారు. ఈ పిటిషన్‌పై ఈ నెల 28న విచారణ జరుపుతామని జస్టిస్ కృపాసాగర్ ప్రకటించారు.

ముందస్తు బెయిల్ ఇవ్వండి : మాజీ ఎంపి ఎంవివి

ఇడి నమోదు చేసిన కేసులో ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని వైసిపి మాజీ ఎంపి ఎంవివి సత్యనారాయణ దాఖలు చేసిన పిటిషన్‌పై హైకోర్టు విచారణ వచ్చేవారానికి వాయిదా పడింది. విశాఖ జిల్లా, ఎండాడలోని హయగ్రీవ భూముల వ్యవహారంపై ఇడి పెట్టిన కేసులో తనకు ముందస్తు బెయిల్ మంజూరు చేయాలనే పిటిషన్‌ను జస్టిస్ కృపాసాగర్ విచారణ జరిపారు. మధ్యంతర ముందస్తు బెయిల్ మంజూరు చేయాలనే అనుబంధ పిటిషన్‌ను అత్యవసరంగా విచారణ చేయాలని పిటిషనర్ కోరారు. కౌంటర్ దాఖలుకు గడువు ఇవ్వాలని ఇడి తరపున న్యాయవాది కోరారు. దీంతో విచారణ వచ్చేవారానికి వాయిదా పడింది.

ఎండియు వాహనాల్లో సరుకుల ధరల బోర్డు తప్పనిసరి

- ఫుడ్ కమిషన్ ఛైర్మన్ విజయప్రతాపరెడ్డి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఎండియు వాహనాల్లో సరుకుల ధరల పట్టిక బోర్డులు తప్పనిసరని, బోర్డులు పెట్టేలా చూడాలని సివిల్ సప్లై అధికారులకు రాష్ట్ర ఫుడ్ కమిషన్ ఛైర్మన్ చిత్తా విజయప్రతాప్‌రెడ్డి సూచించారు. విజయవాడలోని రాష్ట్ర ఆహార కమిషన్ కార్యాలయంలో శుక్రవారం ప్రజా పంపిణీ వ్యవస్థ, మహిళా, శిశు అభివృద్ధి సంస్థ (అంగన్‌వాడీ), మధ్యాహ్న భోజనం, సంక్షేమశాఖ హాస్టల్ విద్యార్థుల వసతులు, ప్రధాన మంత్రి మాతృ వందన యోజన పథకాల అమలు తీరు, లోటు పాట్ల గురించి అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రేషన్ సరుకులు కార్డుదారులకు సక్రమంగా అందేలా చూడాలన్నారు. అంగన్‌వాడీ సెంటర్లలో గర్భిణులు, బాలింతలు, పిల్లలకు ప్రభుత్వ నిబంధనల మేరకు భోజనం, గుడ్లు, సంపూర్ణ పోషణ కిట్, బాలామృతం సక్రమంగా పంపిణీ చేయాలని అధికారులకు సూచించారు. పాఠశాలలతోపాటు సంక్షేమ హాస్టళ్లలో ఉండే విద్యార్థులకు ప్రభుత్వం నిర్ణయించిన మెనూ ప్రకారం భోజనం, గుడ్లు, చిక్కీలు అందించాలన్నారు. ప్రధాన మంత్రి మాతృ వందన యోజన పథకం కింద గర్భిణులకు మొదటి కాన్పుకు రూ.5 వేలతో పాటు అదనంగా రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ ప్రాంతం వారికిచ్చే రూ.వెయ్యి, పట్టణ ప్రాంత ప్రజలకిచ్చే రూ.600 సక్రమంగా అందించాలన్నారు. రెండో కాన్పు అయిన ఆడబిడ్డలకు రూ.5 వేలు కూడా సక్రమంగా అందేలా చూడాలన్నారు. గోదాముల నుంచి పంపిణీ చేసే కందిపప్పు, ఆయిల్ ప్యాకెట్లు 4 లేక 5 నెలలు గడువు ఉండేలా సరఫరా చేయాలని సివిల్ సప్లైస్ గోదాముల అధికారులకు సూచించారు. ఈ సమీక్షలో ఫుడ్ కమిషన్ సభ్యులు గంజిమాల దేవి, లక్ష్మీరెడ్డి ఇండేల, దేవి, ఉపసంచాలకులు పి సురేష్ పాల్గొన్నారు.

అల్లు అర్జున్ పిటిషన్‌పై 6న తీర్పు

ప్రజాశక్తి-అమరావతి

ఎన్నికల నియమావళి ఉల్లంఘనకు పాల్పడ్డారంటూ నంద్యాల పోలీసులు పెట్టిన కేసును కొట్టేయాలంటూ సినీ నటుడు అల్లు అర్జున్, వైసిపి మాజీ ఎమ్మెల్యే రవిచంద్రకిశోర్ రెడ్డి వేర్వేరుగా దాఖలు చేసిన పిటిషన్లపై నవంబరు 6న తీర్పు చెబుతామని హైకోర్టు ప్రకటించింది. అప్పటి వరకు ఎఫ్ఐఆర్ ఆధారంగా పిటిషనర్లపై తదుపరి చర్యలను నిలిపేసింది. ఈ మేరకు జస్టిస్ కృపాసాగర్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉండగా గత మే 11న అప్పటి వైసిపి ఎమ్మెల్యే రవిచంద్ర కిషోర్ రెడ్డి ఇంటికి అల్లు అర్జున్ వెళ్లారు. ఇది తెలుసుకుని అభిమానులు పెద్ద సంఖ్యలో రెడ్డి ఇంటికి చేరుకున్నారు. 144 సెక్షన్ అమల్లో ఉన్నందున అంతమంది చేరడానికి కారణమైన ఆ ఇద్దరిపై ఎన్నికల నియమావళి ఉల్లంఘించారంటూ డిప్యూటీ తహశీల్దార్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఆ కేసును క్వాష్ చేయాలని వారు పిటిషన్ దాఖలు చేశారు.

ఇంజినీరింగ్ 4వ విడత కౌన్సెలింగ్ నిర్వహించాలి

- ఉన్నతాధికారులకు హైకోర్టు ఆదేశం

ప్రజాశక్తి-అమరావతి

ఇంజినీరింగ్, ఇతర ప్రొఫెషనల్ కోర్సులకు సంబంధించి ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల్లో మిగిలిపోయిన సీట్ల భర్తీకి నాలుగో విడత కౌన్సెలింగ్ చేయాలనే వినతిపత్రాన్ని పది రోజుల్లోగా పరిష్కరించాలని ఎపిఇఎపి సెట్ కన్వీనర్, ఉన్నత విద్యాశాఖ అధికారులను హైకోర్టు ఆదేశించింది. విచారణను 2 వారాలకు వాయిదా వేస్తూ జస్టిస్ తర్లాడ రాజశేఖరరావు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. విజయవాడకు చెందిన ఓ విద్యార్థి తల్లి పి అనసూర్య వేసిన పిటిషన్‌లో మూడో విడత కౌన్సెలింగ్ జరిగిందని, ఇంకా 25 వేల సీట్లు ఖాళీగా ఉన్నాయని ఎపిఇఎపిసెట్ కన్వీనర్ ప్రకటించిన నేపథ్యంలో నాలుగో విడత కౌన్సెలింగ్ జరిగేలా ఆదేశాలివ్వాలని కోరారు.

- రాష్ట్ర హైకోర్టుకు అదనపు న్యాయమూర్తులుగా నియమితులైన కుంచం మహేశ్వరరావు, టిసి ధనశేఖర్, చల్లా గుణరంజన్ సోమవారం హైకోర్టులో ప్రమాణస్వీకారం చేయనున్నారు. మొదటి కోర్టు హాలులో హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ వారితో ప్రమాణస్వీకారం చేయంచనున్నారు. సోమవారం ఉదయం 10:15 గంటలకు ప్రమాణస్వీకారం చేయించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి.

ముద్ర రుణాల పరిమితి రూ.20 లక్షలకు పెంపు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ముద్ర రుణాల లోన్ పరిమితిని పెంచారు. శుక్రవారం ఆర్థిక మంత్రిత్వశాఖ ఈ పెంపుకు ఆమోదం తెలిపింది. దీంతో ముద్ర పథకం కింద లోన్ పొందే మొత్తాన్ని రూ.10 లక్షల నుంచి రూ.20 లక్షలకు పెంచారు. రుణాల అందజేత ప్రక్రియ తక్షణమే అమల్లోకి వస్తుందని కేంద్రం తెలిపింది. సూక్ష్మ, చిన్న తరహా సంస్థల కోసం రుణాలు అందించడమే లక్ష్యంగా కేంద్రం ఈ పథకాన్ని తీసుకొచ్చింది. ఈ రుణాల్లో మొత్తం 3 రకాల రుణాలు ఉంటాయి. శిశు రుణాల కింద రూ.50 వేల వరకు లోన్ పొందొచ్చు. కిశోర్ రుణాల కింద రూ.50 వేల నుంచి రూ.5 లక్షల వరకు, తరుణ్ రుణాల కింద రూ.5 లక్షల నుంచి 10 లక్షల వరకు రుణం పొందొచ్చు.

ఢిల్లీ అల్లర్ల కేసులో..

ఇమామ్ బెయిల్‌పై విచారించలేం : సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ : ఢిల్లీ అల్లర్ల కేసులో నిందితుడు షర్జీల్ ఇమామ్‌కు ఉపా కేసులో బెయిల్‌పై విచారణ జరపడానికి సుప్రీంకోర్టు శుక్రవారం తిరస్కరించింది. దీనిపై త్వరితగతిన విచారించాల్సిందని ఢిల్లీ హైకోర్టును కోరింది. రాజ్యాంగంలోని 32వ అధికరణ కింద బెయిల్ కోరుతున్న ఈ పిటిషన్‌ను తాము విచారించలేమని జస్టిస్ బేలా త్రివేది, జస్టిస్ ఎస్‌సి శర్మలతో కూడిన బెంచ్ తెలిపింది. హైకోర్టు త్వరగా విచారించేలా కోరే స్వేచ్ఛ పిటిషనర్‌కు వుందని పేర్కొంది. 2022 నుండి ఈ బెయిల్ పెండింగ్‌లో వుందని ఇమామ్ తరపు న్యాయవాది చెప్పారు. ప్రస్తుత దశలో తాను బెయిల్ కోసం పట్టుబట్టడం లేదని కూడా స్పష్టం చేశారు. కావాలంటే ఈ కేసును హైకోర్టు నవంబరు 25న విచారించవచ్చని సుప్రీం తెలిపింది.

ఎన్‌సిపి(అజిత్)లోకి బాబా సిద్దిఖీ కుమారుడు

ముంబయి : మహారాష్ట్ర మాజీ మంత్రి బాబా సిద్దిఖీ కుమారుడు జీషన్ సిద్దిఖీ ఉప ముఖ్యమంత్రి అజిత్‌పవార్ నేతృత్వంలోని నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎన్‌సిపి)లో శుక్రవారం చేరారు. బాంద్రా ఈస్ట్ నుంచి జీషాన్‌ను బరిలోకి దింపుతున్నట్లుగా ఎన్‌సిపి (అజిత్ గ్రూప్) వెల్లడించింది. ఎన్‌సిపిలో చేరిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. తనకు బాంద్రా ఈస్ట్ స్థానం కేటాయించినందుకు పార్టీ నాయకత్వానికి జీషన్ సిద్దిఖీ కృతజ్ఞతలు తెలిపారు. 2019 ఎన్నికల్లో ఆ స్థానం నుంచి కాంగ్రెస్ తరపున గెలిచిన జీషన్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో క్రాస్ ఓటింగ్‌కు పాల్పడటంతో, ఆ పార్టీ బహిష్కరించింది. ఆయన తండ్రి బాబా సిద్దిఖీ ఈ నెల 12న హత్యకు గురైన సంగతి తెలిసిందే.

ఢిల్లీలో క్షీణించిన గాలి నాణ్యత

- బయట తిరగొద్దు : కేంద్ర ఆరోగ్యమంత్రిత్వశాఖ

న్యూఢిల్లీ : దేశరాజధాని ఢిల్లీలో దీపావళి రాకముందే వాయుకాలుష్యం బాగా పెరిగింది. వాయుకాలుష్యంతోపాటు, పొగమంచు కూడా కమ్మేయడంతో అక్కడ గాలి నాణ్యత రోజురోజుకీ క్షీణిస్తోంది. దీంతో స్థానికులు శ్వాసకోశ సమస్యలు ఎదుర్కొంటున్నారు. శుక్రవారం ఉదయం 8 గంటలకి గాలి నాణ్యత (ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్) 283 వద్ద నమోదైనట్లు కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి పేర్కొంది. ఇక ఢిల్లీలో ఆనంద్ విహార్‌లో 218, పంజాబీ బాగ్‌లో 245, ఇండియా గేట్ పరిసర ప్రాంతాల్లో 276, జిల్మిల్ ఇండస్ట్రియల్ ఏరియాలో 288గా ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ నమోదైంది. ఢిల్లీలో వాయు కాలుష్యం అధికంగా ఉండటంతో బహిరంగ ప్రదేశాల్లో మార్నింగ్ వాక్, క్రీడలు ఆడటం పరిమితం చేయాలని కేంద్ర ఆరోగ్యమంత్రిత్వశాఖ పేర్కొంది. ఈ మేరకు వివిధ రాష్ట్రాలకు ఆదేశాలు జారీ చేసింది. శ్వాసకోశ, హృదయ సంబంధ సమస్యలతో బాధపడుతున్నవారు, గర్భిణులు, వృద్ధులు బహిరంగ ప్రదేశాల్లో కార్యకలాపాలను తగ్గించాలని సూచించింది.

భారత్‌లో పెట్టుబడులు పెట్టండి

(మొదటిపేజీ తరువాయి)

చేరుకున్నారు. హోం శాఖ సహాయ మంత్రి నిత్యానంద రాయ్ ఆయనకు సాదర స్వాగతం పలికారు. అంతకుముందు, మిలటరీ కొనుగోళ్ల ఆమోదం కోసం జర్మనీ, భారత్‌కు ప్రత్యేక హోదా ఇచ్చింది. గతంలో కూడా మిలటరీ కొనుగోళ్ల కోసం భారత్ చేసిన అభ్యర్థనలను ఆమోదించినప్పటికీ వాటికి కొంత సమయం పట్టేది. ఇప్పుడు ప్రత్యేక హోదా ఇవ్వడం వల్ల ఈ ప్రక్రియ వేగవంతం అవుతుందని జర్మనీ రాయబారి ఫిలిప్ అకర్‌మన్ చెప్పారు. 20వ శతాబ్దంలో ఏర్పాటు చేసిన అంతర్జాతీయ వేదికలు 21వ శతాబ్దపు సవాళ్లను పరిష్కరించగలిగే సామర్థ్యంతో లేవని ఇరుపక్షాలు అభిప్రాయపడినట్లు మోడీ తెలిపారు. భద్రతా మండలితో సహా బహుళపక్ష సంస్థలను సంస్కరించాల్సిన అవసరం చాలా వుందని ఆయన పేర్కొన్నారు.

ఒడుదుడుకుల్లో పత్తి సాగు

(మొదటిపేజీ తరువాయి)

వాతావరణం మీద, రైతుల మీద నెపం వేస్తున్నాయి. దశాబ్దంలోకెల్లా 2021-22లో అత్యల్ప దిగుబడి వచ్చింది. ఆ ఏడాది సగటున ఎకరాకు 2.30 క్వింటాళ్ల పత్తి (కాయల) దిగుబడి వచ్చింది. పదేళ్లలో 2019-20లో అత్యధికంగా ఎకరాకు 7.78 క్వింటాళ్ల దిగుబడి లభించింది. ఉత్పత్తి పరంగా చూస్తే 2019-20లో అత్యధికంగా 24.97 లక్షల బేళ్ల పత్తి (లింట్) ఉత్పత్తి జరిగింది. అత్యల్పంగా గతేడాది (2023-24)లో 7.23 లక్షల బేళ్ల పత్తి ఉత్పత్తి వచ్చింది. ప్రస్తుత సీజన్‌లో 11.32 లక్షల ఎకరాల్లో పత్తి సాగవుతుందని, 9.41 లక్షల బేళ్ల పత్తి ఉత్పత్తి లభిస్తుందని ప్రభుత్వం ఆగస్టులో మొదటి ముందస్తు అంచనా వేసింది. కానీ సాగు 3.99 లక్షల ఎకరాలకు తగ్గింది. ఎకరాకు దిగుబడి 4.23 క్వింటాళ్లు దిగుబడి వస్తుందని తొలి అంచనాలో పేర్కొన్నారు. వర్షాభావం, డ్రైస్పెల్స్, వర్షాలు, వరదల వలన వేసిన పంట చాలాచోట్ల దెబ్బతింది. ఒక వైపు సాగు తగ్గడం మరో వైపు ప్రకృతి విపత్తులతో పంట దెబ్బతినడం చూస్తుంటే సర్కారీ మొదటి అంచనాల కంటే బాగా దిగుబడి, ఉత్పత్తి తగ్గే సూచనలు కనిపిస్తున్నాయి.

ధాన్యం సేకరణలో జాప్యంపై

భగ్గుమన్న పంజాబ్ రైతులు

- ఎస్‌కెఎం ఆధ్వర్యాన రోడ్ల దిగ్బంధం
- అమిత్ షాతో సిఎం భగవంత్ మాన్ చర్చలు


బఠిండాలో ఆందోళన చేస్తున్న రైతులు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

పంజాబ్‌లో ధాన్యం సేకరణ ఆలస్యానికి వ్యతిరేకంగా సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కెఎం) ఆధ్వర్యాన రైతులు రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమించారు. పంజాబ్‌లోని చాలాచోట్ల రైతులు శుక్రవారం నాలుగు గంటల పాటు రహదారులను దిగ్బంధించారు. లూధియానాలో, సమ్రాల, ఖన్నా, దొరహా, మచివార, జగ్రావ్, ముల్లన్‌పూర్, రాయికోట్‌లో సహా పలుచోట్ల రైతులు వీధుల్లోకి వచ్చారు. కపుర్తలలో ఆందోళన చేస్తున్న రైతులు హమీరాలోని జలంధర్ - అమృత్‌సర్ జాతీయ రహదారి, ధిల్వాన్ టోల్ ప్లాజా, ముండి మోర్ గ్రామ సమీపంలోని కపుర్తల - గోయింద్‌వాల్ రహదారి, కొత్త ధాన్యం మార్కెట్ సమీపంలోని కపుర్తల - సుల్తాన్‌పూర్‌లోధి రహదారిపై ఆందోళన చేపట్టారు. కనీస మద్దతు ధర కంటే తక్కువ ధరకు కొనుగోలు చేస్తూ ప్రైవేట్ వ్యాపారులు మోసం చేస్తున్నారని రైతులు విమర్శించారు. కపుర్తలా జిల్లాలోని పలుచోట్ల ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నిరసనలు జరిగాయి. హోషియార్‌పూర్-ఫగ్వారా రోడ్డులోని రహింపూర్ చౌక్ వద్ద ఆందోళన చేపట్టారు. జలంధర్-పఠాన్‌కోట్ జాతీయ రహదారిపై హాజీపూర్ చౌక్ వద్ద, దోసర్కా-హర్యానా రహదారిలోని పండోరి మాయల్ ధాన్యం మార్కెట్ ముందు కూడా నిరసనలు జరిగాయి. అమృత్‌సర్‌లో అజ్నాలా పట్టణ సమీపంలోని కుక్రవాలా వద్ద హైవేను దిగ్బంధించడంతో పాటు, భగత్వాలాలోని జిల్లా మండి అధికారి కార్యాలయం ముందు రైతులు నిరసన చేపట్టారు. ఫగ్వారాలో రైతులు చేపట్టిన నిరవధిక నిరసన శుక్రవారం ఐదోరోజుకు చేరుకుంది. శనివారం అక్కడ భారీ ర్యాలీ, ప్రదర్శన నిర్వహించనున్నట్లు రైతు నేత సత్నామ్ సింగ్ సాహ్ని తెలిపారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలది సమాన బాధ్యత

ఎస్‌కెఎం నేత బల్బీర్ సింగ్ రాజేవాల్ మాట్లాడుతూ.. ధాన్యం సేకరణలో జాప్యానికి, మద్దతు ధర లభించకపోవడానికి పంజాబ్‌లోని ఆప్ ప్రభుత్వం, కేంద్రంలోని బిజెపి నేతృత్వంలోని ఎన్‌డిఎ ప్రభుత్వానిది సమాన బాధ్యత అని అన్నారు. రైతులను, పంజాబ్ ఆర్థిక వ్యవస్థను పణంగా పెట్టి ఆటలాడొద్దని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం, కేంద్రం రెండూ రైతులు, దేశ ప్రయోజనాల కోసం నిజాయతీగా తమ బాధ్యతలు నిర్వర్తించాలని అన్నారు.

అమిత్‌షాతో సిఎం చర్చలు

రైతుల ఆందోళన నేపథ్యంలో ముఖ్యమంత్రి భగవంత్ మాన్ కేంద్ర హోంమంత్రి అమిత్ షాతో మాట్లాడారు. రాష్ట్ర రైస్ మిల్లర్లు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరారు.

ఆర్థిక అసమానతలతో దీర్ఘకాలిక వృద్ధికి ఆటంకం : కాంగ్రెస్

న్యూఢిల్లీ : ఆర్థిక అసమానతలు, వేతనాల్లో స్తబ్దత, ద్రవ్యోల్బణం భారత దేశ దీర్ఘకాలిక వృద్ధి, అవకాశాలను నిర్మాణాత్మకంగా హరించివేస్తున్నాయని కాంగ్రెస్ విమర్శించింది. అధిక ఆర్థిక వృద్ధి రేటును కొనసాగించడానికి జిడిపిలో ప్రైవేటు పెట్టుబడి రేట్లను పెంచడం వివాదాస్పదమైన అంశమని కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి (కమ్యూనికేషన్స్) జైరామ్ రమేష్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆర్థిక వృద్ధి రేట్లు (2004-2014)లో 33.4 శాతంగా ఉండగా, 2014-2023లో 28.7 శాతానికి క్షీణించాయని పేర్కొన్నారు. ఆర్థిక రంగానికి సంబంధించి ఒక ప్రముఖ ఆర్థిక వేత్త రాసిన ప్రత్యేక కథనాన్ని ఆయన పోస్ట్ చేశారు. కోవిడ్ అనంతరం వస్తువులు, సేవలకు డిమాండ్ తగ్గడం చాలావరకు పేద, మధ్యతరగతి ప్రజలను ఆర్థికంగా దెబ్బతీసిందని తెలిపారు. ఆర్థిక అసమానతలు, వేతనాల్లో స్తబ్దత, ద్రవ్యోల్బణం రాజకీయ సమస్యలు మాత్రమే కాదని, ఇవి దేశ దీర్ఘకాలిక వృద్ధి, అవకాశాలను నిర్మాణాత్మకంగా హరించివేస్తాయని పేర్కొన్నారు. ప్రతిపక్షాల సూచనలను వినకపోతే, ప్రభుత్వం తన సొంత ప్రధాన ఆర్థిక సలహాదారు సూచనలైనా వినాలని సూచించారు.

మధ్యప్రదేశ్‌లో ఘోరం

- వేర్వేరుచోట్ల ఇద్దరు మహిళలపై అత్యాచారం

భోపాల్ : బిజెపి పాలిత మధ్యప్రదేశ్‌లో ఒకేరోజు వేర్వేరుచోట్ల ఇద్దరు మహిళలపై అత్యాచారం జరిగింది. కొత్తగా పెళ్లైన యువతిపై కొందరు దుండగులు సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. అలాగే మానసిక అనారోగ్యంతో బాధపడుతున్న మరో మహిళపై లైంగిక దాడి జరిగింది. ఈ ఘటనలు ఆలస్యంగా వెలుగుచూశాయి. కొత్తగా పెళ్లైన 19 ఏళ్ల యువతి తన భర్తతో కలిసి సోమవారం రాత్రి రేవాలోని పిక్నిక్ స్పాట్‌కు వెళ్లింది. అక్కడున్న ఫౌంటెన్ వద్ద భర్తతో ఆమె గొడవపడింది. ఇంతలో ఐదుగురు దుండగులు అక్కడికి వచ్చి, భర్తను చెట్టుకు కట్టి ఆమెపై సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. బాధితురాలి ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. సుమారు వంద మంది అనుమానితులను ప్రశ్నించారు.

మానసిక అనారోగ్యంతో బాధపడుతున్న 40 ఏళ్ల మహిళ ఇండోర్‌లో సోమవారం అర్ధరాత్రి ఒంటరిగా రోడ్డుపై నడిచి వెళ్తుండగా, 20 ఏళ్ల యువకుడు గమనించాడు. ఆమెను తన వెంట తీసుకెళ్లి అత్యాచారానికి పాల్పడి పారిపోయాడు. బాధిత మహిళను గస్తీ పోలీసులు గమనించి ఆసుపత్రికి తరలించారు. ఆ ప్రాంతంలోని సిసి టివి ఫుటేజ్‌ను పరిశీలించి నిందితుడ్ని అరెస్ట్ చేశారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఒకే రోజు రెండు ప్రాంతాల్లో ఇద్దరు మహిళలపై అత్యాచారాలు జరగడం రాష్ట్రంలోని బిజెపి ప్రభుత్వ వైఫల్యమేనని ప్రతిపక్షాలు విమర్శించాయి. నిందితులను కఠినంగా శిక్షించాలని, బాధితులను ఆదుకోవాలని డిమాండ్ చేశాయి.

ఖాన్ యూనిస్‌లో ఊచకోత

- ఇజ్రాయిల్ దాడుల్లో ఒకే కుటుంబానికి చెందిన 38మంది బలి
- మృతుల్లో 14మంది పిల్లలే
- అల్ షాటి శిబిరంపై దాడిలో మరో 20మంది మృతి
- లెబనాన్‌లో మరణించిన ముగ్గురు జర్నలిస్టులు
- కాల్పుల విరమణకే ప్రాధాన్యత అన్న లెబనాన్ ప్రధాని
- జాతి నిర్మూలన ఆపండి : బ్లింకెన్‌తో జోర్డాన్ మంత్రి స్పష్టీకరణ



గాజా, బీరుట్ : ఖాన్ యూనిస్ నగరంలో నివాస భవంతులను లక్ష్యంగా చేసుకుని ఇజ్రాయిల్ ఆర్మీ జరిపిన భీకర దాడుల్లో ఒకే కుటుంబానికి చెందిన 38మంది మరణించారు. వీరిలో 14మంది పిల్లలే వున్నారు. ఆ దాడుల అనంతరం అల్ షాటి శరణార్థ శిబిరంపై కూడా దాడి జరిగింది. ఆ దాడిలో మరో 20మంది చనిపోయారు. ఉత్తర గాజాలోని జాబాలియా శరణార్థ శిబిరంలో డజనుకు పైగా నివాస భవనాలను ఇజ్రాయిల్ మిలటరీ పేల్చివేసింది. ఈ దాడిని పెద్ద ఊచకోతగా గాజా పౌర రక్షణ దళాలు పేర్కొన్నాయి. ఆక్రమిత వెస్ట్ బ్యాంక్‌లో ఇజ్రాయిల్ బలగాలు పెద్ద సంఖ్యలో అరెస్టులకు పాల్పడ్డాయి. పలు ఇళ్లపై దాడులు చేసి, వారి ఆస్తులను ధ్వంసం చేస్తూ 65మందిని అదుపులోకి తీసుకున్నాయి. ఒక ఇంటిని తాత్కాలిక మిలటరీ ఔట్‌పోస్టుగా మార్చి అరెస్టు చేసిన వారందరినీ అక్కడకు తరలించి, చిత్ర హింసలకు గురిచేస్తున్నాయి. ఇజ్రాయిల్ సాగిస్తున్న జాతి నిర్మూలన కార్యక్రమాన్ని తక్షణమే ఆపాలని జోర్డాన్ డిమాండ్ చేసింది. అమెరికా విదేశాంగ మంత్రి బ్లింకెన్‌తో భేటీలో జోర్డాన్ విదేశాంగ మంత్రి ఐమెన్ సఫాది స్పష్టం చేశారు.

ఆస్పత్రిపై దాడి : చిక్కుకున్న 150మంది రోగులు

ఉత్తర గాజాలో పనిచేస్తున్న అతి కొద్ది ఆస్పత్రుల్లో కమల్ అద్వాన్ ఒకటి. శుక్రవారం ఈ ఆస్పత్రిపైనా ఇజ్రాయిల్ దాడి చేసింది. అప్పటికి ఆస్పత్రిలో 150మంది రోగులు ఉన్నారు. ఈ దాడిలో అనేక మంది పిల్లలు చనిపోయారు.. ఆస్పత్రిలోని ఆక్సిజన్ స్టేషన్ పూర్తిగా ధ్వంసమైందని ఆస్పత్రి డైరెక్టర్ హుస్సమ్ అబూ సఫియా తెలిపారు. గత 20రోజులుగా సాగిస్తున్న దిగ్బంధనంలో వైద్య సేవలు పూర్తిగా దెబ్బతిన్నాయని గాజాలోని పౌర రక్షణ దళాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఇదిలావుండగా, ఇజ్రాయిల్ ప్రతినిధి బృందం ఆదివారం దోహా బయలుదేరి వెళ్లనుంది. కాల్పుల విరమణ కోసం మళ్లీ ప్రయత్నాలు ప్రారంభించనున్నట్లు అమెరికా ప్రకటించిన నేపథ్యంలో దోహాలో చర్చలకు మళ్లీ రంగం సిద్ధమైంది. ఇజ్రాయిల్ క్రూర దాడుల్లో ఇప్పటివరకు 42,847మంది మరణించగా, 1,00,544మంది గాయపడ్డారు.

ముగ్గురు జర్నలిస్టులు మృతి

మరోవైపు లెబనాన్‌పై ఇజ్రాయిల్ సాగిస్తున్న దాడుల్లో ముగ్గురు జర్నలిస్టులు మరణించారు. ఈ దాడిని ఇరాన్ తీవ్రంగా ఖండిస్తూ ఇదొక దారుణమైన నేరమని వ్యాఖ్యానించింది. దక్షిణ లెబనాన్‌లో జర్నలిస్టులను ఉద్దేశ్యపూర్వకంగానే లక్ష్యంగా చేసుకుని దాడి జరిపారని ఇరాన్ విదేశాంగ శాఖ ప్రతినిధి ఇస్మాయిల్ భాగే విమర్శించారు. అంతర్జాతీయ మానవతా చట్టాల కింద జర్నలిస్టులకు రక్షణ వుంటుందని, దాన్ని ఉల్లంఘించి మరీ దాడులు జరపారని పేర్కొన్నారు.

కాల్పుల విరమణ ఒప్పందానికి ప్రాధాన్యత : లెబనాన్

కాల్పుల విరమణ ఒప్పందాన్ని కుదుర్చుకోవడానికి తమ ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తోందని లెబనాన్ తాత్కాలిక ప్రధాని మికతి చెప్పారు. ఈ ఒప్పందం ద్వారా ఇజ్రాయిల్ దురాక్రమణను నిలువరించవచ్చన్నారు. లండన్‌లో అమెరికా విదేశాంగ మంత్రి ఆంటోనీ బ్లింకెన్‌తో జరిగిన సమావేశంలో ఈ విషయాన్ని ఆయన స్పష్టం చేశారు. ఈ దాడుల కారణంగా ఇప్పటికే 14 లక్షల మంది పౌరులు నిర్వాసితులయ్యారని మికతి తెలిపారు. పౌరులు, జర్నలిస్టులు, వైద్య సిబ్బందిపై దాడులు చేయడం ద్వారా ఇజ్రాయిల్ మరోసారి ఉల్లంఘించిందని విమర్శించారు. గతంలో చోటుచేసుకున్న సంఘటనలు ప్రతి ఒక్కరి విశ్వసనీయతను దెబ్బతీశాయని వ్యాఖ్యానించారు. ఈ సమస్యకు దౌత్య మార్గాల ద్వారా సత్వరమే పరిష్కారం కనుగొనాల్సిన అవసరం వుందని బ్లింకెన్ పేర్కొన్నారు. హిజ్బుల్లా నిరాయుధీకరణపై అవగాహనకు రావడమే అసలైన కీలకాంశంగా వుంటుందన్నారు.


సిపిఎం అభ్యర్థి ప్రదీప్‌కు మద్దతుగా ప్రచారం నిర్వహిస్తున్న పినరయి విజయన్


జార్ఖండ్‌లో ప్రచారం నిర్వహిస్తున్న సిపిఎం అభ్యర్థులు

ఎల్‌డిఎఫ్‌కు మద్దతివ్వండి

- పినరయి విజయన్ పిలుపు

న్యూఢిల్లీ : ఎల్‌డిఎఫ్‌కు మద్దతివ్వాలని కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ పిలుపునిచ్చారు. కేరళలోని చెలక్కర అసెంబ్లీ నియోజకవర్గ ఉప ఎన్నికల్లో సిపిఎం తరపున పోటీ చేస్తున్న యుఆర్ ప్రదీప్‌కు మద్దతుగా శుక్రవారం నిర్వహించిన భారీ ప్రచార సభలో ఆయన ప్రసంగించారు. మతతత్వ శక్తులపై, వాటికి మద్దతిచ్చే వారిని ఎదుర్కోవడంలో దృఢమైన వైఖరి అవలంబిస్తున్న ఎల్‌డిఎఫ్‌కు మద్దతివ్వాలని ఆయన ప్రజలను కోరారు. సభలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి ఎంవి గోవిందన్ మాస్టారు, కేంద్ర కమిటీ సభ్యులు, ఎంపి కెపరాధాకృష్ణన్, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి బినోయ్‌విశ్వం, ఎన్‌సిపి రాష్ట్ర అధ్యక్షులు పిసి చాకో, కేరళ కాంగ్రెస్ (ఎస్) రాష్ట్ర అధ్యక్షులు కె.రామచంద్రన్ తదితరులు ప్రచారంలో పాల్గొన్నారు.

జార్ఖండ్‌లో సిపిఎం విస్తృత ప్రచారం

సిపిఎం అభ్యర్థులుగా జార్ఖండ్‌లోని జమతార అసెంబ్లీ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న లఖన్‌లాల్ మండల్, జమ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న సనాతన్ దేహ్రీ శుక్రవారం భారీ ప్రచారం నిర్వహించారు. ప్రదర్శనగా వెళ్లి, ఓటర్లను కలిశారు. ప్రజల, కార్మికుల హక్కుల పరిరక్షణకు సిపిఎంకు మద్దతివ్వాలని కోరారు.





29కల్లా సైనిక బలగాల ఉపసంహరణ పూర్తి

- నెలాఖరుకల్లా భారత్, చైనా సరిహద్దుల్లో గస్తీ కార్యకలాపాల పునరుద్ధరణ

న్యూఢిల్లీ : తూర్పు లడఖ్‌లోని డెస్పాంగ్, డెమ్‌చాక్ ఏరియాల్లో భారత్, చైనాలు సమన్వయంతో కూడిన గస్తీ చర్యలు చేపట్టనున్నాయని ఆర్మీ వర్గాలు తెలిపాయి. ఈ నెల 29వ తేదీనాటికల్లా ఇరు దేశాల సైనిక బలగాల ఉపసంహరణ ప్రక్రియ ముగుస్తుందని, నెలాఖరుకల్లా గస్తీ కార్యకలాపాలను పునరుద్ధరిస్తామని ఆ వర్గాలు వెల్లడించాయి. సైనిక బలగాల ఉపసంహరణ ప్రక్రియ ఈ నెల 22న ప్రారంభమైంది. 2020 ఏప్రిల్ ముందునాటికి వున్న పరిస్థితులు నెలకొన్న తర్వాత గస్తీ చర్యలు పునరుద్ధరించబడతాయి. దౌత్యస్థాయిలో సాధారణ ఒప్పందం కుదిరిందని, ఆ తర్వాత బలగాల ఉపసంహరణకు, గస్తీ చేపట్టేందుకు అనుసరించాల్సిన విధి విధానాలు, తీసుకోవాల్సిన చర్యలపై వివరాలతో కూడిన ఒప్పందం సోమవారం నాడు కుదిరిందని ఆ వర్గాలు పేర్కొన్నాయి. ఘర్షణలు, ఒత్తిడి నెలకొన్న పాయింట్లయిన డెస్పాంగ్, డెమ్‌చాక్ ఏరియాలకు మాత్రమే ప్రస్తుత ఒప్పందం వర్తిస్తుంది. వ్యూహాత్మకమైన డెస్పాంగ్ మైదానాల్లోని వై జంక్షన్ దాటి భారత బృందాలు గస్తీ తిరగడాన్ని చైనా పీపుల్స్ లిబరేషన్ ఆర్మీ నిలువరించింది. 2020 జనవరి వరకు గస్తీ తిరిగి ఆ తర్వాత వెళ్లలేకపోయిన పెట్రోలింగ్ పాయింట్లలో తాజాగా కుదిరిన ఒప్పందం మేరకు భారత గస్తీ బృందాలు ఇప్పుడు వెళ్లగలుగుతాయి.

ఇతర పాయింట్లలో గస్తీ కార్యకలాపాల పునరుద్ధరణ వుండదు. ఆ ప్రాంతాల్లో గల్వాన్, పాంగాంగ్ టిఎస్‌ఓ ఉత్తర, దక్షిణ ప్రాంతాలు, గోగ్రా హాట్ స్ప్రింగ్ ఏరియాలు వున్నాయి. సైనికులు ఎదురెదురు పడకుండా వుండేలా తగిన జాగ్రత్తలు తీసుకున్నట్లు ఆ వర్గాలు చెప్పాయి. ఇరు పక్షాలూ ఈ గస్తీని సమన్వయం చేసుకోవాల్సిందేనని స్పష్టం చేశాయి. భవిష్యత్తులో ఉద్రిక్తతలు చెలరేగకుండా, విశ్వాస పునరుద్ధరణ చర్యలు వివిధ స్థాయిలో చేపట్టేందుకు వీలుగా క్రమం తప్పకుండా చర్చలు జరుగుతాయని ఆ వర్గాలు తెలిపాయి.


ఒడిశాలోని భద్రక్‌లో రహదారిపై కూలిపోయిన చెట్టును తొలగిస్తున్న సహాయక సిబ్బంది

తీరం దాటిన దానా

- పున:ప్రారంభమైన విమానాల రాకపోకలు

భువనేశ్వర్ : ఒడిశాలోని కేంద్ర పారా జిల్లాలో తీవ్రమైన తుపానుగా మారిన దానా శుక్రవారం తీరం దాటింది. శుక్రవారం తెల్లవారుజామున 1.30 గంటల నుంచి 3.30 గంటల మధ్య గంటకు వంద నుంచి 110 కిలోమీటర్ల వేగంతో కేంద్రపారా జిల్లా హబాలిఖతి నేచర్ క్యాంప్ వద్ద తీరం దాటినట్లు భారత వాతావరణ శాఖ ప్రకటించింది. అనంతరం ఉత్తరకోస్తా, ఒడిశా మీదుగా తుపానుగా బలహీనపడింది. తుపాను కారణంగా భద్రక్‌లోని చాద్‌బాలి, కేంద్రపారాలోని రాజ్ కనికాలో 16 సెంటీమీటర్ల చొప్పున భారీ వర్షం కురిసింది. బలమైన గాలుల వల్ల రహదారులపై చెట్లు నేలకూలడంతో అనేక చోట్ల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. అధికారులు ఎక్కడికక్కడ చెట్లను తొలగించే పనులు చేపట్టారు. ప్రాణనష్టం జరిగినట్టు ఎటువంటి సమాచారం లేదని రాష్ట్రప్రభుత్వం పేర్కొంది. దానా తుపానును ఎదుర్కోవడంలో విజయవంతమయ్యామని సిఎం మోహన్ మాఝీ పేర్కొన్నారు. తుపాను తీరం దాటడంతో విమానాల రాకపోకలు పున:ప్రారంభమయ్యాయని విమానాశ్రయ అధికారులు శుక్రవారం తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి ఒడిశాలోని భువనేశ్వర్ బిజు పట్నాయక్ అంతర్జాతీయ విమానాశ్రయం, కోల్‌కతాలోని నేతాజీ సుభాస్ చంద్రబోస్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి విమానాల రాకపోకలు పున:ప్రారంభమయ్యాయి.

ట్రంప్ ఓ ఫాసిస్టు

- డెమొక్రాటిక్ అభ్యర్థి కమలా హారిస్ వ్యాఖ్య



ఫిలడెల్ఫియా: మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఓ ఫాసిస్టు అని ఉపాధ్యక్షురాలు కమలా హారిస్ ప్రకటించారు. ట్రంప్ హిట్లర్ నుంచి ప్రేరణ పొందాడని, ఆయన గనుక గెలిస్తే నియంతలా వ్యవహరిస్తాడని వైట్ హౌస్‌లో సుదీర్ఘకాలం పాటు చీఫ్ ఆఫ్ స్టాఫ్‌గా పనిచేసిన జాన్ కెల్లీ పేర్కొన్న మరుసటి రోజే హారిస్ తన రాజకీయ ప్రత్యర్థిపై ఈ వ్యాఖ్యలు చేశారు. అధ్యక్ష ఎన్నికలు సమీపిస్తున్న కొద్దీ అమెరికాలో రాజకీయ వేడి పెరుగుతోంది. నియంతకు ఉండాల్సిన లక్షణాలన్నీ ట్రంప్‌లో పరిపూర్ణంగా ఉన్నాయని హారిస్ అన్నారు. డొనాల్డ్ ట్రంప్ ఫాసిస్టు అని మీరు నమ్ముతున్నారా? అని సిఎన్‌ఎన్ ప్రతినిధి అడిగినప్పుడు, అవును ఆయన ఫాసిస్టే అని చెప్పారు. ఎన్నికల్లో ఇరువురు అభ్యర్థులకూ కీలకమైన పెన్సిల్వేనియా రాష్ట్రంలోని ఫిలడెల్ఫియా డెలావర్ కౌంటీ శివార్లలో ఓటర్లతో జరిగిన సమావేశంలో ఆమెకు ప్రేక్షకుల నుంచి పదే పదే ఈ ప్రశ్న వచ్చింది. ట్రంప్ చేస్తున్న గందరగోళ ప్రసంగాలు, తెంపరితనం ఇవన్నీ ఆయన నిలకడలేని తనాన్ని తెలియజేస్తున్నాయి. ఇటువంటి వ్యక్తి మళ్లీ అధ్యక్షుడు కావడానికి పూర్తిగా అన్‌ఫిట్ అని హారిస్ అన్నారు. జాన్ కెల్లీ కూడా ఇదే విధమైన వ్యాఖ్యలు చేశారు. ట్రంప్ అధ్యక్షుడిగా ఉన్నప్పుడు వైట్ హౌస్ చీఫ్ ఆఫ్ స్టాఫ్‌తో కన్నా ఆయనకు నచ్చిన కొద్ది మంది అధికారులతో రోజూ గంటల తరబడి రహస్య మంతనాలు జరిపేవాడని కెల్లీ తెలిపారు. బుధవారం రాత్రి జార్జియా రాష్ట్రంలో జరిగిన ఒక ర్యాలీలో ట్రంప్ మాట్లాడుతూ, కెల్లీ, హారిస్ వ్యాఖ్యలను పట్టించుకోవడం లేదన్నారు. కెల్లీ అనేవాడు ఒకప్పుడు బలంగా ఉన్నప్పటికీ ఇప్పుడు బలహీనంగా, దిగజారిన అల్పజీవి. ఇక హారిస్ అంటారా, ఆమె ఓ తెలివి తక్కువ క్రిమినల్ అని ట్రంప్ తూలనాడాడు. 'న్యూయార్క్ టైమ్స్' ప్రతినిధి కెల్లీని ఫాసిజాన్ని నిర్వచించాని ఆన్‌లైన్‌లో అడగ్గా ఆయన పాక్షిక నిర్వచనం ఇస్తూ ఇలా అన్నాడు. 'ప్రతి ఫాసిస్టు ఉద్యమం పరమావధి రాజ్యాధికారం చేజిక్కించుకోవడమే. అది పెట్టుబడిదారీ గుత్తాధిపత్య శక్తులు ప్రభుత్వాన్ని, ప్రజలను నేరుగా నియంత్రించడంలో ప్రతిఫలిస్తుంది. ఫాసిస్టులు అధికారంలోకి వచ్చిన ప్రతిచోటా కార్మిక సంఘాలు, కార్మికుల మద్దతు కలిగిన రాజకీయ పార్టీలను ఎలాంటి మినహాయి ంపు లేకుండా అణచివేస్తాయి. జర్మనీలో జరిగింది ఇదే. హిట్లర్ జర్మనీలో నిర్వహించిన నిర్బంధ శిబిరాలు జర్మన్ కార్పొరేట్ కంపెనీలకు ఉచిత శ్రమ వనరులుగా మారాయి. ట్రంప్‌ను ప్రస్తుతం బల పరుస్తున్న వారిలో చాలామంది కుబేరులున్నారు. వీరితో ట్రంప్ చాలా చనువుగా తిరుగుతుంటాడు. నిరంకుశత్వం, మిలిటరీ కవాతులు, గ్రేట్ లీడర్‌కు సెల్యూట్ చేయడం వంటివి ట్రంప్ కోరుకుంటాడు. ఆర్థిక ఫాసిజం గురించి ఇక వేరే చెప్పనవసరం లేదని' ఆయన అన్నారు.

ఏడుగురు బిష్ణోయ్ గ్యాంగ్ షూటర్ల అరెస్టు

ముంబై : లారెన్స్, అన్మోల్ బిష్ణోయ్ గ్యాంగ్‌కు చెందిన ఏడుగురు షూటర్లను అరెస్టు చేసినట్లు ఢిల్లీ పోలీసులు శుక్రవారం తెలిపారు. ఈ నెల 12న ముంబైలో ఎన్‌సిపి నాయకుడు, మాజీ మంత్రి బాబా సిద్ధికీని బిష్ణోయ్ గ్యాంగ్ కాల్చి చంపిన సంగతి తెలిసిందే. అనంతరం వివిధ రాష్ట్రాల్లో కార్యకలాపాలు నిర్వహిస్తున్న లారెన్స్, అన్మోల్ బిష్ణోయ్ ముఠాల సభ్యులను పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి భారీగా ఆయుధాలు స్వాధీనం చేసుకున్నారు. తమకు అందిన సమాచారం ప్రకారం బిష్ణోయ్ సిండికేట్ సభ్యుడు రితేష్‌ను ఈ నెల 23న అరెస్టు చేసినట్లు ఒక సీనియర్ పోలీస్ అధికారి తెలిపారు. రితేష్ ఇచ్చిన సమాచారం ఆధారంగా రాజస్థాన్‌లో దాడులు నిర్వహించామన్నారు. గంగానగర్‌లో ముఠాకు చెందిన సుఖ్‌రామ్‌ను అరెస్టు చేశామన్నారు. ఈ నెల 24న పంజాబ్‌లోని అబోహర్‌లో సాహిల్, అమర్‌లను, హర్యానాలోని సిర్సాలో బాదల్, ప్రమోద్, సందీప్‌లను ప్రత్యేక బృందాల పోలీసులు అరెస్టు చేశారు. అన్మోల్, నవీన్ అలియాస్ అర్జూల సూచనల మేరకు నిందితులు పనిచేస్తున్నట్లు తమ ప్రాథమిక విచారణలో తేలినట్లు ఆ అధికారి తెలిపారు. రాజస్థాన్‌లో సునీల్ పహల్వాన్‌ను, మాజీ ఎమ్మెల్యే రాజ్‌కుమార్ గౌర్ మేనల్లుడిని హత్య సహా పలు లక్ష్యాలతో ఆ గ్యాంగ్‌లు పనిచేస్తున్నాయన్నారు.



మీకోసం

ఐదు మిరియాలు, రెండు యాలకులు, చిన్న దాల్చిన చెక్క ముక్కను మెత్తటి పొడిలా చేసుకోవాలి. ఈ మిశ్రమాన్ని వేడి నీళ్లల్లో వేసి ఐదు నిమిషాలు మరిగించాలి. ఆపై ఆ నీళ్లను ఫిల్టర్ చేసుకుని అందులో ఒక టేబుల్ స్పూన్ తేనె కలిపి ప్రతి రోజూ ఉదయాన్నే తాగడం వల్ల గొంతులో పేరుకుపోయిన కఫం కరిగిపోతుంది.

జీవన సౌరభం

వేచి వుంటే అవకాశాలు వస్తాయి. కానీ, అవి దూసుకుపోయే వాళ్లు వదిలేసినవి.

నక్క మామ! భలే భలే!



వెలుగుల పల్లె అనే ఊర్లో పిల్లలందరూ దీపావళి పండుగను సరదాగా చేసుకుంటారు. ఆ రాత్రి బాణాసంచాలతో వెలుగులు చిందిస్తారు. పండగ రెండు వారాలు ఉందనగా ఆ ఊరి పిల్లలు మతాబు సామాన్లు కొని తెచ్చారు. పగలంతా వాటిని ఆరుబయట ఎండలో ఆరబెట్టారు.

ఆ ఊరి పక్కనే చిట్టడవి ఉంది. అడవిలో కుందేళ్లు, నక్కలు, కోతులు చాలా ఉన్నాయి. కుందేళ్లు అప్పుడప్పుడూ ఊర్లో వచ్చి తిరుగుతుంటాయి. దీపావళి రోజుల్లో పిల్లలు ఆరబెట్టుకున్న మతాబు సామాన్లు ఎత్తుకుపోయేవి.

కుందేళ్లు తీసుకుపోయిన మతాబులను, అక్కడే కాచుకు కూర్చున్న కోతులు ఎత్తుకుపోయేవి. ప్రతి ఏడాదీ ఇదే తంతు. కోతులకు భయపడిన కుందేళ్లు వాటిని ఎదిరించేవి కావు. కొన్ని కుందేళ్లు ఎదిరించినా కోతులు వాటిని గోళ్లతో రక్కేవి.

దీపావళి ముందు రోజు కుందేళ్లన్నీ దిగాలు ముఖాలు వేసుకుని కూర్చున్నాయి. అటువైపుగా ఒక నక్క వచ్చింది. అది కుందేళ్లను చూసి జాలి పడుతూ, 'ఏం అలా ఉన్నారు?' అని ప్రశ్నించింది.

కుందేళ్లు కన్నీళ్లు కారుస్తూ కోతుల నిర్వాకం గురించి చెప్పాయి. అప్పుడు నక్క వాటి చెవిలో ఒక మాట చెప్పింది.

కుందేళ్లు ఈసారి ఊర్లోకి వెళ్లి సీమ టపాకాయలు, బాంబులు తెచ్చాయి. దీపావళి రోజు సాయంత్రం, కోతులు ఇంకా చెట్ల మీదకి రాని సమయంలో ఆ చెట్ల కింద సీమ టపాకాయలు, బాంబులు అమర్చాయి. వాటి మీద చిన్న చిన్న రెమ్మలు, కొమ్మలు వేసాయి.

రాత్రి అయింది. చెట్టు మీద కోతులు మతాబులు వెలిగించి సంబరాలు చేసుకున్నాయి. వాటి వెలుగులు పూర్తికాగానే కిందకు విసిరాయి. ఆ మతాబుల నిప్పు పూర్తిగా ఆరలేదు కదా! సీమ టపాకాయల మీద, బాంబుల మీద పడి అవి అంటుకున్నాయి. అన్నీ ఒక్కసారిగా 'ఢాం! ఢాం!' అని గుండెలదిరేటట్లు పేలడం ప్రారంభించాయి. చెట్టు మీద కోతులన్నీ ఆ శబ్దానికి అదిరిపోయాయి. ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని కొమ్మ కొమ్మ దాటుకుంటూ పారిపోయాయి. అది చూసిన కుందేళ్లు గంతులు వేస్తూ ఎంతో ఆనందించాయి. 'నక్క మామ భలే! భలే! పసందు భలే! భలే!' అనుకుంటూ మురిసి పోయాయి.

– బెహరా ఉమామహేశ్వరరావు,
92900 61336.

గజిబిజి

పిల్లలూ, ఇక్కడ ఆంగ్లంలో ఇచ్చిన పదాలు పక్కనే ఉన్న గళ్లల్లో గజిబిజిగా ఉన్నాయి. ఏ పదం ఎక్కడ ఉందో మీరు కనిపెట్టండి.

can, pea, robot, snake, brown, house

u	t	o	b	o	r
r	e	n	i	v	s
p	s	w	c	a	n
p	u	o	e	a	a
e	o	r	b	b	k
a	h	b	y	n	e

నేను గీసిన బొమ్మ




ఎల్.మహేష్,
7వ తరగతి,
ఎస్‌కెవిటి ప్రభుత్వ హైస్కూలు,
రాజమహేంద్రవరం,
తూర్పు గోదావరి జిల్లా.



పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

అది తల్లులతో, పసిపిల్లలతో యుద్ధం!

పుట్టిన బిడ్డకి కడుపునిండా పాలివ్వలేని అసహాయత ఆ తల్లిది. పోషకాహార లోపంతో ఐదు నెలలు కూడా నిండకుండానే వాడి పసి గుండె ఆగిపోబోతుంటే.. ఆస్పత్రికి పరుగెత్తింది. గుండెలవిసేలా ఏడుస్తూ బిడ్డ ప్రాణం కాపాడండని డాక్టర్ల కాళ్లావేళ్ల పడింది. కన్నీళ్లతో కళ్లు మూసుకుపోతున్నాయి. ఆకలితో కాళ్లు తడబడుతున్నాయి. అయినా బిడ్డని కాపాడుకోవాలని ఆరాటపడుతోంది. 'వాడు పుట్టినప్పటి నుంచీ ఆకలితోనే ఉన్నాడు. ఎలాగైనా వాడిని బతికించండి' అని గుండెలు బాదుకుంటూ ఏడుస్తోంది. కానీ ఆమెకి తెలుసు.. అక్కడ తన చిన్నబిడ్డ గుండెని కాపాడే ఏ వసతులూ లేవని.. అయినా చూస్తూ చూస్తూ బిడ్డ ప్రాణం చంపుకోలేకపోతోంది. పోషకాహార లోపంతో బాధపడుతున్న పిల్లల దీనావస్థని చూడలేని ఎందరో అమ్మల ప్రతినిధి ఈ పాలస్తీనా తల్లి. ఇజ్రాయిల్ చేస్తున్న నరమేధానికి రోజురోజుకి తీసికట్టుగా తయారవుతున్న పాలస్తీనా తల్లులు, బిడ్డల పరిస్థితిని ఈ ఉదంతం కళ్లకు కడుతోంది.



ఈ ఏడాది జూన్‌లో 28 ఏళ్ల నూర్ ఆస్పత్రిలోని పిల్లల వార్డు ముందు నుంచొని బోరున విలపిస్తోంది. మాటిమాటికీ డాక్టర్ల చేతుల్లో అచేతనంగా పడిఉన్న తన బిడ్డ అజీజ్ వైపు దీనంగా చూస్తోంది. అప్పటికే అతని గుండె ఆగిపోయి ఉంది. ఆ గుండెని తిరిగి కదిలించాలని డాక్టర్లు విశ్వ ప్రయత్నం చేస్తున్నారు. హాస్పటల్‌లో జనరేటరు కూడా లేకపోవడం వల్ల మిణుకుమిణుకు మంటున్న లాంతర్ల వెలుగులోనే చికిత్స అందిస్తున్నారు. పిల్లవాడికి ఆక్సిజన్ అందించే పరికరాలు అక్కడ లేవు. తమ చేతుల్తోనే గుండెకి రక్త సరఫరా చేయాలని బిడ్డ ఊపిరితిత్తులపై రుద్దుతున్నారు. కొన్ని నిమిషాల పాటు ఈ ప్రక్రియ జరిగింది. అయినా అక్కడి హార్ట్ రేట్ మానిటర్‌లో అడ్డగీతలో ఏవిధమైన మార్పూ లేదు. అయినా డాక్టర్ల ప్రయత్నం ఆపలేదు. అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయిన బిడ్డ పల్స్ తెప్పించడం కోసం ఎన్నో ప్రయత్నాలు చేస్తున్నారు. అప్పుడు ఆ బాబు ఎలా ఉన్నాడంటే.. పొట్ట ఉబ్బిపోయి ఉంది. కాళ్లు చేతులు ఊచల్లాగా సన్నగా ఉన్నాయి. ఆ వయసు పిల్లలు సాధారణంగా పుట్టినప్పటి బరువుకంటే రెట్టింపు ఉంటారు. కానీ తను పుట్టినప్పుడే తక్కువ బరువుతో పుట్టాడు.

ఆకలితో అలమటిస్తున్నారు..

పాలస్తీనాపై ఇజ్రాయిల్ చేస్తున్న నరమేధంలో ఆకలికేకలు ఎప్పటినుండో మొదలయ్యాయి. గాజా మొత్తం ఇంధనం, ఆహారం, నీళ్ల సరఫరాని నిలిపివేశారు. అప్పటికే నూర్ ఆరునెలల గర్భవతి. మొదటి బిడ్డ కోసం ఎదురుచూస్తోంది. కమలా అద్వాన్ ఆస్పత్రిలో నర్సుగా స్వచ్ఛందంగా సేవలు చేస్తోంది. కానీ 2023 డిసెంబరులో ఇజ్రాయిల్ సైన్యం ఆ ఆస్పత్రిపై దాడి చేసి వందలమంది హెల్త్ వర్కర్లను బందీలను చేసింది. ప్రసవతేదీ దగ్గరపడుతున్న నూర్, జబలియా శరణార్థ శిబిరానికి చేరుకుంది.

గడ్డి తిని బతికాను..

'ఆ శరణార్థ శిబిరంలోని వేలాదిమందిలో నేనొకదాన్ని. అక్కడ తాజా ఆహారం లేదు. అసలు ఆహారమే లేదు. పగలు, రాత్రి అల్పాహారమే తిన్నాను. మార్కెట్లో కూరగాయలు, పండ్లు లేవు. చాలామంది జంతువులు తినే గడ్డిని తిని కడుపు నింపుకుంటున్నారు. నేను కూడా వారిలాగే కొన్ని రోజులు గడ్డి తిన్నాను. విమానాల ద్వారా యునైటెడ్ స్టేట్స్, జోర్డాన్ పంపిన ఆహారపొట్లాల కోసం నా భర్త చాలాదూరం పరుగెత్తేవాడు. కానీ అవి అందకుండా నేలపాలయ్యేవి. అందినవి కూడా పాచిపోయి ఉండేవి' అని నూర్ ఆస్పత్రి ముందు కూర్చొని ఏడుస్తూ చెబుతోంది.

గర్భిణీకి అందాల్సిన పోషకాహారం నూర్‌కి అందలేదు. కనీసం తాగేందుకు నీళ్లు కూడా దొరకని పరిస్థితి ఆమెది. 'శిబిరంలో చాలా ఇరుకుగా ఉండేది. చుట్టూ మురికినీరు నదిలా ప్రవహించేది. వాటిలో శవాలు కొట్టుకొచ్చేవి. నేను వర్షపు నీరు తాగి దాహం తీర్చుకునేదాన్ని' అంటున్న నూర్‌కి జనవరిలో ఒక రోజు రాత్రి ప్రసవనొప్పులు మొదలయ్యాయి.

అప్పటికే ఆ ప్రాంతంలో ఇజ్రాయిల్ బాంబుల వర్షం కురిపిస్తోంది. వాహనాల్లో వెళితే సైన్యం బాంబుదాడి చేస్తుందని భయపడి కాలినడకనే నూర్ ఆస్పత్రికి చేరుకుంది. గాజాలో చాలా రోజులు నైనితాల్ యూనిట్ దీపాల వెలుగులో వైద్యం చేస్తున్న ఒకే ఒక్క ఆస్పత్రి కమలా అద్వాన్. అక్కడికి చేరుకున్న నూర్, ఆ దీపాల కాంతిలోనే బిడ్డని ప్రసవించింది. ఆ నవజాత శిశువును తీసుకుని తన భర్తతో కలసి ఆ రోజురాత్రే 2 కిలోమీటర్లు నడిచి శిబిరానికి చేరుకుంది.

నూర్, బిడ్డని ప్రసవించే సమయానికి ఆ శిబిరంలో 9 మంది కలసి ఒక భోజనంతో సరిపెట్టుకుంటున్నారు. ఆ ఆహారం నూర్‌కి సరిపోవడం లేదు. పాలు లేక బిడ్డ ఆకలితో ఏడ్వని రోజు లేదు. 'నా బిడ్డ తీవ్ర డీహైడ్రేషన్‌తో బాధపడుతున్నాడని నాకు అర్థమైంది. కానీ ఏమీ చేయలేను. పుట్టిన 20 రోజులకే వాడికి డయేరియా వచ్చింది. జ్వరంతో బరువు తగ్గిపోయాడు. దొరికిన ఆహారాన్ని బాగా మిక్సీ చేసి వాడికి పట్టించాలని ఎంతో తాపత్రయపడ్డాను. కానీ వాడికి సరిపడలేదు. రెండు నెలలకే ఆస్పత్రిపాలయ్యాడు. ఐసియులో ఉంచారు. అక్కడ నా బిడ్డల్లాంటి వాళ్లని ఎంతోమందిని చూశాను. అందరూ అస్తిపంజరాల్లా ఉన్నారు' అని నూర్ ఆ పరిస్థితిని గుర్తుచేసుకుంది.

కుదుటపడుతున్నాడనుకున్నా..


మే నెలకి వచ్చేసరికి అజీజ్ ఆరోగ్యం కాస్త మెరుగుపడింది. ఇంకొన్ని రోజులకు పూర్తిగా కోలుకుంటాడని నూర్ అనుకుంది. కానీ ఈలోగా ఆ ఆస్పత్రిపై ఇజ్రాయిల్ మరోసారి దాడి చేసింది. 'నేను బస చేసిన గది పక్కనే ఇజ్రాయిల్ రాకెట్ బాంబు ప్రయోగించింది. భయంతో వణికిపోయాను. చికిత్స మధ్యలో ఉన్న నా బిడ్డని తీసుకుని బయటికి పరుగెత్తాను. ఆస్పత్రుల్లో కూడా మాకు రక్షణ లేదు' అంటూ రోదిస్తున్న నూర్ లాంటి తల్లులు అక్కడ ఎంతోమంది.

వార్డంతా ఆకలి కేకలే..

మే నెలాఖరుకల్లా అజీజ్ ఆరోగ్యం మళ్లీ విషమించింది. ఈ పరిస్థితుల్లోనే నూర్ మరోసారి ఆస్పత్రికి వెళ్లింది. అక్కడ.. పిల్లల ఆకలి కేకలతో వార్డు అంతా గగ్గోలు పెడుతోంది. అమ్మానాన్నలు, అవ్వాతాతలంతా దిగాలుగా కూర్చొని ఉన్నారు. వైద్యులు మౌనంగా, నర్సులు పిల్లల పల్స్ చూస్తూ ఉన్నారు. అందరి ముఖాల్లోనూ విషాదఛాయలే.

యుద్ధం పిల్లలపై ఎంత తీవ్ర ప్రభావాన్ని చూపుతుందో అనడానికి గుండెలు పిండేసే మరో ఉదంతం కూడా అక్కడ ఉంది. ఈ ఏడాది ఫిబ్రవరిలో హనాన్, ఆమె భర్త మహ్మద్ వారి రెండేళ్ల కొడుకును పాతిపెట్టారు. 'ఆహారం లేక బిడ్డ రోజురోజుకూ నీరసించి పోయాడ'ని హనాన్ ఏడుస్తూ చెప్పింది. 'వాడు కూర్చోలేదు. నడవలేదు. ఆస్పత్రికి తీసుకెళ్లిన రెండురోజులకే చనిపోయాడు. అక్కడ వైద్యం చేసే వసతులు లేవు. మందులు లేవు. యంత్రాలు పనిచేసేందుకు కరెంటు లేదు. యుద్ధానికి ముందు మా బిడ్డల చదువులు, వారి పెళ్లిళ్ల గురించి ఆలోచించాం. కానీ ఇప్పుడు పిల్లలకు ఆహారం, నీరు ఎలా అందించాలని మాత్రమే ఆలోచిస్తున్నాం' అని మహ్మద్ చెబుతున్నప్పుడు బాధతో అతని గొంతు జీరబోయింది.

గాజాలో కరువు ఏర్పడుతోందని ఈ ఏడాది జులైలో ఐక్యరాజ్యసమితి నిపుణులు హెచ్చరించారు. గాజా ప్రజల్లో 96 శాతం మందికి ఆహారభద్రత లేదని చెప్పారు. దాడులు మొదలైన 2023 అక్టోబరు నుండి ఇప్పటివరకు 38 మంది పోషకాహార లోపంతో మరణిస్తే వాళ్లల్లో ఒక్కరు తప్ప అందరూ చిన్నారులే అని చెప్పింది. పోషకాహార లోపంతో బాధపడుతున్న 50 వేల మంది చిన్నారులకు తక్షణ వైద్యం అవసరమని చెప్పింది.



'క' ట్రైలర్ విడుదల

కిరణ్ అబ్బవరం నటిస్తున్న భారీ పీరియాడిక్ థ్రిల్లర్ సినిమా 'క' నుండి తాజాగా ట్రైలర్ విడుదలైంది. ఈ సినిమాలో నయన్ సారిక, తన్వీ రామ్ హీరోయిన్లుగా నటించారు. దర్శక ద్వయం సుజీత్, సందీప్ విలేజ్ బ్యాక్ డ్రాప్ యాక్షన్ థ్రిల్లర్ కథతో ఈ సినిమాను తెరకెక్కించారు. ఈ నెల 31న దీపావళి పండుగ సందర్భంగా తెలుగుతో పాటు తమిళ, మలయాళ, కన్నడలో ఈ చిత్రం విడుదలకు సిద్ధంగా ఉంది. ఈ సందర్భంగా చిత్ర ట్రైలర్‌ని విడుదలచేశారు. 'కృష్ణగిరి అనే అందమైన ఊరిలో పోస్ట్ మ్యాన్‌గా పనిచేస్తుంటాడు అభినయ వాసుదేవ్. మధ్యాహ్నమే చీకటి పడే ఆ ఊరు భౌగోళికంగా ఎంతో ప్రత్యేకం. అక్కడ సత్యభామ అనే అందమైన అమ్మాయితో ప్రేమలో పడతాడు వాసుదేవ్. ఉత్తరాలు పంచే క్రమంలో 1979 ఏప్రిల్ 22న అభిషేక్ పేరుతో వచ్చిన ఉత్తరం వాసుదేవ్ జీవితాన్ని మలుపు తిప్పుతుంది. ఆ ఉత్తరంలో ఏముందో చెప్పమంటూ ఓ ముసుగు వ్యక్తి వాసుదేవ్‌ను బెదిరిస్తాడు. ఆ ఉత్తరంలో ఏముంది?, వాసుదేవ్‌ను ఆ ముసుగు వ్యక్తి, అతని గ్యాంగ్ ఎందుకు వెంటాడుతున్నారు?' అనే అంశాలతో ఈ చిత్రాన్ని రూపొందించారు.

'300 యోధులు' లైన్‌తో



సాయిధరమ్ తేజ్ హీరోగా తెరకెక్కుతోన్న 18వ సినిమాతో రోహిత్ కెపి అనే యువకుడు దర్శకుడిగా పరిచయమవుతున్నాడు. నిరంజన్ రెడ్డి చైతన్య రెడ్డి ఈ సినిమాని ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. సుమారు రూ.125 నుంచి రూ.150 కోట్ల వరకు ఈ సినిమా బడ్జెట్ ఉంటుందనే ప్రచారం జరుగుతోంది. తాజాగా ఈ విషయం మీద సాయి ధరమ్‌తేజ్ స్పందించారు. తెలుగు వారందరికీ బాగా కనెక్ట్ అయి సూపర్ హిట్ చేసిన 300 యోధులు అనే సినిమా కథను ఆధారంగా చేసుకుని ఈ లైన్ రాసుకున్నారని ఆయన చెప్పారు. 'ఆడియన్స్ కోసం ఎన్నో సర్ప్రైజ్‌లను ఈ సినిమాలో దాచాం' అని ఈ సందర్భంగా వెల్లడించారు. 'తెలుగు అభిమానులందరూ ఇది మా సినిమా అని గర్వంగా చెప్పుకునేలా సినిమా ఉంటుందని, ఈ సినిమాకి సంబంధించిన షూటింగ్ ఇప్పటికే 30 శాతం పూర్తయిన'ట్లు కూడా చెప్పారు. ఏబీపీ నిర్వహిస్తున్న 'ది సదరన్ రైజింగ్ సమ్మిట్ 2024'లో పాల్గొన్న ఆయన పైవిషయాలు మాట్లాడారు.

రాజమౌళి టచ్ చేయని జోనర్ సినిమా ఇది..



అల్లు అర్జున్, త్రివిక్రమ్ కాంబినేషన్లో ఓ సినిమా రానున్న సంగతి తెలిసిందే. తాజాగా ఆ చిత్రం గురించి నిర్మాత నాగవంశీ ఆసక్తికర కామెంట్స్ చేశారు. 'అల్లు అర్జున్, త్రివిక్రమ్‌ల సినిమా స్క్రిప్ట్ పనులు చివరిదశలో ఉన్నాయి. 'పుష్ప 2' పూర్తయ్యాక దీని వివరాలు వెల్లడిస్తాం. జనవరిలో స్పెషల్ ప్రోమోతో సినిమాను ప్రకటిస్తాం. మార్చి నుంచి షూటింగ్ ప్రారంభిస్తాం. మార్చిలోనే అల్లు అర్జున్ చిత్రీకరణలో పాల్గొంటారు. ఇప్పటివరకు రాజమౌళి ఎన్నో గొప్ప సినిమాలు చేశారు. ఆయన కూడా టచ్ చేయని జానర్‌లో ఈ సినిమా ఉంటుంది. మంచి విజువల్స్ ఉంటాయి. ఇప్పటివరకు దేశంలో ఎవరూ చూడని కొత్త ప్రపంచాన్ని సృష్టించనున్నాం. ఎంతో ప్రతిష్టాత్మకంగా దీన్ని రూపొందిస్తున్నాం' అని అన్నారు.

అనుష్కతో త్వరలో 'భాగమతి 2'



టాలీవుడ్ హీరోయిన్ అనుష్క తన కొత్త సినిమా కోసం ఎదురు చూస్తున్నారు. గతేడాది మిస్ షెట్టి..మిస్టర్ షెట్టి సినిమా తర్వాత ఆమె ఏడాది పాటు విరామం తీసుకున్నారు. మలయాళంలో ఆమె నటించిన 'కథనార్' చిత్రం త్వరలోనే విడుదల కానుంది. బాహుబలి-1 తర్వాత సైజ్ జీరో సినిమాతో ఆమె అనారోగ్య సమస్యలను ఎదుర్కొన్నారు. ఆ తర్వాత చేసిన రుద్రమదేవి, నిశ్శబ్దం వంటి సినిమాల్లో ఫుల్ లెంగ్త్ క్యారెక్టర్లు చేశారు. వీటి తర్వాత సింగం 3, ఊపిరి, సోగ్గాడే చిన్ని నాయనా చిత్రాల్లో గెస్ట్ అప్పీరియన్స్‌లా కనిపించారు. 2018లో వచ్చిన 'భాగమతి' చిత్రం భారీ విజయాన్ని అందుకుంది. కెరీర్ ఆరంభంలో వచ్చిన 'వేదం' వంటి కల్ట్ చిత్రాన్ని అందించిన క్రిష్ జాగర్లమూడి దర్శకత్వంలో తెరకెక్కుతున్న మరో సినిమా షూటింగ్ తుది షెడ్యూల్‌లో కొనసాగుతోంది. ఆ తర్వాత 'బాగమతి'కి సీక్వెల్‌గా 'బాగమతి' పట్టాలెక్కనున్నట్లుగా సమాచారం.

ప్రేక్షకులు మెచ్చే పాత్రల్లో నటిస్తా : రూపలక్ష్మి

కుటుంబ కథతో సమాజంలో మంచి జరిగేలా ఇతివృత్తంలో వచ్చే సినిమాల్లో పాత్రల్లో చేయటం ద్వారా మంచి నటిగా గుర్తింపు పొందేందుకు ప్రయత్నిస్తానని క్యారెక్టర్ ఆర్టిస్ట్ వివిఎన్ రూపలక్ష్మి అన్నారు. తన కుటుంబ సభ్యులతో విజయవాడలోని శ్రీ దుర్గామల్లేశ్వరస్వామి ఆలయాన్ని ఆమె శుక్రవారం సందర్శించారు. యాత్రికులతో సందడిగా గడిపారు. ఆమెతో సెల్ఫీలు దిగేందుకు యాత్రికులు పోటీపడ్డారు. ఈ సందర్భంగా రూపలక్ష్మి మీడియాతో మాట్లాడుతూ, సినిమాల్లో నటించాలనే బలమైన కోరికతో పరిశ్రమలోకి అడుగు పెట్టానన్నారు. ఈటీవీ పలు ధారావాహిక కార్యక్రమాల్లోనూ, పలు షార్ట్‌ఫిల్మ్స్‌లో నటించి గుర్తింపు తెచ్చుకున్నానన్నారు. తర్వాత సినిమా అవకాశం వచ్చిందని చెప్పారు. 'బలగం' ఫేమ్‌గా బాగా గుర్తింపు వచ్చిందన్నారు. జయ జానకి నాయక, వినయ విధేయ రామ, సుబ్రహ్మణ్యం ఫర్ సేల్, నా సామిరంగ, దేవర, మట్కా తదితర సినిమాల్లో నటించానన్నారు. కొత్తగా వచ్చే సినిమాల్లో తాను ఎక్కువ హీరోలకు అమ్మపాత్రల్లో ఉంటున్నానని వివరించారు.

ఓటీటీలో 'శ్వాగ్' స్ట్రీమింగ్

ఇటీవల థియేటర్లలో విడుదలై ఓ ప్రయోగాత్మక చిత్రంగా పేరు తెచ్చుకున్న 'శ్వాగ్' ఓటీటీకి వచ్చేసింది. శ్రీ విష్ణు, మీరా జాస్మిన్, రీతూవర్మ, దక్షా నగార్కర్, సనీల్ ప్రధాన పాత్రలు పోషించారు. 'రాజ రాజ చోర' విజయం తర్వాత హసిత్ గోలి ఈ సినిమాకు దర్శకత్వం వహించారు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై టీజీ విశ్వప్రసాద్ నిర్మించారు. ఈనెల నాలుగో తేదీన 'శ్వాగ్' థియేటర్లలో విడులైన విషయం తెలిసిందే. 20 రోజుల్లోనే ఈ సినిమా అమెజాన్ ప్రైమ్ వీడియోలో ఓటీటీలోకి వచ్చేంది.

కష్టాల్లో టీమిండియా

- తొలి ఇన్నింగ్స్‌లో 156 పరుగులకే కుప్పకూలిన భారత్
- 301 పరుగుల ఆధిక్యతలో న్యూజిలాండ్

పూణే : రెండో టెస్ట్‌లోనూ టీమిండియా బ్యాటర్ల చెత్త ప్రదర్శన కొనసాగుతూనే ఉంది. తొలి టెస్ట్‌లో ఘోర పరాజయాన్ని చవిచూసిన భారత్.. రెండో టెస్ట్ తొలి ఇన్నింగ్స్‌లో కేవలం 156పరుగులకే కుప్పకూలింది. న్యూజిలాండ్‌ను తొలి ఇన్నింగ్స్‌లో 259పరుగులకు పరిమితం చేసినా టీమిండియా బ్యాటర్లు రాణించలేక పోయారు. భారీ స్కోర్ అందించి జట్టును గట్టెక్కించాల్సిన బ్యాటర్లు చేతులెత్తేశారు. దీంతో టీమిండియా 156 పరుగులకే పరిమితం కాగా.. న్యూజిలాండ్‌కు 103పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యత లభించింది. అనంతరం రెండో ఇన్నింగ్స్ ఆరంభించిన న్యూజిలాండ్ జట్టు రెండోరోజు ఆట ముగిసే సమయానికి 5 వికెట్ల నష్టానికి 158పరుగులు చేసింది. దీంతో ఆ జట్టు ఇప్పటికే 301పరుగుల ఆధిక్యతను సంపాదించింది. దీంతో న్యూజిలాండ్ పుణే టెస్టులోనూ పట్టు బిగిస్తోంది.

ఓవర్‌నైట్ స్కోర్ వికెట్ నష్టానికి 16పరుగులతో రెండోరోజు ఆటను కొనసాగించిన భారత్‌ను సాంట్నర్ (7/53) అద్భుత బౌలింగ్‌తో కట్టడి చేశాడు. తొలి సెషన్‌లోనే శుభ్‌మన్ గిల్(30) వికెట్ తీసిన సాంట్నర్.. ఆ తర్వాత విరాట్ కోహ్లీ(1)ను బౌల్డ్ చేశాడు. ఇక యశస్వీ జైస్వాల్(30)ను గ్లెన్ ఫిలిఫ్స్ బోల్తా కొట్టించాడు. అంతే.. అక్కడితో భారత ఇన్నింగ్స్ పేకమేడను తలపించింది. రిషభ్ పంత్(18), సర్ఫరాజ్ ఖాన్(11)లు ధాటిగా ఆడ బోయి ఔటయ్యారు. చివర్లో రవీంద్ర జడేజా(38), వాషింగ్టన్ సుందర్(18) ఆచి తూచి ఆడడంతో టీమిండియా 150 పరుగుల మార్క్‌ను దాటింది.



మళ్లీ సుందరే

తొలి ఇన్నింగ్స్‌లో 7వికెట్లతో న్యూజిలాండ్ నడ్డివిరిచిన సుందర్(4/56) రెండో ఇన్నింగ్స్‌లోనూ వికెట్ల వేట కొనసాగించాడు. తొలుత ఓపెనర్ డెవాన్ కాన్వే(17)ను ఎల్బీగా ఔట్ చేసి బ్రేకిచ్చాడు. మరోవైపు అశ్విన్ తన మ్యాజిక్ చూపిస్తూ విల్ యంగ్(23)ను వికెట్ల ముందు దొరకబుచ్చుకున్నాడు. రచిన్ రవీంద్ర(9), డారిల్ మిచెల్(18)లను సుందర్ పెవీలియన్‌కు చేర్చాడు. ఓపెనర్ టామ్ లాథమ్(86) మాత్రం క్రీజులో పాతుకుపోయాడు. మిచెల్ ఔటయ్యాక టామ్ బ్లండెల్(30 నాటౌట్)తో కలిసి కీలక భాగస్వామ్యం నెలకొల్పాడు. వీరు ఐదో వికెట్‌కు 60 పరుగులు జోడించాడు. ఈ జోడీని సుందర్ విడదీశాడు. సెంచరీ దిశగా దూసుకెళ్తున్న డేంజరస్ లాథమ్‌ను ఎల్బీగా వెనక్కి పంపాడు. అనంతరం గ్లెన్ ఫిలిఫ్స్(9 నాటౌట్) ఆడారు. రెండో రోజు ఆట ముగిసే సరికి న్యూజిలాండ్ 5 వికెట్ల నష్టానికి 198 పరుగులు చేసి.. 301 పరుగుల ఆధిక్యాన్ని సంపాదించింది.

స్కోర్‌బోర్డు...

న్యూజిలాండ్ తొలి ఇన్నింగ్స్: 259/10

ఇండియా తొలి ఇన్నింగ్స్: 156/10

న్యూజిలాండ్ రెండో ఇన్నింగ్స్: లాథమ్ (ఎల్‌బి)సుందర్ 86, కాన్వే (ఎల్‌బి)సుందర్ 17, యంగ్ (ఎల్‌బి)అశ్విన్ 23, రచిన్ రవీంద్ర (బి)సుందర్ 9, మిఛెల్ (సి)జైస్వాల్ (బి)సుందర్ 18, బ్లండెల్ (బ్యాటింగ్) 30, ఫిలిప్స్ (బ్యాటింగ్) 9, అదనం 6. (53ఓవర్లలో 5వికెట్ల నష్టానికి) 198పరుగులు. **వికెట్ల పతనం:** 1/36, 2/78, 3/89, 4/123, 5/183 **బౌలింగ్:** అశ్విన్ 17-1-64-, సుందర్ 19-0-56-4, జడేజా 11-1-50-0, బుమ్రా 6-1-25-0

సెమీస్‌లో భారత్-ఎకు షాక్

- ఆఫ్ఘనిసాన్ చేతిలో 20 పరుగులు తేడాతో ఓటమి
- ఎమర్జింగ్ ఆసియాకప్ ఫైనల్లోకి ఆఫ్ఘన్-శ్రీలంక

దుబాయ్: ఎమర్జింగ్ ఆసియా కప్ సెమీస్‌లో భారత్-ఎ జట్టు ఓటమిపాలైంది. ఆఫ్ఘనిస్తాన్-ఎతో శుక్రవారం జరిగిన సెమీస్‌లో భారత్-ఎ 20 పరుగుల తేడాతో పరాజయాన్ని చవిచూసింది. తొలిగా బ్యాటింగ్‌కు దిగిన ఆఫ్ఘనిస్తాన్ నిర్ణీత 20 ఓవర్లలో 4వికెట్ల నష్టానికి 206పరుగుల భారీస్కోర్‌ను నమోదు చేసింది. ఛేదనలో యువ భారత్ జట్టు నిర్ణీత 20 ఓవర్లు ముగిసేసరికి 7వికెట్లు కోల్పోయి 186పరుగులే చేయగల్గింది. ఆఫ్ఘనిస్తాన్ ఓపెనర్లు తొలి వికెట్‌కు 137పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పి టీమిండియాను కష్టాల్లో పడేశారు. భారత బౌలర్లలో అందరూ ధారాళంగా పరుగులు సమర్పించుకోగా.. రసిక్ సలామ్ ఒక్కడే 3 వికెట్లతో రాణించాడు. ఛేదనలో ఇండియా-ఎ బ్యాటర్లు నిరాశపరిచినా.. బడోనీ(31), రమణ్‌దీప్ సింగ్(64), నిషాంత్(23) ధాటిగా ఆడినా ప్రయోజనం లేకపోయింది. ఆఫ్ఘనిస్తాన్ బౌలర్లలో ఘజన్‌ఫర్, అబ్దుల్‌కు రెండేసి వికెట్లు దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ సెదికుల్లాహ్ అటల్‌కు దక్కింది.

మరో సెమీస్‌లో శ్రీలంక జట్టు 7వికెట్ల తేడాతో పాకిస్తాన్-ఎపై ఘన విజయం సాధించింది. తొలుత పాకిస్తాన్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 135పరుగులు చేయగా.. శ్రీలంక జట్టు 16.3ఓవర్లలో 3వికెట్ల నష్టానికి 137పరుగులు చేసి గెలిచింది. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ దుషాన్ హేమంతకు దక్కింది. ఆదివారం జరిగే ఫైనల్లో ఆఫ్ఘనిస్తాన్-శ్రీలంక జట్లు టైటిల్‌కై తలపడనున్నాయి.



ఆఫ్ఘన్ ఓపెనర్ల వీర విహారం

ఆఫ్ఘన్ ఓపెనర్లు సెదికుల్లాహ్ అటల్(83), జుబైద్ అక్బరీ(64) అర్ధసెంచరీ లతో కదం తొక్కారు. తొలి ఓవర్ నుంచే భారత బౌలర్లపై ఎదురుదాడికి దిగిన వీరు తొలి వికెట్‌కు 14.1ఓవర్లలో 137పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. జుబైద్ 41బంతుల్లో 5ఫోర్లు, 4సిక్సర్ల సాయంతో 64పరుగులు చేయగా.. సెదికుల్లాహ్(83; 52బంతుల్లో 7ఫోర్లు, 4సిక్సర్లు) ఆకాశమే హద్దుగా చెలరేగి ఆడాడు. ఈ టోర్నమెంట్‌లో ఒక వికెట్‌కు ఇదే అత్యుత్తమ భాగసామ్యం. భారత కెప్టెన్ తిలక్ వర్మ ఎన్ని ప్రయత్నాలు చేసినా ఈ ఇద్దరూ బౌండరీలు, సిక్సర్లతో విరుచుకుపడ్డారు. చివరకు అకీబ్ ఖాన్ బౌలింగ్‌లో అటల్ కావడంతో భారత బౌలర్లు ఊపిరిపీల్చుకున్నారు. అప్పటికే జరగాల్సిన నష్టమంతా జరిగిపోయింది. ఆల్‌రౌండర్ కరీమ్ జనత్ (41) సైతం రెచ్చిపోయి ఆడాడు. కేవలం 20 బంతుల్లోనే 4 ఫోర్లు, 2 సిక్సర్లతో విరుచుకుపడ్డాడు. అతడికి తోడు ఓపెనర్ అటల్ కూడా దంచడంతో అఫ్గన్ జట్టు నిర్ణీత ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 206 పరుగులు చేసింది.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68